అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 19-8-2017 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 232 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

కూలీలకు బేడీలు

భూపోరాట కేసుల్లో కోర్టుకు నిందితుల తరలింపు

కరీంనగర్‌లో ఘటన.. సుప్రీం ఆదేశాలు బేఖాతరు



మొన్న ఖమ్మంలో రైతులు.. నేడు కరీంనగర్‌లో కూలీలు.. వాళ్లంతా 'రెక్కాడితేగానీ డొక్కాడని'జీవులే. కానీ ఉగ్రవాదులను, సంఘవిద్రోహ శక్తులను తీసుకెళ్లినట్టు బేడీలతో కోర్టుకు తరలించారు. ఖమ్మంలో మిర్చి పంటకు మద్దతు ధర కోసం ఆందోళనకు దిగిన అన్నదాతలకు బేడీలు వేస్తే... ఇప్పుడు గూడు కోసం పోరాటం చేసిన కరీంనగర్ కూలీలకు సంకెళ్లు బిగించారు. ఈ రెండు ఘటనల్లోనూ సుప్రీం కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కారు. ఏడుగురు కూలీలకు బేడీలు వేసి తరలించారు. అందులో ఐదుగురు దళితులు. ఈ ఘటన కరీంనగర్ జైలు వద్ద శుక్రవారం 'నవతెలంగాణ' కంటబడింది.



కరీంనగర్ జైలు నుంచి దళిత కూలీలకు బేడీలు వేసి కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

2007లో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్‌లో ఇండ్ల స్థలాల కోసం కూలీలు భూపోరాటం చేశారు. స్థలాలు కేటాయించాల్సిన అప్పటి ప్రభుత్వం వారిపై కేసులు నమోదు చేయించింది. అప్పుడు 33 మందిపై కేసులు నమోదయ్యాయి. అందులో కొందరు చనిపోయారు. మరికొందరు కరీంనగర్‌లో పనిలేక ఇతర ప్రాంతాలకు వలసెళ్లారు. దీంతో భూ పోరాట కేసులో కోర్టుకు హాజరుకాలేదు. ఇక నుంచి కోర్టుకు హాజరవుతామని 11 మంది ఈ నెల 17న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రిన్సిపల్ సివిల్ రైట్స్ కోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి జిల్లా జైలుకు రిమాండ్‌కు పంపారు. కోర్టులో పేషి ఉండటంతో గంది కొమురయ్య, పండు రమేశ్, దొంతి శంకర్, మారుపాక దేవరాజ్, బొమ్మదేని ఆగయ్య అనే దళితులకు సంఘవిద్రోహ శక్తులకు వేసినట్టు బేడీలు వేసి తరలించారు. దీంతో వారు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. ఆ 11 మందిలో నలుగురు మహిళలు ఉన్నారు. కూలీలకు బేడీలు వేసిన ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వృద్ధిరేటు ఘనం.. ఉద్యోగాలు శూన్యం?

నోట్ల రద్దుతో 3 నెలల్లోనే 15 లక్షల ఉద్యోగాలు గాయబ్ : సీఎంఐఈ

- ధరల పెరుగుదలపై 62 శాతం, నిరుద్యోగంపై 53 శాతం మందిలో తీవ్ర వ్యతిరేకత
- మోడీ ప్రభుత్వంపై 'ఇండియాటుడే' జాతీయ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం దేశ ఆర్థిక పరిస్థితి మొత్తంమీద బాగున్నది. వృద్ధి పథంలో నడుస్తున్నది. తాము అధికారం చేపట్టిన తర్వాత ఈ మూడేండ్ల పాలనలో ఆర్థిక సుస్థిరత, క్రమశిక్షణ సాధించామని ప్రధాని మోడీ నేతృ త్వంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న మాట. అయితే,యువతకు ఉద్యోగాలు కల్పించడంలో, నూతన ఉద్యోగాల సృష్టిలో ఎందుకు విఫలమవుతున్నారన్న ప్రశ్నకు మాత్రం వారి వద్ద సమాధానం లేదు. ఎన్నికల వేళ తమ మేనిఫెస్టోలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తా మంటూ ఈ దేశంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ ఏమయిందన్న విషయంలో ఆ పార్టీ నేతలు ముఖం చాటే స్తున్న పరిస్థితి. మరోవైపు ఈ ఏడాది వృద్ధి రేట్ ఆశించిన స్థాయిలో ఉండదంటూ ఇటీవలే ...9లో





నయా యాబై

త్వరలో మార్కెట్లోకి..
పాత వాటికి ధోకా లేదు: ఆర్బీఐ

వివరాలు 2లో



ఫ్రీజర్‌లో దాక్కొన్న నటి

స్పెయిన్ ఉగ్రదాడిలో ప్రాణాలు కాపాడుకోవడానికి...

వివరాలు 11లో

ప్రభుత్వరంగ నిర్వీర్యం శ్రామికశక్తి విచ్ఛిన్నం



వివరాలు 2లో

మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్షురాలు హేమలత

పెచ్చరిల్లుతున్న పాలకవర్గాల విధానాలు

- సంఘటితశక్తితోనే సమాధానం చెప్పాలి: సీఐటీయూ అధ్యక్షురాలు కె. హేమలత
- స్ఫూర్తిదాయకంగా ప్రారంభమైన 'ఈఫీ' జాతీయ మహాసభలు

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంపు

- ఎట్టకేలకు యాజమాన్యం అంగీకారం
- పోరాడి సాధించుకున్న కార్మికులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'పోరాడితే పోయేదేం లేదు... బానిస సంకెళ్లుతప్ప' అనే నానుడిని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు నిజం చేశారు. తమ సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేసి ఎట్టకేలకు యాజమాన్యం మెడలు వంచి విజయాన్ని సాధించారు. కేంద్రప్రభుత్వం...9లో

పాఠశాల విద్యార్థులపై తేనెటీగల దాడి



ఇద్దరి పరిస్థితి విషమం

నవతెలంగాణ- గంగాధర

పాఠశాలలో విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగింది.

మధ్యాహ్న భోజన సమయంలో తరగతి గదుల నుంచి విద్యార్థులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. అంతలోనే పాఠశాల భవనం పక్కనున్న చెట్టుపై గల తేనెతుట్టె నుంచి వందలాది తేనెటీగలు విద్యార్థులపై దాడికి దిగాయి. ఒక్కసారిగా ఉరుకులు పరుగులు తీయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే పిల్లల ఆర్తనాదాలు మిన్నంటాయి. చిన్నారులను కాపాడేందుకు పలువురు ఉపాధ్యాయులు ప్రయత్నించగా వారూ దాడికి గురయ్యారు. చాకచక్యంగా పిల్లలందరినీ ...9లో



ఆటోలో విద్యార్థుల తరలింపు

మరో 'గో' దాడి

ముస్లింలను కొట్టిన 'గో రక్షకులు'

- బీహార్‌లో ఘటన
- బాధితులపైనే కేసుపెట్టిన పోలీసులు

పాట్నా : బీఫ్ తింటున్నారన్న పుకార్లతో ఏడుగురు ముస్లింలపై 'గోరక్షకులు' దాడికి తెగబడ్డారు. వారిని తీవ్రంగా కొట్టారు. పశ్చిమ బీహార్‌లోని చంపారన్ జిల్లాలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. గో మాంసం తింటున్నారని పుకార్లు రావడంతో దుమ్రా గ్రామానికి చెందిన మొహమ్మద్ షాహబుద్దీన్ ఇంటిని భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేస్తూ 50 మందికి పైగా 'గో రక్షకులు' చుట్టుముట్టారు. షాహబుద్దీన్ ఇంటిని ...9లో

పనికి ఒప్పుకోలేదని ముక్కు కోశారు

మధ్యప్రదేశ్‌లో దళితురాలిపై అగ్రకుల దురహంకారం

భోపాల్: చేనులో పని చేసేందుకు ఒప్పుకోలేదన్న ఆగ్రహంతో అగ్ర కులానికి చెందిన తండ్రీకొడుకులు.. దళితురాలి ముక్కు కోశారు. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. జిల్లాలోని రజా గ్రామానికి చెందిన సాహెబ్‌సింగ్ ...9లో



వివరాలు 2లో

భూమికి దగ్గరగా ఆస్టరాయిడ్



గులాబీ సేద్యం



తీరు మారని టీఆర్ఎస్ నేతలు...

- ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా కార్పొరేట్ ఒప్పందాలు
- అధిక ధరలకు విత్తనాల అమ్మకం
- మిర్చి కొనుగోళ్ళకు అనధికారిక వసూళ్ళు
- ఆందోళన బాట పట్టిన ఆదివాసీలు

గోదావరి లోయలోని ఏజెన్సీ ప్రాంతంలో గులాబీ మార్కు కార్పొరేట్ సేద్యం కొనసాగుతున్నది. వరుసగా రెండవ సంవత్సరం ఒప్పంద వ్యవసాయం పేరుతో టీఆర్ఎస్ నేతలు మిర్చిసాగు చేస్తున్నారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులైన అధికార పార్టీ నేతలు చేస్తున్న ఈ దందాపై వ్యవసాయ శాఖ మౌనం వహించడం వెనుక రాజకీయ ఒత్తిడులే కారణమని తెలుస్తున్నది. ఒక రాష్ట్ర మంత్రితో పాటూ అధికార పార్టీ ఎమ్మెల్సీ అనుచరులు చేస్తున్న కార్పొరేట్ మిర్చి సేద్యం, వ్యాపారంపై ఆదివాసీలు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా ఏజెన్సీలో చేస్తున్న కార్పొరేట్ సేద్యంపై ఒక కంపెనీకి జయశంకర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నోటీసు జారీ చేసినప్పటికీ దానిని బేఖాతర్ చేయడం విశేషం...

వివరాలు 2లో

కరెంట్ కట్.. భోజనం బంద్

పెద్దపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల పస్తులు

కలెక్టరేట్ ఎదుట పేపర్ ప్లేట్లతో నిరసన



వివరాలు 2లో

కలెక్టరేట్ ముందు పేపర్ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

నయా 'యాబై'..

- త్వరలోనే కరెన్సీ మార్కెట్లోకి..
- పాత వాటికి ఢోకా లేదు: ఆర్బీఐ



న్యూఢిల్లీ: నోట్లరద్దు తర్వాత రూ.2000, రూ.500 నోట్లను మార్కెట్లోకి తెచ్చిన ఆర్బీఐ.. తాజాగా రూ.50 కొత్త కరెన్సీని కూడా అందుబాటులోకి తేబోతున్నది. మహాత్మాగాంధీ సిరీస్‌లో భాగంగా కొత్త రూ.50 నోట్లను ముద్రిస్తున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నోట్లకు వెనుక వైపు ఎర్రకోటకు బదులు.. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పే హంపీ రథోత్సవం బొమ్మతోపాటు స్వచ్ఛ భారత్ లోగో ఉంటాయి. ఈ నోట్లపై ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్ సంతకం ఉంటుంది. కొత్త రూ.50 నోట్ల నమూనా చిత్రాలు ఇప్పుడు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కొత్త కరెన్సీని త్వరలోనే మార్కెట్‌లో ప్రవేశపెడుతామని ఆర్బీఐ తెలిపింది. అయితే పాత రూ.50 నోట్లు ఎప్పటిలాగే చెలామణిలో ఉంటాయని, దీనిపై ఎలాంటి సందేహాలూ అక్కర్లేదని వెల్లడించింది.

హర్యానా పోలీసులు గూండాల్లా వ్యవహరించారు

- జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మోహిత్‌కుమార్ పాండే

చండీగఢ్ : హర్యానా పోలీసులు గూండాల్లా వ్యవహరించారని జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మోహిత్ కుమార్ పాండే ఆరోపించారు. ఈనెల14న జేఎన్‌యూ విద్యార్థిని అసోలా పార్కుకు తన స్నేహితులతో కలిసి వెళ్లింది. పార్కు నుంచి బయటకు వస్తున్న ఆమెను కొందరు గుండాలు గమనించారు. అనంతరం ఆమెను కొంత దూరం వెంబడించారు. లైంగికదాడికి పాల్పడతామని బెదిరించారు. వేధింపులను ఆపేందుకు ప్రయత్నించిన ఆమె స్నేహితులను చితకబాదారు. దీంతో, ఆ యువతి సురాజ్‌కుంద్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. అయితే, ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన ఆ యువతిని పోలీస్ సిబ్బంది వేధించారు. కేసు నమోదు చేసేందుకు నిరాకరించారు. యువకులతో కలిసి పార్కుకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని ఆమెను ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా, యువతి ధరించిన దుస్తులపై, యువతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. పైగా, క్షమాపణ పత్రం కూడా రాయించుకుని వదిలిపెట్టారు. ఈ ఘటనపై ఫరీదాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు మోహిత్ కుమార్ తెలిపారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన పోలీసులే గుండాల కంటే అసభ్యకరంగా ప్రవర్తించారని విమర్శించారు. మోడీ పాలనలో మహిళలపై, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని అన్నారు.

ఎలాగైనా గెలవాలన్న ధోరణి రాజకీయాల్లో సర్వ సాధారణమైంది

- ఎన్నికల కమిషనర్ ఒపి రావత్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఎన్నికల బరిలో ఏ విధంగానైనా గెలిచి తీరాలన్న ధోరణి ప్రస్తుత రాజకీయాల్లో సర్వసాధారణంగా మారిందని ఎన్నికల కమిషనర్ ఒపి రావత్ వ్యాఖ్యానించారు. ఇటీవల గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ తన ప్రత్యేకాధికారాలను ఉపయోగించి ఇద్దరు రెబల్ కాంగ్రెస్ శాసనసభ్యుల ఓట్లను తిరస్కరించిన నేపథ్యంలో రావత్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగినపుడు ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లుతుందని ఆయన శుక్రవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. నైతికతను కూడా పక్కన పెట్టి ఏ విధంగానైనా గెలిచి తీరాలన్న ధోరణితో సామాన్యులపై వత్తిడి తేవటం ప్రస్తుత రాజకీయాల్లో మనకు కన్పిస్తోందన్నారు. విజేతకు ఏ పాపం అంటదు, అధికార పక్షంలో చేరిన ఫిరాయింపుదారుకు సైతం ఎటువంటి నేరం వర్తించని ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని పార్టీలు, రాజకీయ నేతలు, మీడియా, పౌరసంఘాలు, రాజ్యాంగ సంస్థలకు 'రాజకీయ నైతికత' టార్గెట్‌గా మారుతోందని ఆయన అన్నారు.

శిశు సంక్షేమ అలవెన్సులు రెట్టింపు

న్యూఢిల్లీ : వికలాంగ మహిళల పిల్లల సంక్షేమానికై ఇచ్చే అలవెన్సును కేంద్ర ప్రభుత్వం రెట్టింపు చేసింది. ప్రస్తుతమిస్తున్న రూ.15 వందలను రూ.3వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగాలు చేస్తున్న వికలాంగ మహిళలకు జన్మించిన పిల్లల సంక్షేమానికై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అలవెన్సులు ఇస్తోంది.

డెహ్రాడూన్‌లో క్లోరిన్‌గ్యాస్ లీక్, 24 మందికి తీవ్ర అస్వస్థత

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో క్లోరిన్ గ్యాస్ లీక్ కావడంతో 24మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. డెహ్రాడూన్‌లోని జల్‌సంస్థాన్‌లో క్లోరిన్ గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ సంఘటన జరిగింది. బాధితులు అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో డూన్ హాస్పటల్‌లో చేర్పించారు. బాధితుల్లో నలుగురు రెస్క్యూ సిబ్బంది, ఒకరు అగ్నిమాపక ఉద్యోగి, ఆయన కుమారుడు, నలుగురు పౌరులు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. డూన్‌లో ఆక్సిజన్ కొరత ఉండటంతో బాధితులను ఇతర ఆస్పత్రులకు తరలిస్తున్నారు. తాగునీటి శుద్ధి కోసం క్లోరిన్‌ను ఉపయోగిస్తారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడి నుంచి సిలిండర్లను తరలించారు. పరిస్థితిని స్వయంగా సమీక్షిస్తున్నట్టు ఆ రాష్ట్ర సీఎం త్రివేంద్రసింగ్ రావత్ తెలిపారు.

ఒక్కరిని చంపితే 10 మంది పుట్టుకొస్తారు..

- వేర్పాటువాద నేత మిర్వాజ్ వివాదాస్పద వ్యాఖ్యలు

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్లపై వేర్పాటువాద నేత, హురియత్ కాన్ఫరెన్స్ చైర్మెన్ మిర్వాజ్ ఉమర్ ఫరూక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జామియా మసీదులో శుక్రవారం ప్రార్థనలు చేసిన అనంతరం మిర్వాజ్ మాట్లాడుతూ..ఒక ఉగ్రవాదిని సైన్యం చంపితే.. ఆ స్థానంలో మరో పది మంది పుట్టుకొస్తారని అన్నారు. ఉగ్రవాదుల అంత్యక్రియల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం దీనికి నిదర్శనమన్నారు. దాడులు, అణచివేతలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమస్యలకు పరిష్కారం చూపజాలవని తెలిపారు. కాశ్మీర్ 'కిల్లింగ్ జోన్'గా మారిందని ఆయన విమర్శించారు. దాదాపు ఆరు వారాలపాటు గృహ నిర్బంధంలో ఉన్న మిర్వాజ్ శుక్రవారం బయటకు వచ్చారు.

రోహింగ్యా ముస్లింలను వెనక్కి పంపాలన్న కేంద్ర నిర్ణయంపై ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ : రోహింగ్యా ముస్లింలను వెనక్కి పంపాలన్న కేంద్రం నిర్ణయం పట్ల జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. వారిని ఎందుకు వెనక్కి పంపా లని భావిస్తున్నారో తెలియజేస్తూ నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలని మోడీ సర్కార్‌ను ఆదేశించింది.

భారత్‌లో ఆశ్రయం కోసం బర్మా నుంచి 40వేల మంది ముస్లింలు వచ్చారు. రోహింగ్యా ముస్లింలతో దేశ భద్రతకు ప్రమాదం పొంచివున్నదని విదేశీ వ్యవహారాల శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. వారందరినీ తిరిగి మయన్మార్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ అంశాన్ని ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా స్వీకరించింది.

ఆ విషాదానికి కారణమేంటి..?

- ఆరు వారాల్లో వివరణ ఇవ్వండి
- యూపీ సర్కారుకు హైకోర్టు ఆదేశం



అలహాబాద్ : గోరఖ్‌పూర్ విషాదానికి కారణమేంటో వివరణ ఇవ్వాల్సిందిగా యూపీ ప్రభుత్వాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, వైద్య విద్య శాఖ డైరెక్టర్ జనరల్‌కు కూడా కోర్టు ఈ ఆదేశాలు జారీచేసింది. ఆరు వారాల్లో సమగ్ర కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలుచేయాల్సిందిగా ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 9కి వాయిదా వేసింది. నూతన్ ఠాకూర్ దాఖలుచేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, దయాశంకర్ తివారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఆదేశాలను ఇచ్చింది. తొలుత అడ్వకేట్ జనరల్ పిటిషన్‌ను వ్యతిరేకించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో సాధ్యమైన అన్ని చర్యలనూ తీసుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు వాస్తవాలను కప్పిపుచ్చేలా, నేరస్తులను కాపాడేలా ఉందని ఠాకూర్ వాదించారు. దీంతో ఘటనపై కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సిందిగా ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది.



రాజ్యాంగ హద్దుల అతిక్రమణ

దూరదర్శన్‌పై త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ విమర్శ

స్వాతంత్ర్య దినోత్సవం రోజు తన ప్రసంగాన్ని ప్రసారం చేయటానికి నిరాకరించటం ద్వారా దూరదర్శన్ రాజ్యాంగ హద్దులను అతిక్రమించిందని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని, దేశంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని ఆయన టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూ వివరాలు ...



స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాన్ని యధాతథంగా ప్రసారం చేయకుండా దూరదర్శన్ రాజ్యాంగ హద్దులను అతిక్రమించిందని మీరు చెబుతున్నారు కదా? ఇది ముఖ్యమంత్రిని అవమానించటమేనని భావిస్తున్నారా?

ఖచ్చితంగా.. వారు రాజ్యాంగ హద్దులను అతిక్రమించారు. మనం ఒక సమాఖ్య దేశంలో నివసిస్తున్నాం. ప్రధాని నరేంద్రమోడీ దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించినపుడు ముఖ్యమంత్రులు కూడా తమ రాష్ట్రాల్లో అదే పని చేస్తుంటారు కదా. స్వాతంత్ర్య దినోత్సవం రోజు నా ప్రసంగాన్ని రికార్డు చేశారు. ఆకస్మికంగా దానిలో మార్పులు చేయాలన్నారు. నా ప్రసంగాన్ని మార్చమనేందుకు వారికి ఎంత ధైర్యం? నన్ను ఎవరూ శాసించలేరు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి మాత్రమే కాదు.. నియంతృత్వానికి నిలువెత్తు దర్పణం.. ఇది ప్రాంతీయంగా జరుపుకునే ఉత్సవం కాదు. జాతి మొత్తం ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన రోజిది. కేంద్ర ప్రభుత్వం అన్నింటినీ అదుపు చేస్తోంది. ఇది చెడు సంప్రదాయం. ఏ మాత్రం చిన్న విమర్శ లేదా అసమ్మతి ఎదురైనా సహించే పరిస్థితిలో వారు లేరు.

ఇదేంటి మరి?

దూరదర్శన్ ఖచ్చితంగా త్రిపుర ముఖ్యమంత్రి స్థానాన్ని అవమానించింది. నేను ప్రజల చేత ఎన్నుకోబడిన వాడిని. రాష్ట్రంలో ప్రసార భారతి, దూరదర్శన్ అధికారులను నేను సస్పెండ్ చేయలేను. జాతీయ మాధ్యమానికి సంబంధించిన ఈ రెండు రాష్ట్ర స్థాయి సంస్థలు జాతీయ సంస్థ నియంత్రణలో వున్నాయి. ఇటువంటి వైఖరి ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు.

దూరదర్శన్ చర్యపై మీ ప్రతిస్పందన ఎలా వుంటుంది?

దూరదర్శన్ చర్యను ఇప్పటికే దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్లాను. దేశంలో ఏం జరుగుతోందన్న అంశాన్ని నిర్ణయించేందుకు వారే అత్యుత్తమ న్యాయమూర్తులు. నా వరకూ ప్రతిస్పందన అంటే జరిగిన దానిపై ప్రజల్లో చైతన్యం కలిగించటమే.. ప్రస్తుతం నేను అదే చేస్తున్నాను.

అధికారికంగా మీ ప్రభుత్వం ఈ ఘటనపై ఎలా స్పందించింది?

నా ప్రసంగాన్ని ప్రసారం చేయకపోవటంపై ఇప్పటికే నిరసన తెలియచేశాం. ప్రస్తుతానికి ఇంతకు మించి ఏమీ చెప్పలేను.

ప్రధాని మోడీ చెబుతున్న సహకారాత్మక సమాఖ్య భావనను ఈ ఘటన ప్రతిబింబిస్తోందంటారా?

అసలు సహకారాత్మక సమాఖ్య భావన ఎక్కడుందో చెప్పండి? సమాఖ్య భావన అంటేనే సహకారం.. కానీ ప్రస్తుతం అదెక్కడా కన్పించటం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసింది. ఈ వ్యవస్థ వున్నపుడు కేంద్ర, రాష్ట్రాల మధ్య చర్చ జరగటానికి ఆస్కారం వుండేది. ఇప్పుడు ఎక్కడి వెళ్లాలి? ప్రతి అంశాన్నీ నీటి ఆయోగ్ చేతుల్లో పెట్టారు. నీటి ఆయోగ్ వ్యవస్థ కేవలం కార్పొరేట్‌ల అజెండా ఆధారంగా పనిచేస్తోంది. జాతీయాభివృద్ధి మండలి (ఎన్‌డీసీ) ఏమైపోయింది? ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ఎన్‌డిసి భేటీ ఏర్పాటు చేయలేదు. అంతర్ రాష్ట్ర మండలి ఏమైంది? గడచిన మూడున్నరేళ్ల కాలంలో కేవలం ఒక్కసారి మాత్రమే భేటీ అయింది. ప్రధాని మోడీ చెబుతున్న సహకారాత్మక సమాఖ్య భావన ఆచరణలో కన్పించటం లేదు. ప్రస్తుతం మన దేశంలో నియంతృత్వ పాలన కొనసాగుతోంది.

కానీ మీరు మీ ప్రసంగంలో రాష్ట్ర సమస్యల కన్నా రాజకీయాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని విమర్శకులంటున్నారు కదా?

త్రిపుర భారతదేశంలో అంతర్భాగమే కదా? నేను భారత స్వాతంత్ర్య దినోత్సవం గురించి మాట్లాడుతున్నపుడు జాతీయ అంశాలు కాక రాష్ట్ర సమస్యలపై మాత్రమే ఏ విధంగా మాట్లాడగలను. ఇది మన దేశంలో అవిభాజ్యమైన అంశం.

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వపాలనలో వ్యక్తుల స్వేచ్ఛపై దాడులు జరుగుతున్నాయని మీరు భావిస్తున్నారా?

ప్రస్తుతం మైనార్టీలు, దళితులపై దాడులు కొనసాగుతున్నాయి. వారి భద్రత గతంలో ఎన్నడూ లేని విధంగా చెదిరిపోయింది. ఈ అంశాలనే నా ప్రసంగంలో క్లుప్తంగా ప్రస్తావించాను. ఎవరైనా ప్రభుత్వంతో విభేదిస్తే దానిని అడ్డుకుంటున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. భారత్ విశాలమైన దేశం. మనకు కొన్ని సంప్రదాయాలున్నాయి. మన దేశ ప్రజలను మూర్ఖులుగా భావించరాదు. నాకు వారిపై పూర్తి విశ్వాసం వుంది. సమయం వచ్చినపుడు వారు సరైన వైఖరిని అనుసరిస్తారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొంటారు.

మోడీపై వ్యంగ్య చిత్రం.. కార్టూనిస్టుకు బెదిరింపులు



గువహతి: గోరఖ్‌పూర్ విషాదానికి సంబంధించి ప్రధాని మోడీపై వ్యంగ్య చిత్రాన్ని వేసిన కార్టూనిస్టును చంపేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయి. గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ప్రాణవాయువు అందక దాదాపు 68 మంది చిన్నారులు చనిపోయిన సంగతి తెలిసిందే. కాగా ఈ వ్యవహారం పై అసోంకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు నీతూపవమా రాజ్‌బోంగ్షీ ఓ చిత్రాన్ని గీసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. మోడీ ఆక్సిజన్ మాస్క్ ధరించి.. చిన్నారుల మృతదేహాలను ఎగురవేస్తున్నట్టుగా ఆయన చిత్రించారు. ఈ కార్టూన్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా.. 'ఎవరో ఒకరు నిన్ను కాల్చి చంపుతారు' అంటూ గోరేశ్వర్‌కు చెందిన అనింద్య ప్రణయ్ భారతి అనే వ్యక్తి కామెంట్ చేశారు. దీనిపై బర్పేటా జిల్లా ఎస్పీ శైలాదిత్య చెతియాకు, సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేసినట్టు రాజ్‌బోంగ్షీ వెల్లడించారు. చంపుతామని కామెంట్ చేసిన తర్వాత నుంచి రాజ్‌బోంగ్షీకి అభిమానులు ఊహించని రీతిలో మద్దతు తెలుపుతున్నారు. బెదిరింపుల వ్యవహారంపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని సోషల్‌మీడియా కేంద్రంగా వారు డిమాండ్ చేస్తున్నారు.

యూపీలో గ్రామస్తుల 'జల సత్యాగ్రహం'

- సీఎం యోగి వరద ప్రాంతాలను సందర్శించలేదని నిరసన
- తక్షణమే పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్



లక్నో : ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై నిరసన వ్యక్తం చేస్తూ ఉత్తరప్రదేశ్‌లోని గ్రామస్తులు 'జల సత్యాగ్రహ' చేపట్టారు. లఖింపూర్ ఖేరి జిల్లాలోని హత్వా గ్రామస్తులు యోగి ఆదిత్యనాథ్‌పై ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు సంభవించిన వరదలకు దెబ్బతిన్న తమ గ్రామాలను సందర్శించేందుకు ముఖ్యమంత్రి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం 'జల సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. ఇక్కడి ఘాగ్ర నదిలో మెడలోతు నీళ్ళలో నిలబడి తమ ఆగ్రహాన్ని, నిరసనను వ్యక్తం చేస్తున్నారని అధికారులు తెలిపారు. గ్రామస్తుల జల సత్యాగ్రహాన్ని విరమింప చేసేందుకు అధికారులు విఫల ప్రయత్నం చేశారు. ఆ గ్రామంలో తక్షణ సహాయక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మరో 24 గంటల్లో సహాయం అందకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఘగ్రా నదికి ఏర్పడిన వరదల తాకిడికి హత్వా గ్రామంతో పాటు, ఆ పరిసర ప్రాంతాలు కూడా తీవ్ర ముంపునకు గురయ్యాయి. వరద ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు సరిగా అందడం లేదని ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.. గోరఖ్‌పూర్, మహరాజ్‌గంజ్, లఖింపూర్ ఖేరి, సిద్దార్థనగర్, బహ్రైచ్, బలరామ్‌పూర్‌తో పాటు తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నదులు పొంగి ప్రవహించాయి. దీనికి తోడు పొరుగునే ఉన్న నేపాల్ నుంచి కూడా నీరు విడుదల కావడంతో నదులలో నీటి ప్రవాహ ఉధృతి బాగా పెరిగింది. దీంతో ఆయా గ్రామాలలోని పంట పొలాలు దెబ్బతిన్నాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

మహిళపై లైంగికదాడి, హత్య

- అడ్డొచ్చిన వృద్ధురాలినీ చంపిన దుండుగులు
- తమిళనాడులో దారుణం



చెన్నై : తమిళనాడులో దారుణం చోటు చేసుకున్నది. మహిళపై కొందరు దుర్మార్గులు లైంగికదాడికి పాల్పడి దారుణంగా హత్య చేశారు. అడ్డుకోబోయిన వృద్ధురాలు కూడా దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని తిరువన్నమలై జిల్లా పక్కిరిపాలాయంకు చెందిన యూనిస్ బుధవారం రాత్రి పని నిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో అతడి భార్య దిల్షాంత్(45), తల్లి అష్మత్ బీవీ (80) ఉన్నారు. కాగా కొందరు దుండగులు ఇంటి పైకప్పు పెంకులు తొలగించి లోపలికి ప్రవేశించారు. దిల్షాంత్‌పై వారు అఘాయిత్యానికి ఒడిగట్టి అనంతరం అత్యంత పాశవికంగా హతమార్చారు. ఈ దారుణాన్ని అడ్డుకోబోయిన దిల్షాంత్ అత్త అష్మత్‌ను కూడా దుండగులు చంపేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలిస్తున్నారు.

ఉద్యోగిని చీర లాగిన సెక్యూరిటీ మేనేజర్

- ఢిల్లీలోని ఫైవ్ స్టార్ హోటల్‌లో ఘటన



న్యూఢిల్లీ: కింది స్థాయి మహిళా ఉద్యోగులంటే సీనియర్లకు అదో రకమైన చులకనభావం. తమ కిందే పని చేస్తున్నారు కాబట్టి చెప్పినట్టు వింటారు అన్న దీమాతో ఉద్యోగినిలపై వారు వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనే దేశ రాజధానిలో చోటు చేసుకున్నది. ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న ఐదు నక్షత్రాల హోటల్‌లో పవన్ దహియా అనే వ్యక్తి సెక్యూరిటీ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. కాగా సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఓ మహిళను గతనెల 29న పవన్ తన గదికి పిలిపించుకున్నాడు. అదే రోజు ఆమె పుట్టిన రోజు అయినందున క్రెడిట్ కార్డు ఇచ్చి ఏదైనా బహుమతి కొనుక్కోవాలని చెప్పాడు. అయితే పవన్ పక్కన కూర్చునేందుకు ఆ మహిళ నిరాకరించడంతో చీరపట్టి లాగాడు. ఇలా రెండుసార్లు బలవంతంగా తన మీదకు లాక్కునే ప్రయత్నం చేశాడు. ఈనెల 1న బాధితురాలు తన భర్తతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ ఉద్యోగి సాయంతో దీనికి సంబంధించిన వేధింపులకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కూడా పోలీసులకు అందించారు. కాగా గురువారం విధులకు వెళ్లిన ఆమెకు ఊహించని షాక్ తగిలింది. ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు యాజమాన్యం తెలిపింది. అంతేకాక, బాధితురాలికి సీసీటీవీ ఫుటేజీ ఇచ్చిన వ్యక్తిని, పవన్ దహియాను కూడా సస్పెండ్ చేశారు. నిందితుడు పవన్ దహియాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

లైంగిక బాధితురాలికి పరిహారం ఎందుకు చెల్లించలేదు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ : మైనర్ లైంగిక బాధితురాలికి ప్రభుత్వం తరుపున చెల్లించాల్సిన రూ.10 లక్షల పరిహారం ఎందుకు చెల్లించలేదని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని హర్యానా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను ఈనెల 22న చేపట్టనున్నట్టు తెలిపింది. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం..చండీగఢ్ ప్రభుత్వ ఆస్పత్రిలో 10 ఏండ్ల బాలిక గురువారం ఓ శిశువుకు జన్మనిచ్చింది. మేనమామ లైంగికదాడికి పాల్పడటంతో ఆ బాలిక గర్భం దాల్చింది. కాగా, కడుపు నొప్పితో బాధపడుతుండగా తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా 30వారాల గర్భవతి అని తెలిసింది. ఆమె భవిష్యత్తు దృష్ట్యా గర్భస్రావానికి అనుమతి ఇవ్వాల్సిందిగా తల్లిదండ్రులు ఇటీవల సుప్రీం కోర్టును ఆశ్రయించారు. 32వారాల గర్భాన్ని తొలగిస్తే ఆమె ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు సర్వోన్నత ధర్మాసనానికి నివేదించారు. దీంతో గర్భస్రావానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తప్పనిసరి స్థితిలో ఆ బాలిక ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువుకు జన్మనివ్వాల్సి వచ్చింది. అయితే, ప్రభుత్వం తరుపున బాధితురాలికి ఎలాంటి పరిహారం అందలేదని ఇందిరా జైసింగ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఆమె వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు పై ఆదేశాలు జారీ చేసింది.

గోశాలలో 200 ఆవులు మృత్యువాత

రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్‌లో బీజేపీ నేత నడుపుతున్న గోశాలలో గడిచిన మూడు రోజుల్లో 200 ఆవులు మృత్యువాత పడ్డాయి. దాణా కొరత, వైద్యం అందకనే అవి మృతి చెందినట్టు వెటర్నరీ డాక్టర్ల బృందం వెల్లడించింది. దుర్గ్ జిల్లాలోని రాజ్‌పూర్ గ్రామంలో బీజేపీ నేత హరీశ్ వర్మ ఏడేండ్లుగా గోశాలను నిర్వహిస్తున్నారు. అయితే.. కొన్ని రోజులుగా గోశాలలోని ఆవులు మృత్యువాత పడుతున్నాయని, వాటిని గుట్టుచప్పుడు కాకుండా పూడ్చి పెడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. మరో 50ఆవుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు వారు తెలిపారు. మరోవైపు గోడ కూలిపోవ డం వల్లే ఆవులు మృతి చెందినట్టు హరీశ్‌వర్మ చెబుతుండడం గమనార్హం.



అస్సాం కాజీరంగ పార్కులో 140 మూగజీవాలు మృతి

గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అస్సాం రాష్ట్రం అతలాకుతలమైంది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరదల్లో కొట్టుకునిపోయి మృతి చెందిన వారి సంఖ్య శుక్రవారం నాటికి 123కి చేరుకున్నట్టు అధికారులు ధ్రువీకరించారు. భారీ వర్షాల కారణంగా మూగజీవాలు సైతం విలవిల్లాడుతున్నాయి. కాజీరంగ జాతీయ పార్కులో 140 మూగజీవాలు మృత్యువాతప డ్డాయి. డివిజనల్ ఫారెస్ట్ అధికారి రోహిణీ బల్లవ్ సైకియా తెలిపిన వివరాల ప్రకారం...127 జింకలు, ఏడు ఖడ్గమృ గాలు, రెండు ఏనుగులు, ముండ్ల పంది, అడవి దున్నపో తుతో పాటు మరో మూడు వణ్యప్రాణులు మృతిచెందాయి. వరదల కారణంగా తీవ్ర ఆహార కొరత ఏర్పడిందని సైకియా తెలిపారు. అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం...24జిల్లాలోని 33.45లక్షల మంది వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ధూబ్రి, మోరిగావ్ జిల్లాల్లో వరదల ప్రభావం అధికంగా ఉన్నది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మపుత్ర నదీ పొంగిపొర్లుతున్నది. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టినట్టు ప్రభుత్వం తెలిపింది. 2,970 గ్రామాలు నీటమునిగాయని, లక్షన్నర హెక్టర్ల ఎకరాల పంటనష్టం జరిగిందని పేర్కొన్నది. ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ వరద ప్రభావిత ప్రాంతాల్లోపర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

రాష్ట్రంలో బ్రోకర్ల రాజ్యం...

సర్కారుపై టీ మాస్ ఫోరం ఆగ్రహం

- వెలిమినేడు భూసమస్యపై సీఎం స్పందించాలి
- లేదంటే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరిక
- రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం
- రాంకీ సంస్థపై కేసు నమోదు చేయాలి: తమ్మినేని వీరభద్రం డిమాండ్
- గ్రామంలోని బాధితుల భూముల పరిశీలన


హద్దు రాయిని పడగొడుతున్న తమ్మినేని, తదితరులు

వెలిమినేడు నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో బ్రోకర్ల రాజ్యం నడుస్తున్నదని టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని భూ సమస్యను సీసీఎల్ఏ, జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం కూడా స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. తెలంగాణలో కబ్జాలకు తావులేకుండా, కొత్తగా భూముల సర్వే నిర్వహిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవలే ప్రకటించారని.. వాస్తవంలో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతున్నదని చెప్పారు. వెలిమినేడు గ్రామంలో రాంకీ సంస్థ నిర్వాకం, భూదందాపై పత్రికలు, మీడియాలో కథనాలు వచ్చినప్పటికీ సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే, వెలిమినేడు గ్రామంలోని భూసమస్యపై స్పందించి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వెలిమినేడు గ్రామంలో రాంకీ సంస్థ అక్రమంగా ఆక్రమించుకున్న రైతుల భూములను శుక్రవారం టీమాస్ బృందం పరిశీలించి, రైతులతో మాట్లాడింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ...రైతుల నుంచి తక్కువ ధరకే భూములు కొనుగోలు చేయడమేగాక కొందరు రైతుల ప్రమేయం లేకుండానే సుమారు 150ఎకరాల వరకూ రాంకీ సంస్థ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుందని విమర్శించారు. ఈ విషయంపై హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామనీ, అయినా ఇప్పటికీ ఏ ఒక్క రెవెన్యూ అధికారి గ్రామాన్ని సందర్శించలేదని అన్నారు. కనీసం ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేగానీ, ఎంపీగానీ, స్థానిక మంత్రిగానీ ఇటువైపు రాలేదని విమర్శించారు. హైదరాబాద్‌లో చెత్త డంపింగ్ కాంట్రాక్టు కూడా రాంకీసంస్థకే ఇచ్చారనీ, అందుకే ప్రభుత్వం నోరుమెదపడం లేదన్నారు. రైతులకు న్యాయం జరిగి, రాంకీ సంస్థపై చర్యలు తీసుకునే వరకూ టీమాస్ ఫోరం, రైతు, ప్రజాసంఘాలు అండగా ఉంటాయని తెలిపారు. ఈ ఘటనపై వెంటనే ముఖ్యమంత్రి విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే తామే రాంకీ సంస్థపై కేసు పెట్టి, యాజమాన్యాన్ని జైల్లో వేయిస్తామని హెచ్చరించారు. రైతుల నుంచి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములను వెంటనే వారికి వాపస్ ఇవ్వాలనీ, తక్కువ ధరకు కొన్న భూములకు ఎక్కువ ధర ఇవ్వాలనీ ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలోని బ్రోకర్లు ఇప్పటికైనా వారి తప్పుడు విధానాలు మాని, రైతుల పక్షాన నిలబడాలని, లేకపోతే గ్రామానికి ద్రోహం చేసిన వారిగా మిగిలిపోతారని అన్నారు.

భూ ఆక్రమణ కేసు పెట్టాలి: బి వెంకట్

రైతులకు తెలియకుండానే వారి భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్న రాంకీ సంస్థపై ప్రభుత్వం భూ ఆక్రమణ కేసు పెట్టాలని భూ నిర్వాసితుల పోరాట సంఘం రాష్ట్ర కన్వీనర్ బి వెంకట్ డిమాండ్ చేశారు. ఈనెల 10న గ్రామానికి రైతులతో మాట్లాడి, సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయామని తెలిపారు. అయినా ఇప్పటికీ ఎవ్వరూ రాకపోవడం రాంకీ సంస్థ పలుకుబడిని తెలియజేస్తున్నదని చెప్పారు. రైతుల పేరుతో మూడు నెలల్లో తిరిగి భూములు రిజిస్ట్రేషన్ చేయిస్తామంటూ రాంకీ సంస్థ చెబుతున్నది, కానీ ఒక్కరోజులో పూర్తయ్యే ప్రక్రియకు, అంత సమయం ఎందుకని ప్రశ్నించారు. ఈ పంచాయతీ పూర్తయ్యే వరకూ ఎవరి భూముల్లో వారే ఉండాలని సూచించారు.

ప్రభుత్వం ఏం చేస్తోంది..?: పాపయ్య మాదిగ

రాంకీ సంస్థ రైతుల నుంచి అక్రమంగా భూములు లాక్కుంటే కేసీఆర్, కేటీఆర్ ఏం చేస్తున్నారని ఎంఆర్‌పీఎస్ నాయకులు పాపయ్య మాదిగ ప్రశ్నించారు. రూ.20లక్షలు, రూ.30లక్షలకు ఎకరం ఉన్న భూములను కేవలం రూ.3లక్షలు, రూ.4 లక్షలకు కొనుగోలు చేయడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. రైతుల భూములకు సరైన ధర ఇచ్చే వరకూ ఐక్యంగా పోరాడుదామని తెలిపారు.

భూములు లాక్కునే కుట్ర: ఆశయ్య

పట్టపగలే రైతుల భూముల దోపిడీ జరుగుతుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య ప్రశ్నించారు. రాంకీసంస్థ భూకబ్జాలకు పాల్పడుతుందని, రైతుల ప్రమేయం లేకుండానే భూములను లాక్కుంటుందని చెప్పారు. చిట్యాలతోపాటు చౌటుప్పల్, రామన్నపేట మండలాల్లోనూ రాంకీ సంస్థ పేదల భూములపై కన్నేసిందని చెప్పారు. రైతులంతా ఐక్యంగా సంస్థను తిప్పికొట్టాలని కోరారు.



"మాకు 9ఎకరాల భూముంది. మేం ఎవ్వరికీ భూములు అమ్మలేదు. బ్యాంకులోన్ కోసం పోతే, భూమి మా పేరుమీద లేదని తిప్పిపంపారు.. ఇదేందని ఆలోచనలో ఉన్నప్పుడే గ్రామ పంచాయతీలో భూములు రాంకీ సంస్థకు అమ్మినట్టు నోటీస్‌బోర్డులో పెట్టారు. మా పక్క భూములు అమ్మారు. కానీ మా భూములు కూడా అమ్మినట్టు రిజిస్ట్రేషన్ చేయించుకుర్రు. మాకు న్యాయం చేయండి సారు.."

-యాదగిరి, రైతు

"మా అత్తమామలు 13 ఎకరాలు సంపాదించి పెట్టారు. అప్పులు, పెండ్లిండ్లకు ఆరెకరాలు అమ్మినం. మా ఆయన ఉపాధికోసం దుబాయ్ పోయిండు. మిగిలిన భూమి మీద లోన్‌కోసం బ్యాంకుకు పోతే, మాపేరు మీద ఇంచు భూమి కూడా లేదని బ్యాంకోళ్లు చెప్పిర్రు. అందంతా రాంకీ వాళ్ల పేరుతో ఉందన్నరు. మా ప్రమేయం లేకుండానే మా భూములు ఎలా గుంజుకుంటరు... మాభూములు మాకిప్పించుర్రి సారూ.."



-కళమ్మ, మహిళా రైతు

మాకు తెలియకుండానే భూముల రిజిస్ట్రేషన్

టీమాస్ బృందానికి వెలిమినేడు రైతుల గోడు



ఈ ఆవేదన కేవలం ఈ ఇద్దరు రైతులదే కాదు..వెలిమినేడు గ్రామంలోని పదుల సంఖ్యలోని రైతుల ఆక్రందన. గ్రామంలోని రైతులకు తెలియకుండానే వారి భూములు రాంకీ సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ అయిపోయాయి. తప్పుడు పేర్లు, వేరే వారి ఫొటోలతో ఈ తంతు కానిచ్చారు. ఈ విషయం బయటకొచ్చి నెలరోజులు దాటినా, రైతులు లబోదిబో మంటున్నా ఇప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా ఆ గ్రామాన్ని సందర్శించి, వారి సమస్యను తెలుసుకోలేదు. ఈ నేపథ్యంలో టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నేతృత్వంలో శుక్రవారం వెలిమినేడు గ్రామాన్ని సందర్శించారు. గ్రామాన్ని సందర్శించిన సందర్భంలో గ్రామసచివాలయం వద్ద బాధిత రైతులు బృందంతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. భూమినే నమ్ముకొని బతుకు తున్నామని, తమ భూములు తమకు ఇప్పించాలని వేడుకు న్నారు. "నాకు 8ఎకరాల 9గుంటల భూమి ఉంది. దాంట్లో 4 ఎకరాలు అమ్మినం. కానీ మొత్తం అమ్మినట్టు రిజిస్ట్రేషన్ చేయించుకున్నరు. ఇది అన్యాయం.." అని మల్లయ్య అనే రైతు బృందానికి తెలిపారు. "ఇదంతా జరగడానికి గ్రామంలోకి కొందరు బ్రోకర్లు, అధికారి రిజిస్ట్రార్ రేణుక ప్రమేయం ఉంది. వారిని శిక్షించాలి.." అని మరోరైతు యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రైతులతో మాట్లాడిన తర్వాత గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోని బాధిత రైతుల భూములను టీమాస్ బృందం పరిశీలిం చింది. భూముల్లో పాతిన హద్దు రాళ్లను తొలగించింది. రైతులు ఐక్యంగా ఉండాలని, సమస్య పరిష్కారమయ్యే వరకూ టీమాస్ ఫోరం అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. పర్యటనలో టీమాస్ ఫోరం సభ్యులు కిల్లె గోపాల్, హిమబిందు, శ్రీరాంనాయక్, రమేశ్, ఉడుత రవీందర్, ధర్మానాయక్ పాల్గొనగా, నల్లగొండ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎం సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండ శ్రీశైలం, వ్యకాస జిల్లా కార్యదర్శి ఎన్ అయిలయ్య, సీనియర్ నాయకులు అనంతరామశర్మ, వెలిమినేడు ఎంపీటీసీలు ఆరూరి శ్రీనివాస్, నర్సింహా, మాజీ సర్పంచి వీరయ్య, సీపీఐ(ఎం) గ్రామకార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు మామిడి సర్వయ్య, మోహన్‌రెడ్డి, మహేశ్, నాగేశ్ తదితరుల పాల్గొన్నారు.

నల్లధనాన్ని వెలికి తీస్తున్నారా..?

- లేక విదేశాలకు తరలిస్తున్నారా...? : కేంద్రానికి సీపీఐ(ఎం) సూటి ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీ దేశంలోని నల్లధనాన్ని వెలికి తీస్తున్నారా? లేక దాన్ని విదేశాలకు తరలిస్తున్నారా..? అని సీపీఐ (ఎం) ప్రశ్నించింది. ప్రధానికి అత్యంత దగ్గరైన ఆదాని కుటుంబం నల్లధనాన్ని వివిధ రూపాల్లో దేశం దాటిస్తున్నదని పేర్కొంది. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఈపీడబ్ల్యూ) పరిశోధనలో ఇలాంటి విషయాలన్నీ బట్టబయలయ్యాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ఇంతకన్నా పెద్ద కుంభకోణం మరోటి లేదని తెలిపారు. ఈ తతంగమంతా ప్రధాని కనుసన్నల్లోనే జరిగినట్టు భావించాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. నల్లధనాన్ని విదేశాలకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని ప్రకటించిన విధంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే కార్పొరేట్ సంస్థలను నియంత్రించకుండా ఇది సాధ్యం కాదని తెలిపారు. ఆయా కంపెనీలకు ఏటా లక్షల కోట్ల రాయితీలిస్తున్న ఎన్డీయే సర్కారు... వాటి అధిపతులు అక్రమంగా ఇతర దేశాలకు నిధులను తరలించటాన్ని అడ్డుకోవాలని సూచించారు. అందు కనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా దేశ ఆర్థిక భద్రతకు నష్టం రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బాలికను విడిపించండి: ఆవాజ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అరబ్‌షేక్ అహ్మద్ చెరలో ఉన్న మైనర్ బాలికను ఒమన్ దేశం నుండి భారత్‌కు రప్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ అబ్బాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి వివాహాలకు దళారులుగా వ్యవహరిస్తున్న ముఠాలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

ఆ కులాలను బీసీల్లో చేర్చండి

- బీసీ కమిషన్‌కు అసదుద్దీన్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


దశాబ్దాల తరబడి హైదరాబాద్, దాని చుట్టుపక్క ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పలు కులాలను బీసీల్లో చేర్చాలని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ బీసీ కమిషన్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బీసీ కమిషన్ ఛైర్మెన్ బీఎస్.రాములును కలిసి ఓ వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆహిర్, యాదవ, గలివి, సారోల్లు తదితర కులాలు దశాబ్దాల నుంచి హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో నివశిస్తున్నారని, వీరంతా ఆర్థిక, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు మారినా వీరికి సరైన గుర్తింపు లభించలేదన్నారు. ఈ కులాలను బీసీల్లో కలిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు సంచార కులాలకు చెందిన ప్రతినిధులు బీసీ కమిషన్‌ను కలిసి తమ వాదనలు వినిపించారు. బాగోతుల, బొప్పల, శ్రీక్షత్రియ, రామజోగి, ఓడ్, గౌలి, బైలుకమ్మర, కాకిపగడాల, సాధనాశూరుల, తెరచీరల కులాల ప్రతినిధులు తమను డీఎస్టీ (డినోటిఫైడ్ ట్రైబ్స్) కేటగిరిలో పరిగణించాలన్నారు. ఎంబీసీల్లో చేర్చితే తమకు సంక్షేమ ఫలాలు అందవన్నారు. దీంతో స్పందించిన ఛైర్మెన్ బీఎస్.రాములు పూర్తిస్థాయిలో పరిశీలన చేపట్టిన తర్వాతే నిర్ధారిస్తామని హామి ఇచ్చారు.

సంపాదకీయం

రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

కేంద్ర పాలకులు రాజ్యాంగ విలువలను ఖాతరు చేయడం లేదు. స్వాతంత్య్ర దినోత్సవం నాడు కాషాయ పరివారపు చర్యలు శృతిమించాయి. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కారు ప్రసంగాన్ని రేడియో, దూరదర్శన్ సెన్సార్ చేయడానికి పూనుకున్నాయి. నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రసార భారతిని తమ స్వంత గూటిపక్షిగా మార్చిన ఫలితమిది. మరోవైపు ప్రతీ ఏడాది దసరా సందర్భంగా తమ కేడరునుద్దేశించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసే ప్రసంగాన్ని దూరదర్శన్‌లో ప్రసారం చేయించారు. ఇది రాజ్యాంగ విలువలపై ఆధిపత్యం చెలాయించడమేనని ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాఖ్యానించారు. వీటిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ప్రసంగంపై ఆంక్షలూ, అధికారేతర సంస్థ ప్రతినిధికి ప్రాధాన్యత ఇవ్వడం బీజేపీ పాలనలోనే చూస్తున్నాం. నిజామాబాద్ జిల్లా ఐలాపూర్ ప్రభుత్వ జానియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మహ్మద్ యాకునుద్దీన్ జాతీయ జెండా ఎగురవేశారనీ ఆయనను దౌర్జన్యంగా రోడ్డు మీదకు లాక్కెళ్ళారు. విద్యాసంస్థల్లో అధికార ప్రతినిధులో, అధికారులో, ఆ సంస్థ సిబ్బందో జాతీయ జెండా ఎగురవేయాలి. అందుకు విరుద్ధంగా మోహన్ భగవత్ కేరళలోని ఒక ఎయిడెడ్ పాఠశాలలో జెండా ఎగురవేశారు. కలెక్టరు ఆదేశాలు ధిక్కరించారు. దీనిపై కేరళ ప్రభుత్వం చట్టపరమైన చర్యలకు సిద్ధమైంది. అర్హత ఉన్న వారిని ముస్లిం పేరిట అడ్డుకోవడం, అర్హతలేనోళ్ళు జాతీయ పతాకను దౌర్జన్యంగా ఎగురవేయడం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడమే.

న్యాయమూర్తుల బదిలీలూ, నియామకాలల్లో కేంద్రం జోక్యాన్ని పెంచుకోవచ్చని భావించింది. ఇందుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల ఆధారంగా ఈ మార్పు కోసం చేసిన 99వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అని ఐదుగురితో కూడిన సుప్రీం ధర్మాసనం ప్రకటించింది.



స్వాతంత్య్ర దినానికి ముందురోజు జార్ఖండ్ రాష్ట్రంలోని ఒక సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ ఆర్థికవేత్త జాన్ డ్రిజీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఆయన వేదిక దిగి వెళ్ళేవరకూ వదల్లేదు. ఈ పని స్వయానా కేంద్ర మంత్రి రాధా మోహన్ సింగ్, రాష్ట్ర మంత్రులు రణదీర్ సింగ్, సిపి సింఘేర్, మరికొందరు కలిసి చేశారు. క్రిష్టియన్ మిషనరీలు గిరిజనుల మత మార్పిడులను ప్రోత్సహిస్తున్నాయనే వ్యాఖ్యలు మహాత్మాగాంధీ చేసినట్టు అర్థం వచ్చేలా ఆ వ్యాఖ్యలకు ముందు గాంధీ ఫొటో పెట్టిన అడ్వర్టయిజ్‌మెంటును ప్రభుత్వం ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. అదే వారి ఆగ్రహానికి కారణమైంది. రాంచీలో ఒక దిన పత్రిక ఆధ్వర్యంలో జరిగిన సభలో ఈ ఘటన జరిగింది. అధికార కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌కు భిన్నంగా వ్యవహరించే వీరు ప్రయివేటు కార్యక్రమాల్లో ప్రసంగస్వేచ్ఛపై మీద దాడికి దిగారు. రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఛైర్మన్‌గా పనిచేసి రిటైరైనోళ్ళు మూడేండ్లపాటు ప్రభుత్వ పదవుల్ని చేపట్టకూడదు. దీన్ని ఉల్లంఘించి ట్రాయ్ ఛైర్మన్‌గా రిటైరైన నృపేంద్ర మిశ్రాను ప్రధాని తన ప్రిన్సిపల్ సెక్రటరీగా ఆర్డినెన్స్ ద్వారా నియమించారు. ఇందుకోసం ట్రాయ్ చట్టాన్ని సవరించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా రిటైరైన జస్టిస్ సదాశివంను కేరళ గవర్నరు పదవిలో నియమించింది. గతంలో నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడైన అమిత్ షాను ఆ కేసు నుంచి విముక్తం చేస్తూ సదాశివం తీర్పునిచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. సుప్రీం కోర్టు, కొలీజియంలతో సంబంధం లేకుండా సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యాన్ని సుప్రీం న్యాయమూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించింది. ఇలా రాజ్యాంగ నియమాలకు భిన్నంగా వ్యవహరించడాన్ని అప్పుడు సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఆర్ఎం లోద్రా తప్పుబట్టారు. ఆపై 2014లో మోడీ ప్రభుత్వం కొలీజియం వ్యవస్థనే రద్దుచేసింది. దానికి ప్రత్యామ్నాయంగా జాతీయ జ్యుడిషియల్ నియామకాల కమిషన్‌ను నియమించింది. దీని ద్వారా న్యాయమూర్తుల బదిలీలూ, నియామకాలల్లో కేంద్రం జోక్యాన్ని పెంచుకోవచ్చని భావించింది. ఇందుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల ఆధారంగా ఈ మార్పు కోసం చేసిన 99వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అని ఐదుగురితో కూడిన సుప్రీం ధర్మాసనం ప్రకటించింది. కేంద్రం ఆశలకు బ్రేకుపడింది. రాజ్యాంగ విలువలను చెరబట్టడం, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడటంలో మోడీ ప్రభుత్వం ఎంత దూకుడుగా ఉందో స్పష్టం.

ప్రిన్సిపాల్ యాకునుద్దీన్ బూట్లేసుకొని జెండా ఆవిష్కరణ చేస్తున్నందుకు అడ్డుకున్నామని దౌర్జన్యకారులు సమర్థించుకోజూశారు. వివిధ ప్రాంతాల్లో బూట్లేసుకొని జెండాలు ఎగరేసిన పాలక నేతల ఫొటోలను యువత సోషల్ మీడియాలో పోస్టు చేసింది. వారిలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కూడా ఒకరు. యోగాసందర్భంగా ప్రధాని జాతీయ జెండాతో చెమట తుడుచు కుంటున్న ఫొటోలనూ పోస్టు చేశారు. జాతీయోద్యమంలో బ్రిటిష్ వారికి సలాములు కొట్టిన వారికి జాతీయ జెండా ఎగరేయడంపై నీతులు చెప్పే నైతిక హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు. ఆర్థికవేత్త జాన్ డ్రిజీని అవమానించడాన్ని నిరసిస్తూ జార్ఖండ్ రాజ్‌భవన్ ఎదుట సామాజిక కార్యకర్తలు ప్రదర్శన చేశారు. డ్రిజీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మితవాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజల్లో నుంచే ప్రత్యామ్నాయం ఏర్పడుతుందని సీపీఐ(ఎం) చెప్పిన మాటలను ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

మెయిల్ @ నవతెలంగాణ



గుర్రం రాంమోహన్‌రెడ్డి

వెలుతురూ... చిరుసవ్వడి..!

"వేయి పదాలు కూడా చెప్పలేని భావాన్ని ఒక ఛాయా చిత్రం చెబుతుంది. గతాన్ని, వర్తమానాన్ని భవిష్యత్ తరాలకు చూపించే అద్భుత కళే ఫొటోగ్రఫీ. కనురెప్పపాటు కాలంలో క్లిక్‌మన్న వెలుతురుతో కూడిన చిరుసవ్వడి." దేశ కాలమాన, ఆర్థిక రాజకీయ పరిణామా లన్నింటినీ తన కంటితో ప్రపంచానికి చూపించే ఫొటో జర్నలిస్ట్ నిరంతర శ్రామికుడు. తెల్లవారు లేస్తే కాఫీ కప్పు చేతపట్టుకొని అందుబాటులో ఉన్న దినపత్రికనో, వారపత్రికనో తిరగేసే పాఠకుడిని ముమ్ముందుగా ఆకర్షించేది వార్తా చిత్రాలే... అలాంటి చిత్రాలను అందించేది ఫొటో జర్నలిస్టులే... వేల మాటలతో వర్ణించి చెప్పే దానికంటే ఒక్క ఫొటో చూస్తే అనంతకోటి భావాలు చూపరుల మనసుల్లో ఓలలాడుతాయి. తన ఫొటోలతో అందరినీ ఉత్తేజితుల్ని చేసి ఫొటో జర్నలిజం వృత్తిలో భాగంగా ఎదుర్కొనే ఇబ్బందులు ఎన్నో, శారీరక, భౌతిక దాడులు, మానసిక ఒత్తిళ్ళు తట్టుకుని తనపని విజయవంతంగా పూర్తిచేయాల్సి ఉంటుంది. ఎంతో శ్రమకోర్చి తీసిన మంచి చిత్రాన్ని పదిమంది ప్రత్యేకంగా మెచ్చుకున్నప్పుడు కలిగే అనుభూతి ఎంతో చెప్పలేం. ఛాయా చిత్రం ఆవిర్భవించి ఈ ఆగస్టు 19 నాటికి 178 ఏండ్లు. లియోనార్డో డావిన్సీ 1559లో గుహలాంటి చీకటి గది రూపకల్పనకు శ్రీకారం చుట్టడంతో ఫొటోగ్రఫీకి బీజం పడింది. అప్పటి నుండి శాస్త్రవేత్తలు, అవిరళకృషి తోడై చివరికి 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్‌లో 'ఫొటోగ్రఫీ'డేగా గుర్తింపు పొందింది. ఆనాడు సాంకేతిక ప్రక్రియగా ప్రారంభమైన ఫొటోగ్రఫీ ఈనాడు వృత్తిగా స్థిరపడింది. శాస్త్రవేత్త బ్రీచ్ జోసఫ్ సిసాఫర్ ఈ ఫొటోగ్రఫీని వెలుగులోకి తెచ్చాడు.

ఆ తర్వాత రాజా దీన్ దయాళ్ శర్మ మనదేశంలో వ్యాప్తి చెందడానికి కారణమయ్యారు. 1854 మే 26న విలియమ్, హీమ్ అనే సోదరులిద్దరూ సూర్య గ్రహాన్ని తొలిసారిగా ఫొటోతీయగలిగారు. నెల్సన్ అనే శాస్త్రవేత్త తల్లి గర్భంలో శిశువు రూపుదిద్దుకునే మార్పుల గురించి పదేండ్లపాటు శ్రమించి ఎన్నో ఫొటోలు తీయగలిగారు. శ్రీపెరంబదూర్‌లో రాజీవ్‌గాంధీని చంపిన హంతకులను గుర్తించేందుకు కీలకమైన సాక్ష్యాలను అందించింది ఫొటోలే. ఫొటోగ్రాఫర్ కూడా బాంబుపేలుడుకు ఆహుతైపోయాడు. కాని సంఘటనా స్థలంలో కెమేరా పడివుండటం, అది పోలీసులకు దొరకడం, దీని ద్వారా వచ్చిన ఫొటోల ఆధారంగా హంతకులను గుర్తించే మూలాధారాలను కనుగొనడం అందరికీ తెలిసిందే. ఫొటోగ్రఫీ 19వ శతాబ్దంలో ప్రసార సాధనాల్లో ఒక ముఖ్యభాగమైంది. 1904లో డైలీ మిర్రర్ అనే బ్రిటిష్ పత్రిక వార్తకు సంబంధించి ముఖ్య ఉద్దేశ్యాన్ని తెలిపే దృశ్యాన్ని ముద్రించి విస్తృతమై పాఠకుల అభిమానాన్ని సంపాదించింది. దీంతో ప్రెస్ ఫొటో ఏజన్సీలు ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడ్డాయి. ఫొటోగ్రఫీలో పద్మశ్రీ పొందిన తొలివ్యక్తి టి.కాశీనాథ్ మన తెలుగువారు కావడం విశేషం. మనిషి వేసే ప్రతీ అడుగు సమాజం వేసే పురోభివృద్ధి అడుగుగా భావించాలి. హృదయాన్ని కదిలించినా, మనసును రగిలించినా, కొత్త అనుభూతుల్ని సృష్టించినా, అనంతమైన ఆకాశాన్ని అరచేతికి అందివ్వగల శక్తి కెమేరాకన్నుకే వుందనడంలో సందేహం లేదు. శాస్త్ర పరిశోధనల్లో, వాణిజ్య ప్రకటనల్లో, జర్నలిజం రంగంలో ఫొటోగ్రఫీ రాణిస్తోంది. కమర్షియల్ ఫొటోగ్రఫీ, ఆర్ట్ ఫొటోగ్రఫీ, అడ్వర్టైజ్‌మెంట్ ఫొటోగ్రఫీ ఫొటో జర్నలిజం, రిప్రోగ్రఫీ, సైంటిఫిక్ ఫొటోగ్రఫీ, సినిమా టోగ్రఫీ, వీడియోగ్రఫీ అంటూ ఎన్నో రకాలుగా అభి వృద్ధి చెందింది ఫొటోగ్రఫీ. దేశంలో యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, అలహాబాద్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ వంటి ఎన్నో విశ్వ విద్యాలయాలు ఫొటోగ్రఫిక్ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నాయి. ఏకాగ్రత, నిశిత పరిశీలన, కళాదృష్టి, దృశ్యాత్మక ఊహాశక్తి, జ్ఞాపకశక్తి, ఆత్మ విశ్వాసం, సృజనాత్మకత, ఓర్పు, అప్రమత్తత–వీటన్నిటి కలయికే ఫొటోగ్రాఫర్. కొండను సైతం కెమెరా తనలో దాచేసుకుంటుంది.. అందుకే ఈ రోజు ప్రపంచ ఫొటోగ్రఫీ క్లిక్..క్లిక్..!

సీనియర్ రిపోర్టర్
9849896769

వ్యవసాయ దిగుమతులు ఆందోళనకరం...



ఎస్. హనుమంత రెడ్డి

ప్రభుత్వ వ్యవసాయ దిగుమతి విధానాలు దేశీయ మార్కెట్లను రైతులకు గిట్టుబాటు కాకుండా చేశాయి. ఆహారోత్పత్తిలో స్వయంసమృద్ధి విధానాన్ని ప్రభుత్వం గత మూడేండ్లలో అతివేగంగా మార్చుకుంది. పంటల దిగుబడి పెంచామని చెపుతూనే వ్యవసాయోత్పత్తుల దిగుమతులను ప్రోత్సహించింది. గోధుమ, మొక్కజొన్న, బియ్యం మొదలగు ధాన్యాల దిగుమతి 2014–17 మధ్య 110 రెట్లు పెరిగింది. ఫలితంగా ఈ పంటల ధరలు తగ్గి మన రైతులకు గిట్టుబాటు కాకుండా పోయాయి. వ్యాపారులకు స్థానిక ఉత్పత్తుల కంటే

> **"గత కొన్నేండ్లలో భారత వ్యవసాయ విధానంలో అనుసంధానం, సందర్భశుద్ధి లోపించాయి. దేశంలో ఆహారోత్పత్తుల ఉత్పత్తి బాగా పెరిగినప్పటికీ ప్రభుత్వం భరించలేని దిగుమతులను ప్రోత్సహిస్తున్నది. ఈ విషవలయం నుండి మన వ్యవసాయాన్ని రక్షించాలంటే ముందుగా మన విదేశీ వాణిజ్య విధానాలను క్రమబద్ధీకరించాలి."**

ఆస్ట్రేలియా పంటలు చౌకగా లభిస్తున్నాయి. 2014–15లో రూ.134 కోట్లుగా ఉన్న ధాన్యాల దిగుమతి ఖర్చు 2016–17లో 6,623శాతం పెరిగి రూ.9,009 కోట్లకు చేరుకుంది. 2014–15లో రూ.5,414 కోట్లుగా ఉన్న పండ్లు, కూరగాయల దిగుమతులు 2016–17లో రూ.5,897 కోట్లకు పెరిగాయి. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు2014–15లో రూ.1.31లక్షల కోట్లు, 2015–16లో రూ.1.08లక్షల కోట్లు ప్రభుత్వం దిగుమతులు పెంచుతూ ఎగుమతులపై పరిమితులు విధిస్తున్నది.

తన విధాన మార్పును ప్రభుత్వం దాచిపెడుతున్నది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ, 2015–16 సం.రానికి గోధుమ ఉత్పత్తిని 9.40 కోట్ల టన్నులుగా అంచనా వేసింది. ఆ మేరకు తన భవిష్యత్తు పథకాలను 2016 మేలో ప్రకటించింది. 2014–15లో దేశంలో అనేక ప్రాంతాలలో రుతుపవనాలు విఫలమయ్యాయి. కరువు తాండవించింది. వర్షాలు బాగా పడిన 2015–16 అంచనాలు 2014–15 ఉత్పత్తికి 8.6శాతం మాత్రమే అధికం. 2015–16లో ప్రజాపంపిణీకి 2.80 కోట్ల టన్నులు సేకరించిన ప్రభుత్వం 2016–17కు 2.30 కోట్ల టన్నులు మాత్రమే సేకరించడం విచిత్రమే గాక అంచనాల డొల్లతనాన్ని బయటపెడుతున్నది. ప్రజాపంపిణీ మిషతో గోధుమ దిగుమతులను పెంచింది. 2016 సెప్టెంబర్‌లో దిగుమతి సుంకాన్ని 25శాతం నుండి 10శాతానికి తగ్గించింది. డిసెంబర్‌లో మొత్తం రద్దు చేసింది. 2016–17 రబీ సీజన్‌లో గోధుమ పంట సాగు 8శాతం పెరిగిందని ప్రభుత్వం ప్రకటించింది. పంట దిగుమతిని అధికంగా అంచనా వేసిన ప్రభుత్వం ప్రజాపంపిణీ సేకరణ ఎందుకు తగ్గించింది? దిగుమతులను ఎందుకు పెంచింది? దిగుమతి సుంకాన్ని ఎందుకు రద్దు చేసింది? ఎవరి ప్రయోజనం కోసం ఈ ఘనకార్యాలు? నిజానికి ఈ ఏడాది మార్కెట్లు విపరీతమైన గోధుమ కొరతను ఎదుర్కొన్నాయి. ఈ కారణంగానే 2016, ఏప్రిల్–డిసెంబర్ల మధ్య గోధుమ పిండి ధరలు 25శాతం పెరిగాయి. భారత ఆహార సంస్థ ప్రకారం 2016–17లో ప్రభుత్వ గోదాముల్లో గోధుమ నిలువలు 13.80లక్షల టన్నులకు పడిపోయాయి. ఇది ప్రభుత్వం నిర్ణయించిన కనీస నిలువ పరిమితే గాక గత దశాబ్ద కాల కనిష్ట నిలువ కూడా. 2015–16లో నిలువలు 24లక్షల టన్నులు. 2016–17లో ఆస్ట్రేలియా, ఉక్రెయిన్, ఫ్రాన్స్ నుండి 57.50లక్షల టన్నుల గోధుమలను ప్రభుత్వం దిగుమతి చేసుకుంది. ఇది గత దశాబ్దకాల గరిష్టం. హరిత విప్లవ అర్ధశతాబ్ది ఉత్సవ తరుణంలో ఇలా జరగడం హాస్యాస్పదం. 'నౌకనుండి నోటికి' (దిగుమతి చేసుకుంటూనే తిండి) పరిస్థితి నుండి హరిత విప్లవం, భారత్‌ను వరి, గోధుమల్లో ప్రపంచంలో ప్రధాన ఎగుమతి దేశంగా అభివృద్ధి చేసింది. 1964లో మన వార్షిక గోధుమ ఉత్పత్తి కోటి టన్నులు. 1970లో 2 కోట్ల టన్నులు. 2012–13లో 65 లక్షల టన్నుల గోధుమలను ఎగుమతి చేయగా 2013–14లో 9.58 కోట్లటన్నుల రికార్డు స్థాయి గోధుమ ఉత్పత్తి సాధించింది. హరిత విప్లవం తర్వాత మెరుగైన ఆహార భద్రత సాధించినా ప్రభుత్వ దిగుమతి విధానాలు ఆహార ధరలపై తీవ్ర ప్రభావం కలిగిస్తున్నాయి.

దిగుమతులను ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే సాధనంగా ప్రభుత్వం భావిస్తున్నది. కానీ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. పంటలు బాగా పండినా రైతు కష్టాలు పెరుగుతున్నాయి. "నోట్ల రద్దుతో రైతులు కష్టాలపాలై ఉపశమన చర్యల కోసం ఎదురు చూస్తున్న సమయంలో ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని రద్దు చేసింది. చౌక ధరల గోధుమ దిగుమతులు మన రైతుల గిట్టుబాటు ధరలను మరింత తగ్గిస్తాయి. రైతులు వ్యవసాయం వదిలేయాలని ప్రభుత్వం అనుకున్నట్టుంది." భారతీయ కిసాన్ యూనియన్ పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడు అజ్మేర్ సింఘ్ లాఖోవాలా బాధను వ్యంగీకరించారు. ప్రభుత్వం 40శాతం దిగుమతి సుంకం విధించాలని అనేక వ్యవసాయ సంఘాలు కోరుతున్నాయి. "దక్షిణ భారత గోధుమ మరలకు ఉత్తర భారత గోధుమల కంటే విదేశీ గోధుమలు 10–15శాతం తక్కువ ధరలకు లభిస్తున్నాయి. ప్రభుత్వ దిగుమతి విధానం రైతులను నిరుత్సాహపరుస్తున్నది. వచ్చే ఏడు ఉత్పత్తి తగ్గుతుంది." హరియాణా, సోనేపట్‌కు చెందిన వ్యవసాయ రంగ నిపుణులు ఆర్.యస్. రానా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో గోధుమల కనీస మద్దతు ధరను టన్నుకు రూ.1,525 నుండి రూ.1,625కి పెంచింది. 20.06.17న పప్పు ధాన్యాల కనీస మద్దతు ధరను రూ.50,500 నుండి 54,500కు పెంచింది. అయినా దిగుమతి గోధుమల ధర ఈ కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉన్న కారణంగా రైతులకు ప్రయోజనం శూన్యం. గతంలో పి.ఎల్. 480 ఒప్పందంతో అమెరికా నుండి తక్కువ ధరకు దిగుమతి చేసుకున్న గోధుమలు మన గోధుమ ఉత్పత్తి అభివృద్ధిని దెబ్బతీశాయని 20.12.16న హరిత విప్లవ నిర్మాత ఎం.ఎస్. స్వామినాథన్ ట్వీట్ చేశారు. ఆ అమెరికా గోధుమలతో అనేక వైరస్‌లకు కారణమైన పార్థీనియం (గొల్లభామ, కాంగ్రెస్) మొక్కలు కూడా దిగుమతయ్యాయి.

గత ప్రభుత్వాలు మంచి విత్తనాలు, ఎరువులు, మందులు, సాంకేతిక పరిజ్ఞానాలను అందించడం వల్ల హరిత విప్లవం సాధ్యపడింది. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కనీస మద్దతు ధరకు మించి ధాన్యాన్ని రైతుల నుండి కొనవద్దని రాష్ట్రాలను ఆదేశించింది. ఫలితంగా సేకరణ తగ్గింది.



గోదాములు నిండుకున్నాయి. ఇప్పుడు దిగుమతి సుంకాన్ని రద్దు చేసింది. రైతులకు ఆత్మహత్యలే శరణ్యమయ్యాయి. వ్యవసాయాన్ని అవుట్ సోర్సింగ్ చేసిన దిగుమతులు నిరుద్యోగాన్ని దిగుమతి చేశాయి. రైతుల బతుకుదెరువును మాయం చేశాయి. ఆహార భద్రత రద్దు చేశాయి. 2008–09లో మొత్తం భారతదేశ దిగుమతుల్లో కేవలం 2.09శాతం (రూ.29,000 కోట్లు) ఉన్న వ్యవసాయ దిగుమతులు 2014–15కు 4.43శాతం (1.21 లక్షల కోట్లు)కి, 2015–16కు 5.63శాతం (1.40268 లక్షల కోట్లు)కి పెరిగాయి. ఈ దిగుమతులను ఆపితే మిగిలే సొమ్మును పేదరికంలో మునిగి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతుల సంక్షేమానికి వాడవచ్చు. విదేశీ మారక ద్రవ్యం మిగులుతుంది. రూపాయి మారకం విలువ పెరుగుతుంది. ప్రస్తుత ప్రభుత్వ దిగజారుడు విధానాలకు చక్కెర మంచి ఉదాహరణ. "గత ఆరేండ్లలో వినియోగాన్ని మించి చెరుకు ఉత్పత్తి పెరిగింది. అయినా 2012–14లో 7.7లక్షల టన్నుల చక్కెర దిగుమతి చేసుకున్నాం. 2015–16లో చక్కెర ధరలు దారుణంగా పడిపోయాయి. నష్టాల పాలైన చక్కెర మిల్లులు రైతులకు రూ.22,000 కోట్లు బాకీ పడ్డాయి. అయినా ప్రభుత్వం చక్కెర దిగుమతి సుంకాన్ని రద్దు చేయడానికి 2017 జనవరిలో చర్చించింది.

ప్రభుత్వ దిగుమతి విధానాలు మరొక ముప్పు తెచ్చాయి. దేశం వంటనూనెలు, పప్పుధాన్యాల ప్రధాన దిగుమతిదారుగా మారింది. 1993–94లో దేశంలో వాడుతున్న వంటనూనెలో కేవలం 3శాతం దిగుమతయ్యేది. ఈ రోజు ఇది 70శాతానికి చేరి రూ.70,000 కోట్ల వార్షిక ఖర్చును పెంచింది. చౌకగా దిగుమతి చేసుకున్న పామాయిల్, సోయాబిన్ ఆయిల్ దేశీయ మార్కెట్లను ముంచెత్తుతున్నాయి.2015–16లో నూనె గింజలు సమృద్ధిగా పండాయి. అయితే కోతకాలానికి ముందే ప్రభుత్వం ముడి చమురు, శుద్ధిచేసిన పామాయిల్ దిగుమతి సుంకాన్ని 5శాతం తగ్గించింది. ఫలితంగా వేరుశనగ, దేశీయ సోయాబిన్ నూనెలను కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మవలసి వచ్చింది. ఇక ఈ ప్రభుత్వ విధానాలతో రైతులు వ్యవసాయమెలా చేస్తారు? గత పదేండ్లలో వంటనూనెల దిగుమతి మూడు రెట్లు పెరగగా నూనె గింజల పంటలు 10శాతం తగ్గాయి. పప్పుధాన్యాలలో ప్రభుత్వం ఒకడుగు ముందుకేసి వాటి ఉత్పత్తిని అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చింది. గతేడాది పప్పుధాన్యాల ధరలు ఆకాశానికెక్కిన నేపథ్యంలో మన కోసం పప్పుధాన్యాలను పండించేటట్టుగా ప్రభుత్వం మొజాంబిక్‌తో అవగాహనా పత్రంపై సంతకం చేసింది. రానున్న ఐదేండ్లలో 3 లక్షల టన్నుల పప్పు ధాన్యాలను మొజాంబిక్ నుండి దిగుమతి చేసుకోవాలి. భారత రైతులతో ఇలాంటి ఒప్పందాలు చేసుకొని దేశభక్తిని చాటుకోవచ్చు. విదేశీ వస్తువినియోగం దేశద్రోహం. బ్రెజిల్, మ్యాన్మార్‌ల నుంచి కూడా పప్పుధాన్యాలను దిగుమతి చేసుకునే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తున్నది. ఏడాదికి రూ.20,000 కోట్లు ఖర్చుపెట్టి 25శాతం పప్పుధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నదీ ప్రభుత్వం. గత దశాబ్దకాలంలో పప్పుధాన్యాల దిగుమతి కూడా 3 రెట్లు పెరిగింది. 2016–17లో పప్పుధాన్యాలు అత్యధికంగా పండాయి. అయినా రూ.25,600 కోట్ల విలువ చేసే 59 లక్షల టన్నుల పప్పుధాన్యాలను దిగుమతి చేసుకున్నదీ రైతు మిత్ర ప్రభుత్వం. రైతులు తమ పప్పుధాన్యాలను కనీస మద్దతు ధర కంటే తక్కువకు అమ్మి నష్టపోవలసివచ్చింది. ఇక రైతుల ఆదాయం రెట్టింపెలా అవుతుంది?

"గత కొన్నేండ్లలో భారత వ్యవసాయ విధానంలో అనుసంధానం, సందర్భశుద్ధి లోపించాయి. దేశంలో ఆహారోత్పత్తుల ఉత్పత్తి బాగా పెరిగినప్పటికీ ప్రభుత్వం భరించలేని దిగుమతులను ప్రోత్సహిస్తున్నది. ఈ విషవలయం నుండి మన వ్యవసాయాన్ని రక్షించాలంటే ముందుగా మన విదేశీ వాణిజ్య విధానాలను క్రమబద్ధీకరించాలి." అని భారత వ్యవసాయ వ్యయాల, ధరల సంస్థ అధికారి టి. హక్ అన్నారు.

'వైర్' ఆధారంగా

సెల్: 9490204545

పసి ప్రాణాలు కాపాడుకోలేమా..!



డాక్టర్ సిలువేరు హరినాథ్


> **ఇప్పటికైనా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన చిన్నారుల మృత్యుగోసను చూసైనా ప్రభుత్వాలు అప్రమత్తం కావాల్సిన సమయమిది. ప్రభుత్వ ఆస్పత్రుల ప్రక్షాళన జరగకపోతే చిన్నపిల్లలకు మరింత ప్రాణహాని జరిగే అవకాశం ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ అరికట్టకట్టాలి. ఇందుకు ప్రభుత్వం పూనుకునే విధంగా వత్తిడి చేయవల్సిన బాధ్యత పౌర సమాజానిదే.**

ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్ జిల్లా కేంద్రంలోని బాబా రాఘవ్‌దాస్ ప్రభుత్వ దవాఖానలో ఆక్సిజన్ అందక 70మందికి పైగా చిన్నారులు చనిపోయిన సంఘటన ప్రతి హృదయాన్నీ కలిచివేసింది. అభం శుభం తెలియని చిన్నారుల మృతికి ఎవరిని బాధ్యులను చేయాలి! ఎవరిని శిక్షించాలి! అధికారంలో ఉన్న నాయకులకు ప్రజల ఆరోగ్య బాగోగులపై శ్రద్ధ లేదు. కేవలం రూ.64 లక్షల బకాయిలు చెల్లించలేని దుస్థితిలో ఈ పాలకులు ఉన్నారు అంటే ప్రజావైద్యానికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 47 ప్రకారం ప్రజా ఆరోగ్యాన్ని బలోపేతం చేసి వైద్య సదుపాయాలు ప్రజలకు అందించాలి. ఆర్టికల్ 21 ప్రకారం పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి మనిషికీ చికిత్స అందించాలి. ఆర్టికల్ 42లో నిర్దేశించిన ప్రకారం పుట్టిన ప్రతి బిడ్డకూ, తల్లికీ ఆరోగ్య రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ అది అమలు జరగడం లేదనేది గోరఖ్‌పూర్ సంఘటన తెలియజేస్తున్నది. అందువల్ల ఈనాడు దేశంలో పుట్టిన ప్రతి వెయ్యిమంది చిన్నారుల్లో 48మంది ప్రతిరోజూ మరణిస్తున్నారు. భారత ఆరోగ్యశాఖ 2016–17 లెక్కల ప్రకారం ఐదేండ్ల లోపు చిన్నారులు ప్రతి ఏటా సుమారు 1,26,000 మంది చనిపోతున్నారు. ప్రజా ఆరోగ్యం మెరుగుపడేందుకు నేషనల్ పాపులేషన్ పాలసీ (2000), నేషనల్ హెల్త్ పాలసీ (2002), నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (2005–17), పన్నెండవ పంచవర్ష ప్రణాళిక (2012–17)లో అనేక సంస్కరణలు తీసుకు వచ్చినప్పటికీ పాలకులు వాటిని సక్రమంగా అమలు చేయలేకపోవడం వల్ల సత్ఫలితాలు ఇవ్వలేదు.

గ్రామీణ ప్రాంతంలోని సగానికి పైగా ప్రజలు ఆహారం పైనే ఖర్చు చేస్తున్నారు. అయినప్పటికీ పౌష్టికాహారలేమి పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. పేద యువతకు వయస్సు రాక ముందే పెండ్లి కావడం వల్ల వారికి పుడుతున్న పిల్లలు బలహీనంగా ఉంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాలల ఎదుగుదలపై వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ఆధ్వర్యంలో జరిగిన గ్లోబల్ న్యూట్రిషన్ సర్వే ప్రకారం బాలలు ఎదగకపోవడానికి ప్రధాన కారణం పౌష్టికాహారలోపం అని తెలిపింది. మనదేశంలో సుమారు 38.7శాతం మంది చిన్నారులు వయస్సుకు తగినట్టు ఎదుగుదల లేకుండా మృత్యువుతో పోరాటం చేస్తున్నారు. ఆరు నుండి 23 నెలల మధ్య ఉన్న పిల్లలలో ప్రతి పదిమందిలో కేవలం ఒకరికి మాత్రమే కడుపునిండా తిండి దొరుకుతున్నది.

దీని కారణంగా ఐదేండ్ల చిన్నారులు సుమారు 35.7 శాతం మంది తక్కువ బరువుతో ఉంటున్నారు. ఆరు నెలల్లోపు చిన్నారులకు తల్లిపాలే ఆహారంగా అందుతుంది. కానీ మన దేశంలో 55 శాతం మంది చిన్నారులకు తల్లిపాలు అందడం లేదు. 2005–06 నుండి ఇప్పటివరకు పోల్చినప్పుడు తల్లిపాలు అందుతున్న చిన్నారుల సంఖ్య 9 శాతం పెరిగినప్పటికీ పోషక



ఆహారలేమితో బాధపడుతున్నారు. మహిళలు సగానికి పైగా తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారు. 15–49 ఏండ్ల వయస్సున్న వారిలో ఈ సమస్య తీవ్రంగా కనిపిస్తున్నది. దీనితో వీరికి పుట్టే పిల్లలు బలహీనంగా ఉంటున్నారు. ఇంటికి తాగునీరు అందని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. వ్యక్తిగత మరుగుదొడ్లు తక్కువే! సరైన పారిశుధ్య సదుపాయాలు లేకపోవడం వల్ల మహిళల అనారోగ్యం చిన్నారుల ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నది. కుటుంబంలో ఒక వ్యక్తి అనారోగ్యం పాలైతే ఆస్పత్రి మందుల ఖర్చులు భరించలేక ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా చితికిపోతున్నది. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం గత పదేండ్లలో వైద్యం ఖర్చులు భరించలేక సుమారు ఐదు కోట్ల మంది ప్రజలు పేదవారిగా మిగిలిపోయారు. ఈ విషయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు అత్యధికులు కావడం గమనార్హం. మనదేశంలో ప్రతి మనిషి సగటున 65.60 శాతం ఆదాయాన్ని వైద్యం ఖర్చుల కింద చెల్లిస్తున్నారు. క్యూబాలో ప్రజలు కేవలం 4.4 శాతం మేర వైద్య ఖర్చులకు చెల్లిస్తుండగా 95.5 శాతం మేర ఖర్చులు ప్రభుత్వమే భరిస్తున్నది. ఫ్రాన్స్‌లో 6.5 శాతం, అమెరికాలో 11 శాతం. దక్షిణాఫ్రికాలో 6.40 శాతం, బ్రెజిల్ దేశప్రజలు 25.5 శాతం చెల్లిస్తే మిగతా ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని బ్రిటిష్ వైద్య సమాచార పత్రిక దలాన్స్‌ట్‌లో ఈ విషయం స్పష్టం చేసింది. 1995 నుండి 2014 వరకు 184 దేశాల్లో వైద్యసేవల రంగం తీరుతెన్నుల పై పరిశీలించి ఈ వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చింది.

వైద్యరంగానికి ఇతర దేశాలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతుంటే మన దేశంలో మాత్రం ప్రభుత్వాలు అందుకు భిన్నంగా ఆలోచిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వైద్యరంగం పై దృష్టి సారించలేదు.

నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ కింద ప్రతి ఏటా ఖర్చు చేయాల్సిన నిధులు కూడా ఖర్చు చేయకుండా 40 శాతం నిధులు మిగిల్చి ఇతర పథకాలకు వినియోగించారని ఇటీవల విడుదలైన కాగ్ రిపోర్టు స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాలలో 2011–16 మధ్య కాలంలో కేవలం1.06 లక్షల కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపింది. దేశంలో 27 రాష్ట్రాలలో వ్యయం కాని నిధులు 2011–12 లో 7375 కోట్లు ఉండగా 2015–16 నాటికి అమాంతం 9509 కోట్లకు చేరింది. అంటే కేంద్రం ఇచ్చే నిధులను కూడా ఖర్చు చేసే శ్రద్ధ, సామర్థ్యం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదనేది స్పష్టం. ప్రజలకు అత్యవసరమైన సందర్భాలలో ఇచ్చే మందులు కూడా ప్రభుత్వ ఆస్పత్రులలో ఉండటం లేదు. అలాగే ప్రైమరీ హెల్త్ సెంటర్లల్లో సగానికి పైగా డాక్టర్లు, నర్సులు అందుబాటులో ఉండడం లేదు. ఉత్తరప్రదేశ్‌లో సగానికి పైగా పీహెచ్‌సీలల్లో డాక్టర్లు లేరంటే సర్కారు దవాఖానల పనితీరును అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటికైనా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన చిన్నారుల మృత్యుగోసను చూసైనా ప్రభుత్వాలు అప్రమత్తం కావాల్సిన సమయమిది. ప్రభుత్వ ఆస్పత్రుల ప్రక్షాళన జరగకపోతే చిన్నపిల్లలకు మరింత ప్రాణహాని జరిగే అవకాశం ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ అరికట్టకట్టాలి. ఇందుకు ప్రభుత్వం పూనుకునే విధంగా వత్తిడి చేయవల్సిన బాధ్యత పౌర సమాజానిదే.

సెంటర్ ఫర్ ఎకనామిక్ & సోషల్ స్టడీస్‌లో రీసర్చ్ అసిస్టెంట్.
సెల్ : 9949030630



అమ్మ వేదన తీరింది

'అమ్మాయిని అత్తారింట్లో వదిలి మూడు రోజులే. ఇంకా పెండ్లి పనుల అలసట కూడా తీరలేదు. ఇప్పుడు ఎందుకు ఉన్నట్టుండి ఫోన్ చేసి అర్జెంట్‌గా రమ్మన్నాడు. అమ్మాయి వల్ల ఏమైనా తప్పు జరిగిందా. సంధ్య అలా చేసేది కాదే..? అసలే వియ్యంకుడు అదో తరహా మనిషి. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో అర్థం కాదు. ఏం జరిగిందో ఏమో' అనుకుంటూ కంగారుగా ట్రైన్ ఎక్కి బయలుదేరింది పద్మ.

ట్రైన్‌లో కూర్చుంటే ఎన్నో ఆలోచనలు. మనసును కలచివేస్తున్నాయి. పెండ్లి రోజు రోడ్డుపై నిలబడి ఎంత గొడవ చేశాడు. ఇంట్లోకి రానంటే రానని మొండి కేశాడు. ఆ తండ్రీ కొడుకుల భాషేంటి.. ఆ తిట్లేంటి? ఒక పక్క పెండ్లి జరుగుతుంది, బంధువులంతా ఉన్నారు. ఇవేవీ వాళ్ళకు పట్టవు. అప్పుడే పద్మకు అనుమానం వచ్చింది. అలాంటి మనుషుల మధ్య అమాయకురాలైన తన సంధ్య ఎలా బతుకుతుందో అని. అనుకున్నట్టే మూడు రోజులకే వియ్యంకుడు ఫోన్ చేసి రమ్మన్నాడు.

పద్మ వాళ్ళకు కళ్ళ జోళ్ళ షాప్ ఉంది. భర్త మెతక మనిషి. దాంతో ఇంటా, బయట అన్నీ పద్మనే చూసుకుంటుంది. పద్మకు ఇద్దరు కూతుళ్ళు. పెద్దమ్మాయి సంధ్య. డిగ్రీ చదువుతోంది. రెండో అమ్మాయి ఇంజనీరింగ్. అనుకోకుండా సంధ్యకు ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి సాఫ్ట్‌వేర్. మంచి జీతం. పేరు కార్తిక్. చదువు పూర్తయ్యే వరకు అమ్మాయికి పెండ్లి చేయకూడదనుకుంది పద్మ. కానీ మంచి సంబంధం అని ఒప్పుకుంది.

రెండు లక్షల కట్నంతో పాటు ఇంటికి కావల్సిన అన్ని సామాన్లు ఇచ్చి కూతురి పెండ్లి ఘనంగా చేసింది. వియ్యంకుడు గడ్డం పెంచుకుని పెద్ద సాధువులా ఉంటాడు. అవతారాన్ని చూసి మంచి వ్యక్తే అనుకుంది. కానీ అతనే పెండ్లి రోజు పెద్ద సమస్య తెచ్చాడు. కొడుక్కి, తండ్రికి అస్సలు పడదు. పెండ్లి రోజు తండ్రి చొక్కా వేసుకోకపోతే కొడుకు కోప్పడ్డాడు. దాంతో అతను ఇంట్లోకి రానని మొండిగా బయటే కూర్చున్నాడు. తండ్రీ, కొడుకులకు పెద్ద గొడవే జరిగింది. పెండ్లి రోజు ఇదేం గొడవ అనుకొని పద్మ వెళ్ళి వియ్యంకుడిని బతిమలాడి ఇంట్లోకి పిలిచింది. చివరకు అతను రావడంతో సమస్య పరిష్కారమయింది. కార్యక్రమాలన్నీ పూర్తయిన తర్వాత పద్మ, సంధ్యను అత్తారింట్లో వదిలిపెట్టి పిన్నీ, బాబాయిని తోడుంచి వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిందో లేదో మూడో రోజే వియ్యంకుడు పద్మకు ఫోన్ చేసి

'ఒక్కసారి నువ్వు మా ఊరికి రా, నీ కూతురు ఏం చేసిందో చెబుతా' అని ఫోన్ పెట్టేశాడు. పద్మ కంగారుగా సంధ్యకు ఫోన్ చేసింది. ఎందుకు రమ్మన్నాడో సంధ్యకు కూడా తెలియదు. దాంతో పద్మ కంగారుగా అక్కడికే బయలుదేరింది. ట్రైన్ దిగి ఆటో మాట్లాడుకొని వియ్యాల వారి ఇంటికి వెళ్ళింది. వెళ్ళీ వెళ్ళగానే "ఆ వచ్చావా.. రామ్మా రా.. ఇదేనా మీ సంస్కారం. నీ కూతురు చూడు ఎంత నీచమైన పని చేసిందో అన్నాడు'.



'ఒక్కసారి నువ్వు మా ఊరికి రా, నీ కూతురు ఏం చేసిందో చెబుతా' అని ఫోన్ పెట్టేశాడు. పద్మ కంగారుగా సంధ్యకు ఫోన్ చేసింది. ఎందుకు రమ్మన్నాడో సంధ్యకు కూడా తెలియదు. దాంతో పద్మ కంగారుగా అక్కడికే బయలు దేరింది. ట్రైన్ దిగి ఆటో మాట్లాడుకొని వియ్యాల వారి ఇంటికి వెళ్ళింది. వెళ్ళీ వెళ్ళగానే "ఆ వచ్చావా.. రామ్మా రా.. ఇదేనా మీ సంస్కారం. నీ కూతురు చూడు ఎంత నీచమైన పని చేసిందో అన్నాడు'. చిన్న పిల్ల తెలియక ఏమైనా పొరపాటు చేస్తే క్షమించండి అన్నయ్య గారు, అమ్మాయితో నేను మాట్లాడతాను' అంటూ పద్మ అతడిని బతిమలాడుకుంది.

ఇంతకీ సంధ్య చేసిన తప్పేంటని అడిగితే 'మీ అమ్మాయి వంటింట్లో వంట చేస్తుంటే, మా వాడు వెళ్ళి ఆమె నడుము పట్టుకున్నాడు' అని చెప్పాడు. అది విని పద్మకు నోట మాట రాలేదు. ఏం చేయాలో అసలే తోచలేదు. తండ్రి గొడవ పెట్టుకుంది ఈ విషయానికని తెలిసి కొడుకు అతనితో గొడవ పెట్టుకుని అక్కడి నుంచి భార్యను తీసుకుని సిటీకి వచ్చేసి వేరు కాపురం పెట్టాడు.

వేరు కాపురం పెట్టిన తర్వాతైనా కూతురు, అల్లుడు సంతోషంగా ఉంటానుకుంది పద్మ. కానీ అసలు సమస్య అప్పుడే మొదలయింది. తండ్రికి తగ్గ కొడుకులా ఉన్నాడు కార్తిక్. సంధ్యను ఎప్పుడూ సూటి పోటి మాటలు అంటాడు. చేతికి ఒక్కపైసా ఇవ్వడు. పైగా అంతెందుక తింటున్నావు. ఇదెందుకు వండావు' అని ప్రతి దానికీ లెక్కలు తీస్తాడు. గంటలు గంటలు ఎవరితోనో ఫోన్లు మాట్లాడతాడు. అర్ధరాత్రి అయినా నిద్రపోడు. సంధ్యతో తన పని అయిపోయిన తర్వాత ఓ పక్కకు తిరిగి పడుకుంటాడు. 'ఎవరితో మాట్లాడుతున్నావంటే నీకెందుకు' అని కొడతాడు. ఆ ఇంట్లో సంధ్యకు భద్రత లేదు. అలాంటి పరిస్థితుల్లోనే సంధ్య నెల తప్పింది. అప్పటి నుంచి కార్తిక్ ఆమెను అస్సలు పట్టించుకోడు. 'నీకే తిండి దండగ అనుకుంటే మళ్ళీ నీ కడుపులో బిడ్డ ఒకటా' అనేవాడు. ఇదంతా సంధ్యకు ఏమీ అర్థమయ్యేది కాదు. ఈలోపు అతను కంపెనీ పనిపై అమెరికా వెళ్ళవలసి వచ్చింది. తండ్రిపై ఉన్న అనుమానంతో సంధ్యను పుట్టింట్లో వదిలి వెళ్ళాడు. మళ్ళీ మూడు నెలలకు వచ్చాడు. సంధ్యను మాత్రం పుట్టింట్లోనే ఉంచాడు.

పాప పుట్టిన తొమ్మిది రోజులకు కార్తిక్ ఆఫీస్ పనిపై మళ్ళీ అమెరికా వెళ్ళాడు. మూడు నెలల తర్వాత తిరిగి వచ్చాడు. వచ్చిన తర్వాత ఎన్ని రోజులైనా సంధ్యనూ, పాపను తీసుకెళ్ళడు. దాంతో పద్మనే కూతురినీ, మనవరాలినీ వాళ్ళ ఇంట్లో వదిలిపెట్టి వెళ్ళింది. అప్పటి నుంచి సంధ్యకు కష్టాలు మొదలయ్యాయి. పాపకు పాలు కావాలంటే 'ఇద్దరూ కలిసి ఎన్ని పాలు తాగుతారు' అంటాడు. పాపను కనీసం ఎత్తుకోడు. భర్త ప్రవర్తన, మాటలు సంధ్య భరించలేక పోయేది. ఇంట్లో తిండి కూడా సరిగా ఉండేది కాదు. కార్తిక్ అస్సలు పట్టించుకోడు. దాంతో సంధ్య పుట్టింటికి వచ్చేసింది.

ఒకపక్క కార్తిక్ అమెరికా వెళ్ళి అక్కడే స్థిరపడే ప్లాన్ చేసుకుంటున్నాడు. అల్లుడు అమెరికా పోతే కూతురి పరిస్థితి ఏమిటో అర్థం కాక పద్మ ఆయోమయంలో ఉంది. కూతురి జీవితం కోసం ఆ తల్లి పడుతున్న వేదన చూడలేక తెలిసిన వాళ్ళు ఐద్వా లీగల్‌సెల్‌కు వెళ్ళమంటే పద్మ, సంధ్యను తీసుకుని వచ్చింది.

పరిస్థితి తెలుసుకున్న సభ్యులు కార్తిక్‌కి లెటర్ పంపారు. అతను ఒక్కడే వచ్చి 'సంధ్యకు ఇంట్లో పనులు ఏమీ రావు. ఏం చేస్తుందో ఆమెకే తెలియదు. అన్నీ వేస్ట్ చేస్తుంది. ఎంత చెప్పినా వినిపించుకోదు. అందుకే అప్పుడప్పుడు భయపెడతాను. దానికే ఆమె పుట్టింటికి వెళ్ళి కూర్చుంటుంది. దానికి నేనేం చేయాలి. తప్పంత ఆమెదో' అన్నాడు.

'నీ బిడ్డ పాలు తాగుతుంటే లెక్కలు కడతావు. గంటలు గంటలు ఎవరితోనో ఫోన్లో మాట్లాడతావు. భార్య, బిడ్డ అనే ప్రేమే లేదు. ఇప్పటి వరకు నీ బిడ్డను ఒక్కసారైనా ప్రేమతో ఎత్తుకున్నావా? ప్రతి చిన్న విషయానికీ సంధ్యను అనుమానించి కొడతావు. తప్పులన్నీ నీ దగ్గర ఉంచుకుని ఆమెను అంటావా? సంధ్యను వదిలిపెట్టి హాయిగా అమెరికా వెళ్ళిపోదామనుకుంటున్నావా? ఆమె ఇప్పుడు నీపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెడితే రాష్ట్రం వదిలి ఎక్కడికీ వెళ్ళలేవు. పైగా నీ వీసా కూడా రద్దవుతుంది. వాళ్ళకు అండ ఎవరూ లేరని నీ ఇష్టం వచ్చినట్టు చేస్తున్నావు. భార్యా పిల్లల్ని ఇబ్బంది పెట్టి నువ్వు మాత్రం ఏం సుఖంగా ఉంటావు. ఇంట్లో ప్రశాంతత ఉంటేనే హాయిగా ఉద్యోగం చేసుకోగలవు. ఇప్పటికైనా నువ్వు మారకపోతే నీపై కేసు పెట్టడానికి సంధ్య సిద్ధంగా ఉంది. ఇక నువ్వే ఆలోచించుకో, నిర్ణయం నీదే' అన్నారు సభ్యులు.

నీ బిడ్డ పాలు తాగుతుంటే లెక్కలు కడతావు. గంటలు గంటలు ఎవరితోనో ఫోన్లో మాట్లాడతావు. భార్య, బిడ్డ అనే ప్రేమే లేదు. ఇప్పటి వరకు నీ బిడ్డను ఒక్కసారైనా ప్రేమతో ఎత్తుకున్నావా? ప్రతి చిన్న విషయానికీ సంధ్యను అనుమానించి కొడతావు. తప్పులన్నీ నీ దగ్గర ఉంచుకుని ఆమెను అంటావా? సంధ్యను వదిలిపెట్టి హాయిగా అమెరికా వెళ్ళిపోదామనుకుంటున్నావా?

పోలీస్‌స్టేషన్ అనేసరికి కార్తిక్ భయపడి 'నేనేమీ కావాలని చేయడం లేదు. సంధ్య వల్లనే ఇదంతా. ఆమె మంచిగా ఉంటే నేను మాత్రం ఎందుకు ప్రేమగా ఉండను. నాకు నా భార్యా, పాప కావాలి' అన్నాడు.

ఆమెతో మేము మాట్లాడతాం. ఇకపై తన వల్ల నీకేమైనా ఇబ్బంది వస్తే మా దగ్గరకు వచ్చి చెప్పు. అంతేకానీ నువ్వు మాత్రం సంధ్యను కొట్టడానికి వీల్లేదు. అయినా నీతో రావాలో వద్దో నిర్ణయించుకోవల్సింది సంధ్య' అని సభ్యులు ఆమె అభిప్రాయం అడిగారు. 'అతను మంచిగా చూసుకుంటే నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఆయన ఇప్పుడే అమెరికా వెళ్ళకూడదు. నాకు అతనిపై నమ్మకం వస్తేనే వెళ్ళనిస్తాను' అంది. దానికి కార్తిక్ ఒప్పుకొని ఇకపై సంధ్యను, పాపను మంచిగా చూసుకుంటానని చెప్పి ఇద్దరినీ తనతో ఇంటికి తీసుకెళ్ళాడు.

రెండు వారాల తర్వాత పద్మ లీగల్‌సెల్‌కు వచ్చి 'మేడమ్ ప్రస్తుతం కార్తిక్ అమ్మాయినీ, పాపను బాగానే చూసుకుంటున్నాడు. ఇదంతా మీ వల్లనే జరిగింది. చాలా సంతోషంగా ఉంది. ఈ అమ్మ వేదన తీర్చారు, మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను' అని చెప్పి ఆనందంగా వెళ్ళిపోయింది.

సలీమ



ఆటో పరిశ్రమలో మొదటి మహిళా ఇంజనీర్

కంప్యూటర్ ఇంజనీర్‌గా జీవితాన్ని ప్రారంభించిన ఆమె ఈ రోజు ఎంతో మందికి ఉన్నత విద్యావకాశాలను కల్పిస్తున్నారు. ఆడపిల్లలకు అండగా నిలబడుతున్నారు. ఆరోగ్యంపై ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పించడానికి గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నారు. ఆమె పద్మశ్రీ సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధినేత.

కర్ణాటక రాష్ట్రం హావేరీ జిల్లా షిగ్గాన్‌లో సుధ జన్మించింది. తండ్రి ఎస్. ఆర్. కులకర్ణ వైద్యుడు. చిన్నతనం నుంచే ఆమెకు పుస్తకాలు చదవడం ఎంతో ఇష్టం. తన బాల్యంలో తాతనాన్నమ్మలతో అనుబంధాన్ని, అనుభవాలను ఆ తర్వాత పుస్తకంగా (How I Taught my Grandmother to Read & Other Stories) రచించారు. బి.వి.బి. సాంకేతిక కళాశాల నుండి సుధా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పట్టాను అందుకున్న ఆమె క్లాస్ ఫస్ట్ మార్కులు సాధించి..కర్ణాటక ముఖ్యమంత్రి నుంచి స్వర్ణపతకం అందుకున్నారు. ఆ తర్వాత కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్ డిగ్రీని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో పూర్తి చేశారు. గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

Women of the day

భారతదేశ అతిపెద్ద ఆటో పరిశ్రమ టెల్కో లో మొట్టమొదటి మహిళా ఇంజనీర్ గా ఉద్యోగం సాధించారు. అప్పటికి ఈ సంస్థలో కేవలం పురుషులకే స్థానం కల్పించేవారు. దీనిని ప్రశ్నిస్తూ ఆవిడ ఆ సంస్థ అధ్యక్షుడికి ఒక పోస్టుకార్డు రాసారు. దీనిని స్పందించిన యాజమాన్యం ఆవిడకు ప్రత్యేకం ఇంటర్వ్యూ నిర్వహించి అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆ సంస్థ పూనా శాఖలో పనిచేస్తున్నపుడే ఆవిడకు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఎన్.ఆర్.నారాయణ మూర్తి ఏర్పడిన పరిచయం పెండ్లికి దారితీసింది. ఆ తర్వాత ఆయన ప్రారంభించిన ఇన్ఫోసిస్ సంస్థ ఎంతో గుర్తింపు పొందింది.

సుధామూర్తి అనేక అనాథాశ్రమాలను ప్రారంభించారు. కర్ణాటకలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు అందించి పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ విజ్ఞానాన్ని అందిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో భారతీయ గ్రంథాలతో 'ది మూర్తి క్లాసికల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా'ను ప్రారంభించారు.

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధినేతగా తన బాధ్యతలు నిర్వహిస్తూనే కంప్యూటర్ సైన్స్ ఉపాధ్యాయురాలు, రచయితగా కూడా ఆమె గుర్తింపు పొందారు. ఆమె రచించిన కన్నడ నవల 'డాలర్ సొసే' (డాలర్ కోడలు) ఆంగ్లంలో డాలర్ బహు గా అనువదించబడింది. ఆ తర్వాత ఈ నవల 2001 లో జీ టీవీ లో ధారావాహికగా ప్రసారమైంది. పెంగ్విన్ ముద్రణా సంస్థ ఆమె రచించిన అనేక పుస్తకాలను ముద్రించింది. బాల్యం గురించి ఆమె రాసినHow I Taught My Grandmother to Read & Other Stories పుస్తకము దాదాపు పదహైదు భాషలలోకి అనువదించారు. సామాజిక సేవ, విద్యా రంగాలలో ఆమె సేవలకు గౌరవ డాక్టరేటు అందుకున్నారు. ప్రముఖ న్యాయవేత్త సంతోష్ హెగ్డే తో కలిసి గౌరవ న్యాయ డాక్టరేటు, సాహితీ సేవ, రచనలకు గాను ఆర్. కె. నారాయణన్ పురస్కారం అందుకున్నారు.

2006లో భారత ప్రభుత్వం అత్యుత్తమ పద్మశ్రీ పురస్కారంతో ఆమెను సత్కరించింది. ❄

పొడిబారిన చేతులకు !



- చేతులు పొడి బారితే చాలా చికాగుగా, ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాంటి సమయంలో కొన్ని సులభమైన చిట్కాలను పాటిస్తే చాలు చేతులు మృదువుగా తయారవుతాయి.
- కొద్దిగా నిమ్మ రసంలో సగం చెంచా చక్కెర కలిపి చేతులకు మర్దన చేసుకుంటే చేతులు మృదువుగా, అందంగా తయారవుతాయి.
- గ్లిజరిన్, ఆలివ్ ఆయిల్ కలిపిన మిశ్రమాన్ని చేతులకు రాసుకొని పది నిమిషాల తర్వాత కడిగితే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా చేస్తే చక్కటి ఫలితం కనిపిస్తుంది.
- ఒక చెంచా చక్కెరలో సగం చెంచా కొబ్బరి నూనె కలిపి చేతులకు మర్దన చేసుకోవడం వల్ల చేతులు అందంగా కనిపించడంతో పాటు హైడ్రేట్ అవుతాయి.
- ఒక అరటి పండు గుజ్జులో రెండు చెంచాల తేనె కలిపి చేతులకు పట్టించాలి. ఇది పూర్తిగా ఆరిపోయాక నీటితో కడిగితే సరిపోతుంది.
- రాత్రి పడుకునే ముందు చేతులకు ఆలివ్ నూనె పట్టించాలి. ఇలా చేస్తే చేతులు మృదువుగా, అందంగా తయారవుతాయి. అలాగే చర్మపై ఉండే ముడతలు తగ్గుముఖం పడతాయి. ❄

మొండి పనులు సులువుగా..

మనలో చాలా మందికి చాలా లక్ష్యాలుంటాయి. ఓ నవల రాయడం కావచ్చు, ఓ పరీక్షలో నెగ్గడం కావచ్చు... ఏదైనా నేర్చుకోవడం, ఇంకేదైనా ప్రారంభించడం. కానీ సమస్య ఏంటంటే ఎలా మొదలుపెట్టాలో, ఎక్కడ మొదలుపెట్టాలో తెలియదు. అన్నింటికీ మించి ఉరుకుల పరుగుల జీవితంలో దానికంటూ సమయం కేటాయించడం ఎట్లాగో తెలియదు. చాలా మంది లేవగానే ఫోన్ తీసి.. వాట్సప్, ఫేస్‌బుక్ మెసేజ్‌లను చెక్ చేస్తుంటారు. లేవగానే చేసే మొదటి పనే అయితే రోజంతా చిరాకుగా ఉంటుంది. అయితే దాన్ని మొదలు పెట్టడానికో సూత్రం ఉందంటున్నారు నిపుణులు. అదే మొదటి గంట సూత్రం. ప్రతి రోజూ మొదటి గంటను దానికోసం



కేటాయించండి. ఆ గంట పూర్తవ్వగానే ఆపేయాలనుకుంటే ఆపేయండి. లేదు మధ్యలో ఆపలేనంతగా పనిలో నిమగ్నమై ఉన్నామనుకుంటే కొనసాగించండి.

నిజానికి ఇలా ప్రత్యేకంగా పని పెట్టుకున్నప్పుడు అది మొదలుపెట్టాలంటేనే ఓ ప్రతికూల భావనలో మనసులోకి వచ్చేస్తుంది. మనం అది చేయగలమా లేదా అనే సందేహం వెంటాడుతుంది. అలా కాకుండా ఉండాలంటే మొదటి గంటను కేటాయించి చూడండి. ఆ గంటలో మీరు పూర్తి చేసిన పని.. మీ మీద మీకు నమ్మకాన్నిస్తుంది. సానుకూల ఆలోచనలను ఇస్తుంది. రోజంతా సజావుగా గడపడానికి తోడ్పడుతుంది. అలాగే ఆ పనిని తరువాత కొనసాగించేందుకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. మారు ఆలోచించకుండా మీ షెడ్యూల్‌ను తయారు చేసుకోండి. ఆ ప్రత్యేక పనికోసం మొదటి గంట సమయాన్ని కేటాయించండి. ❄

ఇట్లా చేద్దాం

పెరుగు తొందరగా పాడవకుండా ఉండాలంటే అందులో కొద్దిగా కొబ్బరి ముక్కను వేయండి. ఇలా చేయడం వల్ల పెరుగు తొందరగా పాడవదు.



జీన్స్‌క్లాత్‌తో అదిరే అందాలు...



జీన్స్‌క్లాత్‌తో డిఫరెంట్ డిజైన్లు తయారు చేసుకోవచ్చు. ఈ క్లాత్‌తో తయారు చేసుకున్న వస్తువులను ఇంట్లో అలంకరించుకుంటే ఎంతో అందంగా, అద్భుతంగా కనిపిస్తాయి. వీటిని ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. ఈ అలంకరణ వస్తువులు తయారు చేసుకోవడానికి సమయం కూడా తక్కువే పడుతుంది. అలాగే ఎక్కువ కాలం చెక్కుచెదరకుండా ఉంటాయి. ఇంతటి అందమైన వస్తువులను ఓ సారి ప్రయత్నించి చూడండి !

- సహజంగా జీన్స్ క్లాత్ చాలా దృఢంగా ఉంటుంది. కాబట్టి ఆ క్లాత్‌తో ఎలాంటి అలంకరణ వస్తువునైనా సరే సులభంగా తయారు చేసుకోవచ్చు. అలాంటి వస్తువుల్లో ఒకటి బ్రష్ అండ్ పెన్సిల్ బాక్స్. దీని కోసం ముందుగా జీన్స్ క్లాత్‌ను బొమ్మలో చూసిన విధంగా ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇలా కత్తిరించుకున్న ముక్కలను ఒక దానికి మరొకటి చతురస్రాకారంలో కుట్టుకుంటే సరిపోతుంది. ఇది చూడటానికి ఒక అందమైన బాక్స్‌గా కనిపిస్తుంది. ఇలా తయారు చేసుకున్న బాక్స్‌ను బ్యూటీ కిట్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు.
- జీన్స్ బ్యాగ్‌ను తయారు చేసుకోవడానికి ఒక చిన్న సైజు జీన్స్ నిక్కర్, బెల్ట్, ఒక హ్యాంగింగ్ ఉంటే సరిపోతుంది. ముందుగా జీన్స్ నిక్కర్‌ను బొమ్మలో చూసిన విధంగా తయారు చేసుకోవాలి. ఇలా చేసుకున్న తర్వాత దానికి హ్యాంగింగ్ తగిలిస్తే సరిపోతుంది. ఇది చూడటానికి చాలా అద్భుతంగా కనిపిస్తుంది.
- దీన్ని చాలా సులభంగా, తొందరగా తయారు చేసుకోవచ్చు. జీన్స్ క్లాత్‌ను ఒక సంచి మాదిరి బొమ్మలో చూసినట్టు కుట్టుకుంటే సరిపోతుంది. ఇలా తయారు చేసుకున్న సంచిలో పిల్లలు ఆడుకునే చిన్న చిన్న ఆట వస్తువులను దాంట్లో వేసుకోవచ్చు.











- జీన్స్ క్లాత్‌తో తయారు చేసుకున్న పువ్వులు చాలా అందంగా, డిఫరెంట్‌గా కనిపిస్తాయి. ముందుగా క్లాత్‌ను చిన్న చిన్న ఆకుల మాదిరి బొమ్మలో చూసిన విధంగా కట్ చేసుకోవాలి. ఇలా కట్ చేసుకున్న ఆకులను ఒక దానికి మరొకటి కుట్టుకోవాలి. ఇలా గుండ్రంగా అల్లుకుంటే సరిపోతుంది.
- జీన్స్ క్లాత్‌తో పిల్లలకు వివిధ ఆకారాల్లో ఉండే దిండు కవర్లను స్వయంగా తయారు చేసుకోవచ్చు. దీని కోసం జీన్స్ క్లాత్‌ను ఇష్టమైన ఆకారంలోకి కత్తిరించుకొని కుట్టుకుంటే సరిపోతుంది. ఇలా తయారు చేసుకున్న దిండు కవర్ల మీద పిల్లల పేర్లను, డిజైన్లు అల్లుకుంటే సరిపోతుంది.
- ఎప్పుడూ రొటీన్‌గా ఇంట్లో డోర్ మ్యాట్‌లను వాడుతున్నారా ! అయితే కాస్త డిఫరెంట్‌గా డోర్ మ్యాట్‌లను తయారు చేసుకోండి. అది ఎలాగంటే ముందుగా జీన్స్ క్లాత్‌ను బొమ్మలో చూపిన విధంగా చతురస్రాకారం లేదా గుండ్రంగా కత్తిరించుకుంటే సరిపోతుంది. చాలా సులభంగా, తొందరంగా డోర్ మ్యాట్ రెడీ అవుతుంది. ❄

జీవిత ఖైదును సమర్థించిన హైకోర్టు ధర్మాసనం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళ హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ ఖైదు విధిస్తూ 2011లో చిత్తూరు జిల్లా మదనపల్లి ఏడో అదనపు జిల్లా కోర్టు వెలువరించిన తీర్పును హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఆ కేసులో నిందితులు మంజుల (విజయ), మంజునాథ దాఖలు చేసుకున్న అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తులు సంజయ్ కుమార్, షమీమ్ అక్తర్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం కొట్టివేసింది. నిందితులిద్దరికీ మదనపల్లి జడ్జి విధించిన తీర్పును ధర్మాసనం బలపరుస్తూ తీర్పు చెప్పింది. చిత్తూరు జిల్లా మేలుపట్ల గ్రామానికి చెందిన నాగమ్మను నిందితులు మంజుల తన ఇంటికి తీసుకెళ్లి బంగారాన్ని దోచుకున్నట్టు ఆధారాలు ఉన్నాయని, దోచుకున్న బంగారంలో కొంత మేరకు అమ్మినట్టు ఆధారాలను బట్టి ఆమెతోపాటు అందుకు మంజూనాథ్ సహకరించారనే సాక్ష్యాల మేరకే కింది కోర్టు తీర్పు చెప్పిందని హైకోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన మంజుల, మంజూనాథ మేలిపట్ల గ్రామంలో తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. అయితే పాల కేంద్రంలో పాలు విక్రయించేందుకు వెళ్లిన నాగమ్మను మాయమాటలతో ఇంటికి పిలిపించుకుని మంజూల్ ఆమెను హ్యత చేశారని ఆమె సోదరుడు చంద్రశేఖర్ పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులకు మదనపల్లి కోర్టు విధించిన జీవిత ఖైదును హైకోర్టు ధర్మాసనం సమర్థించింది.

సెప్టెంబర్ 21 నుంచి దసరా ఉత్సవాలు

విజయవాడ : శ్రీహేమలంభినామ సంవత్సర దసరా ఉత్సవాలను సెప్టెంబర్ 21వ తేదీ నుండి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సూర్యకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 21 నుండి 30వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని వివిధ అలంకారాలలో అలంకరించనున్నట్లు తెలిపారు. 21న స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా, 22న బాలాత్రిపుర సుందరీదేవిగా, 23న గాయత్రిదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న లలితా త్రిపుర సుందరీదేవిగా, 26న మహాలక్ష్మీదేవిగా, 27న సరస్వతీదేవిగా, 28న దుర్గాదేవిగా, 29న మహిషాసురమర్ధినిగా, 30న రాజరాజేశ్వరీదేవిగా అలంకరించనున్నట్లు వివరించారు. చివరిరోజున సాయంత్రం 5 గంటలకు కృష్ణా నదిలో హంసవాహన తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భారీ వర్షాలు

- వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- వరి, మెట్ట పైర్లకు జీవం



విశాఖపట్నం : వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం రాత్రి వెల్లడించారు. దీన్ని ఆనుకుని ఒడిశాలో మరో ఉపరితల ఆవర్తనం ఒకటి నెలకొందని వెల్లడించారు. దీని కారణంగా పలుచోట్ల ఏపీ, తెలంగాణలో వానలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపారు. అల్పపీడనం కారణంగా శుక్రవారం రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. డెల్టా, మెట్ట ప్రాంతాల్లో వేసిన పైర్లకు ఈ వానలు జీవం పోశాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. ఏలూరు, భీమడోలు, దెందులూరు, పెదపాడు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకూ భారీ వర్షం కురిసింది. డెల్టాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉన్నా జల్లులే పడ్డాయి. సాయంత్రం సమయంలో పలుచోట్ల భారీవర్షం కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో శుక్రవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజమహేంద్రవరం, రంపచోడవరం, పెద్దాపురం డివిజన్లలో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. మెట్ట ప్రాంతంలో ఇప్పటివరకూ 80 శాతం మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. ఈ వర్షాలు వ్యవసాయ సాగుకు మేలు చేస్తాయని అధికారులు చెబుతున్నారు. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, గుడివాడ, నూజివీడు, విజయవాడ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. పశ్చిమ కృష్ణా ప్రాంతమైన నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం తదితర ప్రాంతాల్లో పత్తి, మిర్చి పంటలకు ఈ వర్షం కొంతమేలు చేసింది. డెల్టా ప్రాంతమైన గుడివాడ, అవనిగడ్డ, పామర్రు, మచిలీపట్నం, పెడన ప్రాంతాల్లో ఎండుతున్న వరి పొలాలకు ఈ నీరు కొంత మేలు చేయనుంది. కంచికచర్ల, నూజివీడు, ఉయ్యూరు, తిరువూరు ప్రాంతాల్లో రోడ్లపై బురద పేరుకుపోయింది. విజయవాడలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ముసురు పట్టింది. బయటకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు, విద్యా సంస్థలకు వెళ్లి వచ్చేందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. శ్రీకాకుళం జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం మోస్తరు వర్షాలు కురిశాయి. గుంటూరు జిల్లాలో శుక్రవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో జల్లులతో కూడిన వర్షం కురిసినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం వరకూ సగటున ఆరు మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ వర్షాలతో పంటలకు మేలు చేకూరుస్తుందని రైతులు తెలిపారు. గత 17 రోజుల్లో జిల్లాలో నాలుగు మండలాల్లో వర్షాభావం నెలకొనగా, మరో 27 మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా అదనపు వర్షపాతం నమోదయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరో 26 మండలాల్లో మాత్రం సాధారణవర్షం పాతం నమోదైంది. శ్రీకాకుళం, టెక్కలి, ఎచ్చెర్ల తదితర మండలాలతో పాటు సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలోనూ ఉదయం ఏడు గంటల నుంచి 9.30 గంటల వరకూ, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ వర్షం కురిసింది.

డ్రగ్స్ కేసులో త్వరలో అరెస్టులు?

- సినీ సెలబ్రిటీలకు బిగిస్తున్న ఉచ్చు
- చార్జిషీట్ల తయారీలో సిట్ మల్లగుల్లాలు



హైదరాబాద్ : డ్రగ్స్ కేసులో ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) విచారణకు హాజరైన సినీ సెలబ్రిటీలను త్వరలో అరెస్టు చేయనున్నట్లు తెలిసింది. నార్కోటిక్ డ్రగ్స్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్స్ (ఎన్‌డీపీఎస్) యాక్టు 1985 క్రింద కేసులు నమోదు చేసేందుకు ఆబ్కారీ శాఖ సాక్ష్యాలు సేకరించింది. కోర్టుకు ఛార్జిషీటు దాఖలు చేయకముందే వారిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. డ్రగ్స్‌తో సంబంధం ఉన్న సెలబ్రిటీలను అరెస్టు చేస్తారనే వార్తలు రావడంతో తెలుగు సినీ పరిశ్రమలో మళ్ళీ అలజడి మొదలయింది. అయితే అరెస్టులను తప్పించుకునేందుకు వారు హైకోర్టును ఆశ్రయి స్తున్నట్లు తెలిసింది. నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ బోర్డు (ఎన్‌సీబీ) కేసులు వాదించే సీనియర్ అడ్వకేట్ గోఖలే, ఇతర న్యాయ నిపుణులతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ గత రెండు వారాల నుంచి ఇదే విషయంపై ప్రతిరోజు చర్చిస్తున్నారు. డ్రగ్స్ కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలన్నీ సంపాదించిన తరువాత సినీ సెలబ్రిటీలో నలుగురైదుగురిని సిట్ అరెస్టు చేసే అవకాశం ఉంది. ఇప్పటివరకు డ్రగ్స్ కేసులో సిట్ 22 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపింది. అనుమానితులకు నోటీసులు జారీచేసి ప్రశ్నించే ప్రక్రియ సిట్ కార్యాలయంలో నేటికీ కొనసాగుతూనే ఉంది.

వేగంగా విచారణ..

డ్రగ్స్ కేసు విచారణ వేగంగా సాగుతోందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ కేసులో ఇప్పటికే విచారించిన సినీ ప్రముఖులు సాక్షులా, నిందితులా అనేది ఇప్పుడే చెప్పలేమని, వారి విషయంలో చట్టప్రకారమే వ్యవహరిస్తున్నామన్నారు. అయితే ఈకేసుకు సంబంధించి పక్కా ఆధారాలు సేకరిస్తున్నామని, ఎక్కడా చట్టాన్ని అతిక్రమించడం లేదని స్పష్టంచేశారు. డిసెంబర్ చివరి నాటికి అన్ని కేసులకు సంబంధించి కోర్టుకు చార్జిషీట్లు దాఖలు చేస్తామని చెప్పారు.

కోటి ఎకరాలకు సాగునీరే లక్ష్యం

- రాష్ట్ర మంత్రులు కేటీఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-సిరిసిల్ల/తంగళ్లపల్లి

తెలంగాణలోని కోటి ఎకరాలకు సాగునీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సర్దాపూర్‌లో వ్యవసాయ గోదాములను, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. వ్యవసాయమే దండగా అన్న గత ప్రభుత్వాలకు సమాధానంగా ప్రస్తుత సర్కారు వ్యవసాయాన్ని పండగలా నిర్వహిస్తోందని వివరించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో గోదావరి, కృష్ణా నదులపై మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ప్రాజెక్టులు నిర్మించాయని అన్నారు. దీంతో తెలంగాణ ప్రాంతానికి నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మేడిగడ్డ, కాళేశ్వరం, సుందిళ్ల ప్రాంతాల్లో ప్రాజెక్టులను నిర్మించి ఎత్తిపోతల ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టును, అట్నుంచి ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులను నింపి వ్యవసాయానికి నీరందించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో 24 లక్షల బోరుబావుల కింద 15 లక్షల ఎకరాలు, ప్రాజెక్టుల కింద 15 లక్షల ఎకరాలు సాగవుతుందన్నారు. తెలంగాణాలో రైతుల కోసం రూ. 17వేల కోట్ల రుణమాఫీ చేయడం గర్వకారణంగా ఉందన్నారు. వచ్చే ఖరీఫ్ సీజ న్ నుంచి రైతులకు ఎరువుల కోసం ఎకరాకు రూ.4వేలు ఇస్తామన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయండి

- పర్యావరణ శాఖ కార్యదర్శికి శశిధర్‌రెడ్డి వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శి అజయ్ నారాయణ్‌ఝాకు మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి కోరారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఢిల్లీలో శుక్రవారం పర్యావరణ శాఖ కార్యాలయంలో శశిధర్‌రెడ్డి కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విలువ రూ.80,000 కోట్లకుపైగా ఉన్నందున రాష్ట్ర ఆర్థిక, పర్యావరణ, సామాజిక అభివృద్ధి మీద విపరీతమైన ప్రభావం పడనుందని తెలిపారు. కాబట్టి ప్రజాభిప్రాయ సేకరణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ చేపట్టాలని కోరారు. పైగా ప్రాజెక్టు ప్రభావ అంచనా నివేదికలను ముందస్తుగా ప్రజలకు అందజేయాల్సి ఉన్న అది జరగడం లేదని వివరించారు. ఒకవేళ ప్రజాభిప్రాయ సేకరణ చేపడితే ఆ సమావేశాలను వీడియో రికార్డు చేయించాలని కోరారు.

అక్బరుద్దీన్ హత్యాయత్నం కేసులో నిందితుడికి బెయిల్

హైదరాబాద్: మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై హత్యాయత్నం కేసులో నిందితుడు హసన్ బిన్ సలేహ్ పహిల్వాన్‌కు హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి సునీల్‌చౌదరి మధ్యంతర ఆదేశాలిచ్చారు. పహిల్వాన్‌కు నాంపల్లి కోర్టు విధించిన శిక్షను హైకోర్టు సస్పెండ్ చేసి బెయిల్ ఆదేశాలిచ్చింది. ఘటనా స్థలంలో పహిల్వాన్ లేరని, అయినా నాంపల్లి కోర్టు ఆయనకు పదేండ్లు జైలు శిక్ష విధించడం చెల్లదని న్యాయవాది వాదనల అనంతరం హైకోర్టు బెయిల్ ఇచ్చింది. అక్బరుద్దీన్ ఒవైసీపై హత్యాయత్నం కేసులో 14 మంది నిందితుల్లో పది మందిని నిర్దోషులుగా, ముగ్గురికి పదేండ్లు శిక్ష విధించిన విషయం విదితమే.

పోలీసు చిత్రహింసలపై సర్కారుకు నోటీసు

వికారాబాద్ జిల్లా ఎర్రవల్లి వాసి పి.కన్నారెడ్డిని పోలీసుల చిత్రహింసలకు గురి చేయడంతో కిడ్నీలు రెండూ పాడయ్యాయని, తాను పోలీసులపై పెట్టిన కేసులో అన్యాయం జరుగుతోందని దాఖలైన కేసులో హైకోర్టు తెలంగాణ సర్కార్‌కు నోటీసులిచ్చింది. పోలీసుల దెబ్బల కారణంగా తన కిడ్నీలు పాడైనందున తకు పరిహారంగా రూ.2 కోట్లు ఇవ్వాలన్న రిట్‌ను శుక్రవారం న్యాయమూర్తి కోదండరామ్ విచారించారు.ఎరువుల షాపు కోసం దరఖాస్తు చేసుకుంటే వ్యవసాయ అధికారి నీరజకి లంచం ఇవ్వలేదని ఆమె తనపై పోలీసులకు ఫిర్యాదు చేసి దారుణంగా కొట్టించారని, దీనిపై ఎస్పీకి, ఇతర పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.

ప్రయివేటు వ్యక్తులతో ఖాకీల కుమ్మక్కు

ప్రయివేటు వ్యక్తులతో కుమ్మకై తమ కేసుల్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖమ్మం ఒన్‌టౌన్, పట్టణ పోలీస్ స్టేషన్ అధికారులపై విచారణ చేసి తమకు నివేదిక ఇవ్వాలని హైకోర్టు న్యాయమూర్తి కోదండరామ్ ఖమ్మం పోలీస్‌కమిషనర్‌ను ఆదేశించారు. ఎస్‌హెచ్‌ఓలు రహమాన్, కె.నాగేంద్రాచారిలు ప్రయివేటు వ్యక్తులతో కుమ్మక్కు కావడంతో తమ ఫిర్యాదుల్ని పట్టించుకోవడం లేదని ఎస్.హైమావతి దాఖలు చేసిన రిట్‌ను న్యాయమూర్తి విచారించి ప్రతివాదులైన పోలీసులతోపాటు ప్రయివేటు వ్యక్తులు పి. మల్లేష్ ఇతరులకు నోటీసులిచ్చారు.

9న జాతీయ లోక్‌అదాలత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్ కేసుల పరిష్కారానికి సెప్టెంబరు 9న జాతీయ లోక్‌అదాలత్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర న్యాయ సర్వీసుల అథారిటి సభ్యకార్యదర్శి బీఆర్ మధుసూదన్ రావు తెలిపారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా లోక్‌అదాలత్‌లు ఆరోజు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వీటి పరిష్కారం సందర్భంగా కోర్టు ఫీజు మాఫీ చేయడం జరుగుతుందన్నారు. మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, బ్యాంకుల కేసుల పరిష్కారంపై దృష్టి సారిస్తామన్నారు. ఈమేరకు ఉమ్మడి రాష్ట్రం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలను అమలుచేస్తామన్నారు. ఇప్పటికే బీమా కంపెనీలు, బ్యాంకు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్టు చెప్పారు.

ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాటం

కలిసికట్టుగా మద్యాన్ని నిర్మూలిద్దాం : ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆశాలత

నవతెలంగాణ-బోడుప్పల్ / జవహర్‌నగర్

ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం మహిళలంతా కలిసి కట్టుగా పోరాడాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు కెఎన్ ఆశాలత పిలుపునిచ్చారు. కలిసికట్టుగా పోరాడితే మద్య నిర్మూలన పోరాటంలో విజయం సాధిస్తామని చెప్పారు. అక్టోబర్‌లో జరిగే ఐద్వా మహాసభల నేపథ్యంలో ఆ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జీపుజాతా నిర్వహిస్తున్నారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలంలో, జవహర్‌నగర్‌లో జీపు జాతా శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగాయన్నారు. బాధితులకు న్యాయం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ అదే పరిస్థితి కొనసాగుతున్నదన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో మహిళలకు ప్రాధాన్యత లేదన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా మహిళలు ఎదగడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవటం లేదని తెలిపారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడేండ్లు గడుస్తున్నా మంత్రి వర్గంలో మహిళలకు చోటు ఇవ్వకపోవటం దారుణమన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకొస్తున్నామని చెపుతున్న పాలకులు వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయట్లేదని విమర్శించారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకోవడానికి మద్యం దుకాణాలకు విస్తృతంగా అనుమతులిస్తున్నారన్నారు. పచ్చని సంసారాల్లో ప్రభుత్వం చిచ్చుపెడుతున్నదన్నారు. మహిళల ఐక్యతతోనే రాజకీయ, ఆర్థిక సమానత్వం సాధించగల్గుతామని తెలిపారు. అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో మేడ్చల్ జిల్లాలో ఐద్వా రాష్ట్ర ద్వితీయ మహాసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు చల్లా లీలావతి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సృజన, వినోద, కోశాధికారి విజయ, జిల్లా నాయకురాలు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆశాలత

భూపోరాటానికి పర్వతాపూర్ నుంచే శ్రీకారం

పర్వతాపూర్‌లో ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న మహిళలకు జీపుజాతా బృందం సభ్యులు మద్దతు తెలిపారు. పర్వతాపూర్‌లోని సీలింగ్ భూముల్లో పేదలందరికీ డబుల్ బెడ్‌రూంలు నిర్మించివ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం మహిళలు సుమారు రెండు నెలలుగా పోరాటం చేస్తుంటే పాలకులు స్పందించకపోవటం దారుణమన్నారు. అధికారులు స్పందిచకపోతే పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్త భూ పోరాటాలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుడతామన్నారు.

పాలమూరుకు జూపల్లి ప్రథమ శత్రువు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాలమూరుకు సాగు, త్రాగు నీటి విషయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పచ్చి అబద్దాలు మాట్లాడుతూ... ఆ జిల్లాకు ప్రథమ శత్రువుగా మారారని కాంగ్రెస్ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి కాకుండా ప్రత్యేక సోర్స్ ద్వారా నీళు తీసుకపోవాలనే జీవోలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసిన విషయాన్ని దాచిపెట్టి మంత్రి ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. ఈ అంశంపై తాను బహిరంగ చర్చకు సిద్దమని, జూపల్లికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 19.20 తేదీల్లో సమయం, స్థలం చెప్పాలని, లేకపోతే 21న తాను బహిరంగ చర్చకు వస్తాను ఎక్కడి రమ్మంటారో చెప్పాలని డిమాండ్ చేశారు.

భూవివాదంలో సీఐ, ఎస్ఐపై వేటు

- ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- అదనపు డీసీపీపై చర్యలకు సిద్ధం

నవతెలంగాణ-సిటీబ్యూరో

భూ వివాదంలో బాధితులను నిర్బంధించి చెక్కులపై సంతకాలు తీసుకున్న వ్యవహారంలో రాయదుర్గం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిలపై బదిలీ వేటు పడింది. ఈ ఇద్దరినీ సైబరాబాద్ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ కమిషనర్ సందీప్ శాండిల్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అదనపు డీసీపీ పులిందర్ రెడ్డిపై కూడా చర్యలకు రంగం సిద్ధమైంది. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన మాదాపూర్ ఏసీపీ రమణకుమార్ నివేదికను కమిషనర్‌కు అందజేశారు. అందులో భాగంగా కమిషనర్ సందీప్ శాండిల్యా చర్యలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ప్రాంతంలో రెండు ఎకరాల భూమిపై రెండేండ్లుగా క్రయవిక్రయాల్లో వివాదం నెలకొన్న విషయం విదితమే.

ఈ వివాదంలో రాచకొండ ఏఆర్ అదనపు డీసీపీ పులిందర్ రెడ్డి, రాయదుర్గం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణలు బాధితులను బెదిరించారు. చెక్‌లపై సంతకాలు తీసుకున్నారు. ఈ విషయాన్ని బాధితులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపించి చర్యలు తీసుకున్నారు.

పెట్టుబడి పథకం కోసమే భూ సర్వే: కేసీఆర్

- సీఎంతో కేంద్ర సంయుక్త కార్యదర్శి భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రైతులకు పెట్టుబడి పథకాన్ని సరిగ్గా అమలు చేసేందుకే భూసర్వే చేపట్టనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో తనతో భేటీ అయిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి హుకుమ్‌సింగ్‌తోపాటు ఆయన బృందానికి వివరిం చారు. ఈ సందర్భంగా భూసర్వేపై చర్చించారు. భూసర్వే విప్లవాత్మ కమైన కార్యక్రమమని, మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దీనికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందుతాయని అనంతరం హుకుమ్‌సింగ్ చెప్పారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతులకు ప్రతిఏడాదికి ఎకరాకు రూ. 8 వేల చొప్పున పెట్టుబడి అందించే కార్యక్రమం దేశంలో మరెక్కడా లేదన్నారు. ఈ పథకం అమలు కావాలంటే ఏ భూమి ఏవరి ఆధీనంలో ఉందో తెలియాలని అభిప్రాయపడ్డారు. ఈనేపథ్యంలోనే భూసర్వే చేస్తున్నామని చెప్పారు. రికార్డులను సరిచేసిన తరువాత కొత్త పాసు పుస్తకాలు ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కూడా సంస్కరణలు తెస్తున్నామన్నారు. పారదర్శకంగా ఉండే రిజిస్ట్రేషన్ విధానాన్ని రూపొందిస్తామన్నారు. సమగ్ర కుటు ంబ సర్వే విషయంలో అవగాహన వచ్చిందని, ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడానికి నిర్దిష్ట ప్రాతిపదిక ఏర్పడిందన్నారు. ఇప్పుడు భూసర్వే ద్వారా అటు రైతులకు పెట్టుబడి పథకం, ఇటు రిజిస్ట్రేషన్ల వ్యవహారం సక్రమంగా జరుగు తుందని ఆశిస్తు న్నామన్నారు. దీనికి హుకుమ్‌సింగ్ బదులిస్తూ దేశవ్యా ప్తంగా ఇలాంటి భూసర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే అనం తరం సమగ్ర నివేదికను కేంద్రానికి అందిస్తే, సహకారం అందిస్తామని చెప్పారు.

రేపు ప్రత్యేక సమావేశం

సమగ్ర భూసర్వే విషయమై ఈనెల 20న హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.సర్వే నిర్వహణపై కార్యాచరణ ప్రణాళికను ఈసందర్భంగా ఖరారు చేయనున్నారు. ఇప్పటికే కొందరు కలెక్టర్లు, సీనియర్ రెవెన్యూ అధికారులతో కూడిన బృందం సర్వే సందర్భంగా చేయాల్సిన పనులకు సంబంధించి అధ్యయనం చేస్తున్నారు.

అనాధ రోగులపై అమానుషం

సహాయకులు లేరని ఇద్దరి గెంటివేత

- చికిత్స అందక ఒకరి మృతి.. చావుబతుకుల్లో మరొకరు
- ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్దే ఘటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మృతిచెందిన రోగి(ఎడమవైపు), పక్కనే కొనఊపిరితో మరొకరు

పేరెన్నికగన్న గరీబోళ్ల ఆస్పత్రిలో ఉస్మానియా ఒకటి. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉండాల్సిన వసతులన్నీ ఇక్కడ ఉన్నాయని ఆస్పత్రి వర్గాలే కాదు పాలకులు గొప్పలు చెబుతారు. అత్యంత ఖరీదైన లివర్, కిడ్నీ మార్పిడిల చికిత్సలు చేస్తున్నామంటారు. ఎంత చేసినా ఏం లాభం.. ప్రాణాంతక పరిస్థితుల్లో ఒంటరి రోగులు అక్కడి వెళ్తే చికిత్స సంగతి దేవుడెరుగు. వారికి చావే గతి. దీన్ని నిజం చేస్తూ శుక్రవారం జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. అనారోగ్యంతో ఇటీవల ఇద్దరు గుర్తుతెలియని రోగులు ఆస్పత్రిలో చేరారు. అయితే, వారు అనాథలని ఆస్పత్రి సిబ్బందికి తెలియడంతో శుక్రవారం వారిని నిర్దాక్షిణ్యంగా బయటికి గెంటేశారు. దీంతో చికిత్స అందక ఒక రోగి ఆస్పత్రి మెయిన్‌గేట్ సమీపంలోనే ప్రాణాలొదలగా, మరో రోగి చావుబతుకుల మధ్య కొట్టామిట్టాడుతున్నాడు. కాగా, వీరిద్దరు చికిత్స పొందుతున్న రోగులే కావడం గమనార్హం. సాధారణంగా రోగులను డిశ్చార్జీ చేస్తే గ్లూకోజ్ అందించే ఐవీ ట్యాగ్ తీసేస్తారు. కానీ, సదరు రోగులకు ఐటీ ట్యాగ్‌తోనే బయటికి గెంటేయడంపై సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. మరోవైపు, ఇలాంటి సంఘటనలు ఇక్కడ కొత్తేమి కాదని. ప్రతిరోజు జరిగేదేనని స్థానిక చిరువ్యాపారి షేక్ అహ్మద్ 'నవతెలంగాణ'కు తెలిపారు. ఇలా ఉండగా, అనాధ రోగులకు అత్యవసర సేవలు అందించడానికి వాలంటీర్లను ఏర్పాటు చేయడం కోసం స్థానికంగా ఉన్న 'సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చినా ఆస్పత్రి అధికారులు తిరస్కరించడం విశేషం. 2011లోనే ఆస్పత్రిలో సేవలందించేందుకు తమ వాలంటీర్ల ఏర్పాటుకు అనుమతివ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేశామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రావు తెలిపారు. సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి పేషీ నుంచి ఆస్పత్రికి లేఖ వచ్చినా ఆస్పత్రి వర్గాలు అందుకు అనుమతినివ్వక పోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. అంగీకరిస్తే ఆయా విభాగాల సేవలకు సంబంధించి తమ సిబ్బందికి శిక్షణ ఇప్పించి నియమిస్తామన్నారు. మానవీయ కోణంతో తమ సేవలకు అనుమతించాలని కోరారు.

విచారణకు ఆదేశించాం : ఆస్పత్రి సూపరింటెండెంట్

కాగా, ఉస్మానియా ఆస్పత్రిలో ఆవరణలో ఐపీ రోగి మృతిచెందడంపై ఆర్ఎంఓను విచారణకు ఆదేశించినట్టు సూపరింటెండెంట్ జీవీఎస్ మూర్తి తెలిపారు. ఇదే విషయమై ఆర్ఎంఓ అంజయ్యను వివరణ కోరగా..తనకు విషయం తెలియదని డ్యూటీ ఆర్ఎంఓను అడగండని చెప్పడం విశేషం. కాగా, జీవీఎస్ మూర్తి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత రోగులు, సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

దేశానికే తలమానికగా తీర్చిదిద్దాలి

- మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన అంబేద్కర్ విగ్రహాన్ని భారతదేశానికే తలమానికగా తీర్చిదిద్దాలని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆర్కిటెక్ కన్సల్‌టెంట్లకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో విగ్రహ ఏర్పాట్ల నమూనాలపై ఆర్కిటెక్ కన్సల్‌టెంట్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రి అర్కిటెక్చర్లు రూపొందించిన విగ్రహంలో పలు మార్పులు చేశారు. వీలైనంత త్వరగా విగ్రహం ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మళ్లి సమావేశం నాటికి విగ్రహం ఒక కొలిక్కి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో బుద్దవనం అభివృద్ధి ప్రాజెక్టు చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య, శాసనసభ్యులు గాదరి కిషోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

స్పెయిన్‌లో మరో ఉగ్రదాడి

ఐదుగురు అనుమానిత ఉగ్రవాదులు కాల్చివేత

బార్సిలోనా : స్పెయిన్‌లో శుక్రవారం తెల్లవారు జామున మరో ఉగ్రదాడి జరిగింది. సముద్రతీరంలోని పర్యాటక నగరం కామ్‌బ్రిల్స్‌లోనూ ఉగ్రవాదులు 'గురువారం'నాటి దాడి ప్రణాళికను అమలుజేశారు. అయితే ఈసారి ఉగ్రవాదుల దాడిని పోలీసులు అడ్డుకోవటంలో విజయవంతమయ్యారు. కొందరు వ్యక్తులు ఒక వ్యానును విచక్షణా రహితంగా ప్రజలపైకి తీసుకెళ్లారు. ఈ ఘటనలో పోలీసులతో సహా పలువురు గాయపడ్డారు. బార్సిలోనా ఘటనను పునరావృతం చేయటమే లక్ష్యంగా ఈ దుశ్చర్యకు ఒడిగట్టారు. వారిని ఆగిపోవాలని పోలీసులు హెచ్చరించిన ఫలితం లేదు. దీంతో భద్రతా దళాలు వారిని కాల్చి చంపాయి. ఈ ఘటనలో ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. గురువారం ఉగ్రదాడి జరిగిన బార్సిలోనాకు దక్షిణాన 130 కిలోమీటర్ల దూరంలో తాజా దాడి ఘటన చోటు చేసుకుంది.

ఆ ఉగ్రవాది ఇంకా దొరకలేదు !

స్పెయిన్‌లో జరుగుతున్న ఉగ్రదాడుల సూత్రధారులను పట్టుకొనేందుకు ఆ దేశ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. గురువారం బార్సిలోనా ఉగ్రదాడిలో పాల్గొన్న అసలు వ్యక్తిని పోలీసులు ఇంకా పట్టుకోలేకపోయారు. వాహనాన్ని అద్దెకు ఇచ్చిన డ్రిస్ ఔబాకిర్ అనే వ్యక్తితోపాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అయితే ఈ దాడికి తనకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులకు అతడు తెలియజేసినట్టు స్థానిక మీడియా వార్తల్ని ప్రసారం చేసింది. డ్రిస్ ఔబాకిర్ సోదరుడు, వ్యాన్ డ్రైవర్ 18 ఏండ్ల మౌస్సా ఔబాకిర్ ఉగ్రదాడి ప్రధాన సూత్రధారిగా వార్తలు వెలువడ్డాయి.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో అత్యంత సమన్వయంతో దాడులు నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. వరుస ఉగ్రదాడులు జరిపింది తామేనని ఇస్లామిక్ స్టేట్ సంస్థ ప్రకటించుకుంది. గురువారం బార్సిలోనాలో జరిగిన ఉగ్రదాడి ఘటనలో మొత్తం 14 మంది ప్రాణాలుకోల్పోయారు. 100మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో 11 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఫ్రాన్స్, పాకిస్తాన్, స్పెయిన్, నెదర్లాండ్స్, చైనా, వెనెజులా, మౌరిటానియా, ఆస్ట్రేలియా, బ్రిటన్ జాతీయత కలిగినవారు మృతుల్లో ఉన్నారని తెలిసింది. ఈ దాడిలో ఇద్దరు ఇటలీ పౌరులు చనిపోయారని రోమ్ ప్రకటించగా, గాయపడ్డవారిలో తమ దేశస్తులు 26 మంది ఉన్నారని ఫ్రాన్స్ ప్రభుత్వం తెలిపింది.



ఉగ్రదాడిలో మృతులకు నివాళి అర్పిస్తున్న దేశ ప్రధాని మారియానో రాజోయ్, స్పెయిన్ రాజు ఫిలిప్ (మధ్యలో ఉన్న వ్యక్తి)



భూమికి దగ్గరగా ఆస్టరాయిడ్

వాషింగ్టన్ : సుమారుగా 4.4 కిలోమీటర్ల వ్యాసం కలిగిన ఆస్టరాయిడ్ ఒకటి భూమికి అత్యంత సమీపంలో నుంచి వెళ్లనున్నదని నాసా తెలిపింది. సెప్టెంబర్ 1న అంతరిక్షంలో భూమికి 70 లక్షల కిలోమీటర్ల దూరం నుంచి 'ఫ్లోరెన్సి' అనే ఆస్టరాయిడ్ వెళ్లనున్నదని నాసాకు చెందిన 'స్పిట్జర్' స్పేస్ టెలిస్కోప్, నియోవైస్ అనే మిషన్ అంచనావేశాయి. దీని గురించి నాసా శాస్త్రవేత్త పాల్ ఛోడాస్ మాట్లాడుతూ..."ఎన్నో ఆస్టరాయిడ్స్ గతంలో భూమికి సమీపంగా ప్రయాణించాయి. అయితే వాటికి...'ఫ్లోరెన్సీ'కి ఉన్న తేడా పరిమాణం. చాలా చిన్న చిన్న ఆస్టరాయిడ్స్ గతంలో భూమికి చేరువలో ప్రయాణించాయి. 'నాసా' నియర్-ఎర్త్ ఆస్టరాయిడ్స్ మిషన్ ప్రారంభించన తర్వాత మొదటిసారిగా ఒక పెద్ద ఆస్టరాయిడ్ (ఫోరెన్సి) భూమికి అత్యంత సమీపంలో నుంచి ప్రయాణిస్తున్నది" అని చెప్పారు. ఆస్టరాయిడ్స్ గురించి అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలకు ఇదొక అరుదైన అవకాశమని నాసా తెలిపింది. భూమిపై ఉన్న రాడార్ అబ్జర్వేషన్స్‌తో ఆస్టరాయిడ్ గమనాన్ని, ఇతర విషయాల్ని తెలుసుకోవచ్చునని, అలాగే రాడార్ ఫోటోలతో ఆస్టరాయిడ్ పరిమాణాన్ని, ఉపరితలాన్ని కచ్చితంగా అంచనా వేయొచ్చునని నాసా తెలియజేసింది.

సూర్యగ్రహణం.. ఆఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

వాషింగ్టన్ : అమెరికాలో చాలా ఏండ్ల తర్వాత ఆగస్టు 21న సంపూర్ణ సూర్యగ్రహణం కనిపించనుంది. అయితే, ఈ అరుదైన దృశ్యాలను చూసేందుకు అమెరికా వాసులు సిద్ధమవుతుండగా.. మరోవైపు ఆ రోజు పనిదినం కావడంతో ఉద్యోగుల కోసం కంపెనీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. గ్రహణం సందర్భంగా ఏం చేయాలి? ఏం చేయకూడదో వివరిస్తూ పలు కంపెనీలు తమ ఉద్యోగులకు ప్రత్యేక మార్గదర్శకాలను ఇస్తున్నాయి. 'ఎమర్సన్ ఎలక్ట్రిక్స్' కంపెనీ తమ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కళ్లద్దాలను అందిస్తోంది. తమ కంపెనీలో 1400 మంది ఉద్యోగులు ఉన్నారని.. వారు సూర్యగ్రహణ దృశ్యాలను చూడాలనుకుంటే సన్‌గ్లాసెస్ పొందొచ్చని కంపెనీ పేర్కొంది. గ్రహణం ప్రారంభం కాగానే ఉద్యోగులు భవనం పైఅంతస్తుకు చేరుకొని.. ప్రత్యేకంగా అందించిన అద్దాలను ధరించి ఆ దృశ్యాలను చూడాలని కోరింది. సూర్యగ్రహణం సందర్భంగా 'టెల్‌నెట్‌ప్లస్' కంపెనీ తమ ఉద్యోగుల కోసం విందు కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తోంది. సూర్యగ్రహణ దృశ్యాలను చూసేందుకు ప్రత్యేక ఏర్పాట్లతోపాటు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆహారం, డ్రింక్స్ అందిస్తున్నట్టు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. సూర్యగ్రహణం సందర్భంగా తమ కంపెనీలోని 4 వేల మంది ఉద్యోగులకు సెలవు ప్రకటిస్తున్నట్టు మోన్‌సాంటో తెలిపింది.

మలాలాకు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రవేశం

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌కు చెందిన నోబెల్ శాంతి అవార్డు గ్రహీత మాలాలా యూసఫ్‌జాయ్ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రవేశం సంపాదించారు. రాజకీయం, తత్వశాస్త్రం, ఆర్థికశాస్త్రం కోర్సును ఆమె ఎంచుకున్నారు. తనతో పాటు ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ మలాలా ట్వీట్ చేశారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు వెళ్లాలనుకునేవారు ఏమాత్రం ఎదురు చూడకుండా ముందడుగు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ వెళ్లడానికి తనకు చాలా సంతోషంగా ఉందంటూ మలాలా ఆనందం వ్యక్తం చేశారు. ఆక్స్‌ఫర్డ్ వారు తనకు సీటు కేటాయిస్తూ పంపిన సందేశాన్ని ఈ సందర్భంగా షేర్ చేశారు.

పేలిన దశాబ్దాల నాటి బాంబు

హనోయి : దశాబ్దాల క్రితం నాటి బాంబు పేలి ముగ్గురు చిన్నారులు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన వియత్నాంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 1970లలో అమెరికా, వియత్నాం మధ్య యుద్ధం సందర్భంగా అమెరికా వైమానిక బలగాలు వేలకొద్దీ బాంబులను వియత్నాంపై విసిరాయి. వేశాయి. వీటిలో కొన్ని పేలలేదు. ఇలాంటిదే ఓ బాంబు ఖాన్‌హో ప్రావిన్స్‌లోని టా లువాంగ్ గ్రామానికి చెందిన ఓ రైతు భూమి దున్నుతుండగా దొరికింది. ఆ రైతు కుటుంబసభ్యులు దానిని ఇంటికి తీసుకెళ్లి ఇనుప వస్తువులను వేరు చేసేందుకు ప్రయత్నించగా బాంబు ఒక్కసారిగా పేలింది. దీంతో ముగ్గురు చిన్నారులు సహా ఆరుగురు చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి ఆ ఇల్లు కుప్పకూలింది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. 1975 సంవత్సరంలో అమెరికా, వియత్నాం యుద్ధం ముగిసింది. ఈ యుద్ధంలో 42 వేల మంది చనిపోగా 62 వేల మందికి పైగా గాయపడ్డారు. యుద్ధ సమయంలో అమెరికా విసిరిన బాంబులు ఇప్పటికీ అటవీ ప్రాంతాల్లో, రైతులు పొలాలు దున్నే సమయంలో బయటపడుతూనే ఉన్నాయి. కొన్ని సార్లు ఆ బాంబులు పేలి ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి.

స్పై లో తప్పిన ప్రమాదం..

- ప్రాణాలతో బయటపడ్డ మహిళ

బీజింగ్: గత కొద్దీ రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దక్షిణ చైనాలోని నదులు ఉప్పొంగుతున్నాయి. ఓ నదిపై ఉన్న కర్రల వంతెనను ఆ మహిళ దాటుతుండగా నది ప్రవాహం ఒక్కసారిగా ఉధృతమైంది. ఇది గమనించిన ఆ మహిళ నది ఒడ్డుకు చేరగానే.. రెండు, మూడు సెకన్లలోనే బ్రిడ్జి కుప్పకూలిపోయింది. నిమిషం తేడాలో ప్రమాదం నుంచి బయటపడింది.

అమెరికాతో కలిసి అడుగులేసినందుకేనా ?

- ఇరాక్, లిబియా, సిరియా, యెమెన్‌లలో యుద్ధకాండకు యూరప్‌పై ప్రతీకారం

బార్సిలోనా : తాజా ఉగ్రదాడి యూరప్ దేశాల ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తోన్నది. ఆయుధాలు, బాంబులు వెంటబెట్టుకొని వస్తే...ఎక్కడో ఒకచోట పట్టుబడతామని భావించిన ఉగ్రవాదులు, తమ వ్యూహాన్ని మార్చుకున్నారు. వాహనాలనే ఆయుధాలుగా మలుచుకుంటూ నీస్, బెర్లిన్, లండన్, స్టాక్‌హోం తదితర పట్టణాల్లో దాడుల్ని అమలుజేశారు. ఇలాంటివే మరిన్ని దాడులు జరగొచ్చునన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఉగ్రవాదులు యూరప్ దేశాల్ని ఇంతలా టార్గెట్ చేసుకోవటం వెనుక కారణం...మధ్యప్రాచ్యం దేశాల్లో అమెరికా సాగించిన యుద్ధకాండకు అండగా నిలబడటమేనని 'డాన్ గ్లాజెబ్రూక్' అనే రాజకీయ విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు.

"ఇరాక్‌లో అమెరికా మొదలుపెట్టిన యుద్ధానికి బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్ మద్దతుపలికాయి. అమెరికా బలగాలతో కలిసి యుద్ధంలో పాల్గొన్నాయి. లిబియా, సిరియా, యెమెన్, అఫ్ఘనిస్తాన్ దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాల్లో కూడా అమెరికా-యూరప్ దేశాల సంకీర్ణ బలగాలు పాల్గొన్నాయి. మధ్యప్రాచ్యం దేశాల్లోని అంతర్యుద్ధం ఉగ్రవాదం బలపడటానికి కారణమైంది. ఈ అంతర్యుద్ధంలో నుంచి పుట్టిన ఉగ్రవాదమే యూరప్ దేశాల్ని నేడు వణికిస్తున్నాయి" అని డాన్ గ్లాజెబ్రూక్ విశ్లేషించారు.

పట్టుకోల్పోయామన్న కసితో చేస్తున్నాయి !

సిరియాలో గట్టి పట్టు ఉన్న రక్కా ప్రాంతం నుంచి ఐఎస్‌ను తరిమివేయటంతో అంతా అయిపోయిందనుకున్నారు. కానీ ఐఎస్, అల్‌ఖైదా ప్రతీకారం ఈ విధంగా ఉంటుందని యూరప్ దేశాల నాయకులు అంచనా వేయలేకపోయారనే చెప్పాలి. ఇరాక్, సిరియాల్లో పట్టుకోల్పోవటంతో ఐఎస్ ఉగ్రవాదులు అసహనంతో దాడులకు తెగబడతాయన్న సమాచారం యూరప్ నిఘా వర్గాల నుంచి తరుచూ అందుతూనే ఉంది. దాడుల వ్యూహాన్ని ఉగ్రవాద సంస్థలు మార్చుకున్నాయి. జనంపైకి వాహనాలను నడపడం ద్వారా దాడులకు పాల్పడుతున్నారు. అందుకే పర్యాటకులు లేదా జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. టెర్రరిస్టులు తొలిసారిగా ఈ తరహా దాడిని ఫ్రాన్స్‌లోని నీస్ నగరంపై 2016లో అమలుజేశారు. ఇలాంటిదే అదే ఏడాది బెర్లిన్‌లో జరిగింది. ఈ ఏడాది లండన్‌లో, ఇప్పుడు బార్సిలోనాలో దాడి చేశారు. నీస్, బెర్లిన్ దాడుల అనంతరం, పలు యూరప్ దేశాలు పర్యాటక లేదా ఉత్సవాల సందర్భంగా ప్రజలు ఒకే చోట ఎక్కువగా గుమిగూడకుండా జాగ్రత్తలు తీసుకుంటు న్నాయి. ప్రజలు గుంపులుగా ఉండే ప్రాంతాలకు ఎక్కువ దూరంలోనే వాహనాలు నిలిపివేసి వాటి వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ బార్సిలోనాలో దాడి జరగడం దురదృష్టకరం.

'డీఎన్టీలుగానే గుర్తించండి'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సంచార జాతుల వారిని డీనోటిఫైడ్ ట్రైబల్స్ (డీఎన్టీ)లుగానే గుర్తించాలని, తమను ఎంబీసీ జాబితాలో కలపొద్దని సంచార జాతుల కుల సంఘం నేతలు బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఇన్నాళ్లుగా బీసీ జాబితాలోని 'ఎ' గ్రూపు ద్వారా రిజర్వేషన్ సౌకర్యం ఉన్నప్పటికీ వాటి ఫలాలు అందుకోలేకపోయామన్నారు. ఇప్పటికీ తాము సంచార జాతులుగానే బతుకీడుస్తున్నామని, విద్య, ఉద్యోగ రంగాల్లో ఆశించిన ప్రగతి అందుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సంచారా జాతుల కుల నేతలు కె.రాజేశ్వర్‌రావు, ఫకీర్ జహంగిర్ పాషా, టి శ్రీనివాస్, ఎన్ చెన్నయ్య, బండారి గంగారామ్ తదితర నేతలు బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాములును కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను సంచార కులాల గ్రూపుగా ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. 'ఎ' గ్రూపులో 36 కులాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం కొత్తగా గుర్తించే ఎంబీసీలతో తమను ముడిపెటొద్దని కోరారు. బాలసంతు, బహురూపి, బుడబుక్కల, దాసరి, దొమ్మెర, గంగిరెద్దుల, జంగం, జోగి, కాటిపాపల, మొండిబండ, వంశరాజ్, పాముల, పెద్దమ్మల వాళ్ళు, వీరముష్టి, కూనపులి, జోషినందివాల, రాజన్నల, గోత్రాడ, కాలికపూడి లాంటి కులాల వారిని సంచార కులాల గ్రూపుగా గుర్తించి రిజర్వేషన్లు అమలు చేయాలని తెలిపారు. అనంతరామన్ కమిషన్ రిపోర్ట్‌లో తమ కులస్తులు అధికంగా అనంతపురం జిల్లాల్లో ఉంటారని పేర్కొనడం తప్పని, సంచార జాతుల కులాల గురించి కమిషన్ సమగ్రంగా అధ్యయనం చేయలేదన్నారు.

పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ భారం తగ్గించండి

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

దేశంలో వస్తు, సేవల పన్ను అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వస్తువుల తయారీలో వినియోగించే పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ భారం తగ్గించాలని రాష్ట్ర ముఖ్యమంత్రులకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ కోరారు. జీఎస్టీ హయాంలోనూ పెట్రోలియం ఉత్పత్తుల ఇన్‌పుట్ భారం అధికంగా ఉందని తయారీ రంగం వ్యక్తం చేసిన ఆందోళనలను రాష్ట్రాల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు జైట్లీ లేఖలు రాసినట్టు శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. జీఎస్టీకి ముందు పెట్రోలియం ఉత్పత్తులపై, తయారీ వస్తువులపై రెండింటిపై వ్యాట్ అమలు చేసేవారు. ఈ ఉత్పత్తులపై ఇన్‌పుట్ ట్యాక్స్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధం గా ఉండేది. అయితే జీఎస్టీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తయారీ వస్తువులపై జీఎస్టీతో పాటు పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ విధించడంతో అంతిమంగా వినియోగదారులపై పన్నుల భారం అధికమవుతోంది. ఈ దృష్ట్యా తయారీరం గంలో వినియోగించే సహజ వాయువులపై వ్యాట్‌ను కొన్ని రాష్ట్రాలు, డీజిల్‌పై మరికొన్ని రాష్ట్రాలు వ్యాట్‌ను ఐదు శాతానికి తగ్గించాయి. ప్రస్తుతం జీఎస్టీ అమలవుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించాలని, ఫలితంగా వస్తువులపై భారం తగ్గనుందని అరుణ్‌జైట్లీ కోరారు.

పాత విధానంలోనే ఉత్తమ టీచర్ల ఎంపిక

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఉత్తమ టీచర్ల ఎంపిక ప్రక్రియ ఈ ఏడాది కూడా పాత పద్ధతిలోనే కొనసాగనున్నది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇచ్చారు. ఈ ఏడాది నుంచి ఉత్తమ టీచర్లను తామే ఎంపిక చేస్తామని డిప్యూటీసీఎం కడియం శ్రీహరి గతంలో ప్రకటించిన నేపథ్యంలో దీనిపై విద్యాశాఖ ఓ కమిటీ వేసింది. మండలాల్లో పూర్తిస్థాయిలో ఎంఈఓలు లేరని, దీనికితోడు పూర్తిస్థాయి యంత్రాంగం లేదని కమిటీ నివేదిక ఇచ్చింది. సరైన ఏర్పాట్లు చేయకుండా కొత్త విధానంలో ఎంపిక చేస్తే సమస్యలు తలెత్తే అవకాశముందని, ఈ ఏడాది పాత పద్ధతిలోనే ఉత్తమ టీచర్ల ఎంపిక నిర్వహించాలని కమిటీ సూచించింది. కమిటీ నివేదికతో పాఠశాల విద్యాశాఖ అధికారులు ఏకీభవించారు. ఈ ఏడాది కూడా పాత పద్ధతిలోనే ఎంపిక చేయనున్నారు.

సీపీఎస్ రద్దు ఉద్యమానికి పీఆర్‌టీయూ మద్దతు

సీపీఎస్ రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగులు సెప్టెంబర్ 1న చేపట్టబోయే సామూహిక సెలవు ఉద్యమానికి పీఆర్‌టీయూటీఎస్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం కలిగిస్తాం : మంత్రులు

నవతెలంగాణ - సిద్దిపేట

ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా ఆస్పత్రిలో ఉచిత డయాల సిస్ సెంటర్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో 40 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయబోతు న్నామని చెప్పారు. మొట్టమొదటి సెంటర్ సిద్దిపేట లోనే ప్రారంభించుకున్నామని తెలిపారు. కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి డయాలసి సెంటర్ గొప్ప అవకాశమన్నారు. కార్పొరేట్ స్థాయిలో ఈ డయాలసి స్ సెంటర్‌లో వైద్యమందిస్తామని తెలిపారు.

ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో తుమ్మల సమీక్ష

హైదరాబాద్ : జాతీయ రహదారుల పనులపై శుక్రవారం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఖమ్మం - అశ్వారావుపేట, ఖమ్మం-సూర్యాపేట రోడ్ల ఎలైన్‌మెంట్‌పై చర్చించారు. రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని తుమ్మల సూచించారు. భూసేకరణ, నిర్మాణం వ్యయ పరిమితులకు మించొద్దని ఎన్‌హెచ్‌ఏఐ తెలిపింది. రహదారి వెంట పట్టణాల గుండా బైపాస్ ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ విముఖం వ్యక్తం చేసింది. బైపాస్‌ల ఏర్పాటు అంశంపై త్వరలో కేంద్ర మంత్రి గడ్కరితో మంత్రి తుమ్మల సమావేశం కానున్నారు.

కుంతియా కుంపట్లు!

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో కుంతియా కుంపట్లు రాజేసుకున్నాయి. ఇంతింతై వటుడింతై అన్నట్టు ఆ కుంపటి సెగ అధిష్టానానికి అంటుకుంది. అధిష్టానం పంపించిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రకుంతియా తొలి పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలుపార్టీలో తీవ్రమైన విబేధాలకు దారి తీశాయి. వచ్చే ఎన్నికల దాకా టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్, ఇన్‌చార్జిగా తానే ఉంటానంటూ కుంతియా ఇచ్చిన లీకులే ఆపార్టీ సీనియర్ నేతల ఆగ్రహానికి కారణమయ్యాయి. అసలే అంతంతా మాత్రంగా నడుస్తున్న కాంగ్రెస్ బండి కుంతియా వ్యాఖ్యలతో కూలబడిపోయే ప్రమాదాన్ని తెచ్చిపెట్టిందని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. అక్టోబర్ మాసంలో సంస్థాగత ఎన్నికల్లో మార్పులు, చేర్పులు ఉన్న నేపథ్యంలో కుంతియా ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని పార్టీ సీనియర్ నేతలు అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్టు తెలిసింది. ప్రతిపక్ష నేత కె జానారెడ్డి, మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ్మా, మాజీ మంత్రి పొన్నాలలక్ష్మయ్య, మాజీ మంత్రి దానం నాగేందర్ వంటి నేతలతోపాటు మరికొంత సీనియర్ నేతలు అధిష్టానానికి మౌఖికం గా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. సోనియాగాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్‌పటేల్, దిగ్విజయ్‌సింగ్, ఆజాద్‌కు ఇప్పటికే వారు ఫిర్యాదు చేసినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి బ్రదర్స్ రెండు రోజుల్లో ఢిల్లీ వెళ్లి అధిష్టానం పెద్దలను కలిసి కుంతియాపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై నిర్ణయం తీసుకోవడానికి అధిష్టానమే సుప్రీం అని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి చెప్పారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉద్యోగమేళా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో ఉద్యోగమేళా జరిగింది. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న ఇందిరా ప్రియదర్శిని కాలేజీలో శుక్రవారం యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ), కాయిన్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా జరిగింది. ఎనిమిది కార్పొరేట్ సంస్థలు పాల్గొన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదివిన 500 మంది విద్యార్థులు ఉద్యోగమేళాకు హాజరయ్యారు. వారిలో 150మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా యూఎన్‌డీపీ ప్రతినిధి గురుప్రీత్ భాటియా మాట్లాడుతూ దిశ ప్రాజెక్టు కింద 20 వేల మంది అమ్మాయిలకు కెరీర్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వారికి కంప్యూటర్, ఇంగ్లీష్‌లో నైపుణ్యం పెంపొందించడానికి శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఉద్యోగంలో చేరడానికి కావాల్సిన మెళకువలు నేర్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న అమ్మాయిలకు శిక్షణ ఇచ్చేందుకు కళాశాల విద్యాశాఖతో ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు. కాయిన్ కన్సల్టెంట్ సంస్థ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు.

ఇలాంటి ఉద్యోగమేళాలు జిల్లాల్లోనూ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. విద్యార్థులు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ (సీసీఈ) ఓఎస్డీ శ్రీరాములు, చీఫ్ కోఆర్డినేటర్ నీరజ, 15 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల నుంచి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్థూల ఉత్పత్తి పెరిగితే..

ఈ ఇబ్బందులు ఎందుకు ?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



నిజంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రెట్టింపు అయితే ప్రజలెందుకు ఇబ్బందులు పడుతున్నారో తెలంగాణ ప్రభుత్వం చెప్పాలని తెలుగుదేశం తెలంగాణ శాఖ ప్రశ్నించింది. నిత్యావసర ధరలు చుక్కలనంటడానికి, రైతుల ఆత్మహత్యలు పెరగడానికి కారణాలేమిటని అభిప్రాయపడింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఓవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుంటే, మరో వైపు రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని అన్నారు. నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతా ల్లో పౌష్టికాహారం లేదని, పెరిగిన సంపద సామాన్యు లకు అందడం లేదని ఉపాధి సర్వే చెబుతున్నదని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన మూడేండ్లలో 8వేల పరిశ్రమలు మూతపడ్డా యని, లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలు పెట్టేందుకు వేలాది ఎకరాలు భూమి అం దుబాటులో ఉందని ప్రభుత్వం చెబుతున్నదన్నారు. సంపన్నులకు ఆ భూములను ఇవ్వడం పట్ల అభ్యం తరం చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు సైక్లింగ్ శరణ్యం : డీజీపీ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నా, కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నా ప్రతి ఒక్కరు సైక్లింగ్ చేయడం తప్పనిసరి అని రాష్ట్రడీజీపీ అనురాగ్‌శర్మ అన్నారు. లండన్‌లో 1400 కిలోమీటర్ల ఛాలెంజింగ్ సైక్లింగ్ లో పాల్గొని ఐదు రోజుల్లో విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చిన డీఎస్పీ సదానందరెడ్డిని ఆయన శుక్రవారం డీజీపీ కార్యాలయంలో సత్కరించి అభినందించారు.

వీఆర్వో, వీఆర్‌ఏలను వ్యవసాయశాఖలో విలీనం చేయవద్దు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ స్థాయి నుంచి పాలన సక్రమంగా ఉండాలంటే వీఆర్వో, వీఆర్‌ఏలను వ్యవసాయశాఖలో విలీనం చేయవద్దని, లేదంటే ఆందోళనకు సిద్ధమవుతామని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి హెచ్చరించింది. శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. వీఆర్వో, వీఆర్‌ఏలను వ్యవసాయశాఖలో విలీనం చేస్తారని వార్తలొస్తున్నాయని, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నాని ఇరువురికి వివరించారు. గతంలో రెవెన్యూ వ్యవస్థపై అనేక ప్రయోగాలు చేసి విఫలమయ్యారని గుర్తు చేశారు. రెవెన్యూ వ్యవస్థ గ్రామస్థాయి నుంచి ఉందని, మళ్లీ గతంలో మాదిరిగా పునరుద్ధరించారని గుర్తు చేశారు. రెవెన్యూ రికార్డులను కాపాడంలో కంకణబద్దులమై పనిచేస్తామని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ అసెంబ్లీ సెక్రెటరీ సదారాం పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీ రాజాసదారాం పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఆయన పదవీకాలాన్ని మూడు సార్లు పొడిగించింది. ఆయన రిటైర్ అయి చాలాకాలం అయింది. అసెంబ్లీలో ఉద్యోగుల పదోన్నతులు జరపకపోవడంతో చాలామంది జాయింట్, డిప్యూటీ డైరెక్టర్లుగానే పదవీవిరమణ పొందుతున్నారు. దీనివల్ల కార్యదర్శి పోస్టుపై ఆశపెట్టుకున్నవారు నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం కావాలనే పదోన్నతులు చేయకుండా నిలుపుదల చేసిందన్న విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా రాజాసదారాం పదవీకాలాన్ని పొడిగించడంపైనా ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. మండిపడుతున్నాయి. తన పదవీకాలాన్ని పొడిగించడం పట్ల శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సదారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

నవచిత్రం

హంసలదీవిలో విజయోత్సవం



బోయపాటి శ్రీను, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మండలి బుద్ధప్రసాద్ తదితరులు

'నేను తీసిన ప్రతి సినిమాను ప్రేక్షకులు ఆదరించారు. మున్ముందు అందరి హీరోలతో సినిమాలు చేస్తాను. ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా గుండెల మీద చెయ్యి వేసుకుని నా సినిమాలను చూడొచ్చు' అని అన్నారు బోయపాటి శ్రీను. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ హీరో హీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'జయ జానకి నాయక'. ఈ చిత్రం ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంటున్న నేపథ్యంలో శుక్రవారం హంసలదీవి పుణ్యక్షేత్రంలో విజయోత్సవ వేడుకను నిర్వహించారు.

ఈ వేడుకలో కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ఏ.పి. డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ పాల్గొని చిత్ర బృందాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ, 'అత్యంత పవిత్రమైన ఈ పుణ్యక్షేత్రంలో షూట్ చేయడం కూడా మా సినిమా విజయానికి కారణంగా భావిస్తున్నా. ఈ పరిసర ప్రాంతాల్లో యువత మా సినిమా షూటింగ్ టైమ్‌లో సపోర్ట్ చేసిన తీరును ఎప్పటికీ మర్చిపోలేను. ఈ వేడుకకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని అన్నారు.

'30ఏండ్లుగా నేను ఎలాంటి పాత్ర చేసినా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాను ప్రతి ఒక్క ప్రేక్షకుడు ఓన్ చేసుకున్నారు. రెండోవారంలో థియేటర్లు పెరగడం అంటే చిన్న విషయం కాదు. అది బోయపాటి సత్తా. అన్నీ తానై సినిమాను నడిపించాడు. 'లెజెండ్'కి ముందు నా కెరీర్ అయిపోయిందనుకున్నారు. సెల్‌ఫోన్, ల్యాండ్ ఫోన్ చేతిలో పట్టుకుని ఎవరు ఫోన్ చేసి ఛాన్స్ ఇస్తాడా అని ఎదురుచూస్తున్న సమయంలో బోయపాటి నాకు లైఫ్ ఇచ్చాడు. 'లెజెండ్'లో అద్భుతమైన పాత్ర ఇచ్చి ఆ సినిమాతో నన్ను నిలబెట్టాడు. అది నా ఒరిజినల్ క్యారెక్టర్. నేను మొండోడిని. ఎక్కడికీ వెళ్ళను. ఆ పాత్రను మించిన స్థాయిలో ఈ చిత్రంలో అద్భుతమైన పాత్ర ఇచ్చాడు' అని జగపతిబాబు తెలిపారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులందరికీ నా నమస్సుమాంజలి. ఈ చిత్రానికి శుక్రవారం 120 థియేటర్స్ పెరిగాయంటే కారణం ప్రేక్షకులందరూ కలిసి ఇచ్చిన సపోర్టే. నేను జీవితంలో గర్వంగా చెప్పుకునే సినిమా ఇది. ఇలాంటి గర్వించదగ్గ సినిమా ఇచ్చిన దర్శకుడు బోయపాటికి జీవితాంతం రుణపడి ఉంటా. ఇక నుంచి ఇంతకంటే మంచి సినిమాలతోనే ప్రేక్షకుల ముందుకు వస్తాను' అని చెప్పారు. 'ఇందులో భాగమైనందుకు చాలా ఆనందంగాఉంది. అందుకు బోయపాటికి థ్యాంక్స్. ప్రేక్షకులు సినిమాను మళ్ళీ మళ్ళీ చూసి ఘన విజయాన్ని అందించాలి' అని ప్రగ్యా జైశ్వాల్ తెలిపారు.



నవ్వించే మేడ మీద అబ్బాయి

అల్లరి నరేష్, నిఖిల విమల్ జంటగా జి.ప్రజిత్ దర్శకత్వంలో జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న చిత్రం 'మేడ మీద అబ్బాయి'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'కొత్తదనంతో కూడిన కథతో చేస్తున్న విభిన్న కథా చిత్రమిది. నరేష్ కెరీర్‌లో మరో మైలురాయిలా ఈ చిత్రం నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. 'గమ్యం', 'శంభో శివ శంభో' తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేష్ ఈ చిత్రం చేస్తున్నారు. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. సహజమైన అంశాలతో థ్రిల్లింగ్‌గా ఉంటూనే నరేష్ మార్క్ వినోదం ఉంటుంది. సెన్సార్‌పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెన్సార్ సభ్యుల అభినందనలతో క్లీన్ యు సర్టిఫికెట్‌ను పొందింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. కచ్చితంగా ఈచిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది' అని అన్నారు.


ఇక భయపెడతా..

మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో దక్షిణాది సినీ వర్గాల దృష్టిని ఆకర్షించింది సాయి పల్లవి. ఇటీవల నటించిన 'ఫిదా'తో ప్రేక్షకుల్నే కాదు ఏకంగా తెలుగు చిత్ర సీమనే మెస్మరైజ్ చేసింది. ప్రస్తుతం నాని సరసన 'ఎంసీఏ' చిత్రంలోను, నాగశౌర్యకి జోడీగా 'కరు' చిత్రంలోనూ నటిస్తోంది. ఈ రెండు చిత్రాలతో మరోసారి తెలుగు ఆడియెన్స్‌ను ఫిదా చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్న సాయి పల్లవి తొలిసారి భయపెట్టేందుకు కూడారెడీ అవుతోందట. 'ఎంసీఏ' చిత్రం పూర్తి కాగానే ఈ హర్రర్ చిత్రం ప్రారంభం కానుందని సమాచారం. దీనికి సంబంధించి దర్శకుడు, టెక్నీషియన్స్, ఆర్టిస్టుల వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి. అభినయంతో మంత్రముగ్దుల్ని చేసిన సాయి పల్లవి హర్రర్ సినిమాతో ఎలా భయపెడుతుందో చూడాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.



ఆ ధోరణికి స్వస్తి పలకాల్సిందే..

ప్రత్యేక సందర్భాలు, పండుగల సమయంలో ఒకేసారి రెండు మూడు లేదా అంతకుమించి కూడా సినిమాలు విడుదలవ్వడం ఏ చిత్ర పరిశ్రమలోనైనా సర్వ సాధారణం. ముఖ్యంగా సంక్రాంతి, దసరా, దీపావళి టైమ్‌లో ఇలాంటి పరిస్థితులను మన టాలీవుడ్‌లోనూ చూస్తుంటాం. ఆయా సందర్భాల్లో విడుదలైయ్యే సినిమాలు ఏ రకంగా కలెక్షన్లు రాబట్టుకుంటాయో కూడా మనకు తెలిసిందే. కానీ ఇప్పుడు మామూలు సందర్భాల్లో కూడా మూడుకు పైగా సినిమాలు విడుదలవుతుండటం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది.



అర్జున్‌రెడ్డి

ఏ సందర్భమూ లేకుండా ఒకేసారి మూడు లేదా నాలుగు సినిమాలు రిలీజైతే వచ్చే నష్టం ఏమిటో కూడా పరిశ్రమ వర్గాలకు ముఖ్యంగా దర్శక,నిర్మాతలకు తెలియంది కాదు. అయినప్పటికీ తమ సినిమాలను విడుదల చేసే విషయంలో రాజీపడటం లేదు. ప్రత్యేక సందర్భాలు, పండుగల సమయాలతో పోలిస్తే మామూలు టైమ్‌లో సినిమాను చూసే ఆడియెన్స్ శాతం తక్కువగా ఉంటుంది. దీంతో ఆ ఆడియెన్స్ కలెక్షన్లనే విడుదలైన అన్ని సినిమాలు పంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.



కథలో రాజకుమారి



వివేకం



వీఐపీ 2

మంచి కంటెంట్ ఉన్న సినిమా కూడా ఇలాంటి తరుణంలో విడుదలైతే తొలి రెండు మూడు రోజుల కలెక్షన్ల విషయంలో ఇబ్బంది పడాల్సి వస్తుంది. సరైన కలెక్షన్లను రాబట్టుకోవడంలో వెనుకపడే ఛాన్స్ ఉంటుంది.

తెలుగు చిత్ర పరిశ్రమలో గత వారం ఇలాంటి పరిస్థితే ఎదురైంది. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఏకంగా మూడు పెద్ద సినిమాలు విడుదలయ్యాయి. అందులో 'లై', 'నేనే రాజు నేనే మంత్రి', 'జయ జానకి నాయక' చిత్రాలున్నాయి. యాదృచ్ఛికంగా వచ్చిన ఐదు రోజుల సెలవులను క్యాష్ చేసుకునే ప్రయత్నంలో మూడు సినిమాలను ఒకేసారి విడుదల చేశారు. సెలవులు ఉన్నప్పటికీ ఒకేసారి మూడు సినిమాలు విడుదలవ్వడం మంచిది కాదని పరిశ్రమ పెద్దలు ఈ మూడు చిత్రాల నిర్మాతలకు చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

నితిన్ హీరోగా, హనురాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన 'లై', పొలిటికల్ థ్రిల్లర్‌గా వచ్చిన రానా చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి', బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన 'జయ జానకి నాయక' చిత్రాలు ఈ ఐదు రోజుల కలెక్షన్లను పంచుకోవాల్సి వచ్చింది. దీంతో ఈ మూడు సినిమాల్లో ఏదీ పూర్తి స్థాయిలో కలెక్షన్లను రాబట్టుకోలేకపోయింది. కలెక్షన్ల విషయాన్ని పక్కన పెడితే కంటెంట్ పరంగా ఏ సినిమా కూడా ప్రేక్షకులు ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం. విడుదలైన మూడు సినిమాల్లో ఏది బాగుందనే కంపారిజన్‌లో 'నేనే రాజు నేనే మంత్రి' ఎక్కువ మార్కుల్ని సొంతం చేసుకోగా, 'జయ జానకి నాయక', 'లై' ద్వితీయ, తృతీయ స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గతంలో శతదినోత్సవాలు, అర్థశతదినోత్సవాలుండేవి. ఇప్పుడు ఆ విజయోత్సవాలు మొదటి నాలుగైదు రోజుల కలెక్షన్లకే పరిమితమైపోయాయి. ఇటువంటి తరుణంలో ఆచితూచి అడుగేయాల్సిన అవసరం ప్రతి నిర్మాతకూ ఉంది. పట్టుదలకు పోయి సినిమాలను విడుదల చేస్తే అందుకు తగ్గ ఫలితమే దక్కుతుందని చెప్పడానికి పై మూడు సినిమాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఇకనైనా ఈ ధోరణికి స్వస్తి పలికి ఆరోగ్యకరమైన వాతావరణంలో సయోధ్యతో, సహకారంతో కనీసం వారం రోజుల గ్యాప్‌తో సినిమాలను విడుదల చేయటం అందరికీ మంచిదని విశ్లేషకులు ముక్త కంఠంతో చెబుతున్నారు.

ఈ వారం కూడా నాలుగు సినిమాలు..

గత వారం మూడు సినిమాలు విడుదలవ్వడమే ఇండస్ట్రీకి మంచిది కాదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటే, ఈ వారం ఏకంగా నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఈ నాలుగు సినిమాలు అమీతుమీకి బరిలోకి దిగుతున్నాయి. అందులో 'అర్జున్ రెడ్డి', 'కథలో రాజకుమారి' వంటి రెండు స్ట్రయిట్ సినిమాలుండగా, 'వీఐపీ 2', 'వివేకం' వంటి రెండు తమిళ చిత్రాలున్నాయి. 'పెళ్ళిచూపులు'తో ఆకట్టుకున్న విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతున్న చిత్రం 'అర్జున్ రెడ్డి'. సందీప్ రెడ్డి వంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇక నారా రోహిత్, నాగశౌర్య కాంబినేషన్‌లో మహేష్ సూపరపనేని దర్శకత్వంలో రూపొందిన 'కథలో రాజకుమారి' చిత్రం చాలా రోజుల క్రితమే చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. కొన్ని కారణాలతో ఇన్ని రోజులు ఆగిన చిత్ర యూనిట్ సైతం ఈ నెల 25నే ఈ చిత్రాన్ని విడుదల చేయాలని భావిస్తున్నారు. వీటితోపాటు ధనుష్ నటించిన బైలింగ్వల్ చిత్రం 'వీఐపీ 2' కూడా రిలీజ్ కానుంది. ఈ చిత్రం తమిళ వెర్షన్ ఈ నెల 11న విడుదలైంది. ఈ చిత్రానికి ముందు వచ్చిన 'రఘువరన్ బి.టెక్' తెలుగులో మంచి విజయం సాధించిన నేపథ్యంలో తాజా సినిమా ఎలాంటి ఫలితాన్ని చవిచూస్తుందో చూడాలి.

పైగా ధనుష్ హీరోగా నటించి ఈ చిత్రానికి సౌందర్య రజనీకాంత్ దర్శకత్వం వహించడం ఓ విశేషమైతే, బాలీవుడ్ నటి కాజోల్ కీలక పాత్ర పోషించడం మరో విశేషం. అయితే ఈ మూడు చిత్రాలకు ఒక్క రోజు ముందుగానే అజిత్ హీరోగా రూపొందుతున్న 'వివేకం' చిత్రం రిలీజ్ కానుంది. ఈ నెల 24న తమిళంతోపాటు తెలుగులో కూడా విడుదల చేయబోతున్నారు. 'వీరం' 'వేదాళం' వంటి వరుస బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంతో అజిత్ హ్యాట్రిక్ హిట్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఒకేసారి విడుదలవుతున్న ఈ నాలుగు సినిమాలు కూడా బాక్సాఫీసు వద్ద కలెక్షన్లు షేర్ చేసుకోబోతున్నాయని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

వీరిలో ఎవ్వరూ వాయిదా వేయకపోవడానికి కూడా ఓ స్పష్టమైన కారణం కనిపిస్తోంది. అదేంటంటే, సెప్టెంబర్ 1న బాలకృష్ణ సినిమా 'పైసా వసూల్' విడుదల కానుంది. సెప్టెంబర్ 8న నాగచైతన్య 'యుద్ధం శరణం', 'మేడ మీద అబ్బాయి'తోపాటు ఇతర సినిమాలున్నాయి. సెప్టెంబర్ 21న ఎన్టీఆర్ 'జై లవకుశ' రిలీజ్ కానుంది. సెప్టెంబర్ చివరి వారంలో మహేష్‌బాబు, ఎ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'స్పైడర్' ఉంది. అక్టోబర్‌లో కూడా పెద్ద సినిమాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దాదాపు రెండు నెలలు వరకు వేచి చూడాల్సి వస్తుంది. ఈ రకమైన ధోరణి కనిపించడానికి కారణం ప్లానింగ్ లేకపోవడమే అని కూడా బలంగా వినిపిస్తోంది.

గ్యాప్ ఉండాల్సిందే..

సాధారణంగా ఓ పెద్ద సినిమా విడుదలవుతుందంటే ఆ సినిమా తర్వాత రెండు వారాల గ్యాప్‌తో మరో సినిమా వస్తే అది ఇండస్ట్రీకి, నిర్మాతలకు లాభాదాయకంగా ఉంటుందనేది సినీ విశ్లేషకుల వాదన. గతంలోనూ ఇలాంటి పద్ధతినే పాటించేవారు. అలా గ్యాప్‌తో విడుదలైతే ఏ సినిమా చూడాలన్న కన్‌ఫ్యూజన్ ప్రేక్షకుల్లో ఉండదు, రెండు వారాలు పెద్ద సినిమా లేకపోవడంతో రన్నింగ్‌లో ఉన్న సినిమాకు మంచి కలెక్షన్లు వస్తాయి. నిర్మాత సేఫ్ జోన్‌లో ఉండే అవకాశం ఉంటుంది కూడా. కానీ ఇటీవల నిర్మాతలు ఆ ట్రెండ్‌ను ఫాలో అవడం లేదు. పోటీపడి తమ సినిమాలను విడుదల చేస్తున్నారు. హీరో ఇమేజ్ దృష్ట్యా విడుదల చేసుకోవాలనుకుంటున్న వారు కొందరైతే, ముందే డేట్‌ను ప్రకటించడంతో తప్పని పరిస్థితుల్లో రిలీజ్ చేస్తున్న వారు మరికొందరు. ఏది ఏమైనప్పటికీ ఈ విధానం మంచిది కాదని అందరూ ఘంటాపదంగా చెబుతున్నారు. ముందు చూపుతో సరైన ప్లానింగ్‌తో సినిమాలను విడుదల చేయకపోతే దాని తాలూకా ప్రభావం కేవలం ఆ దర్శక, నిర్మాతలపైనే కాదు సినీ పరిశ్రమని నమ్ముకున్న అందరిపైనా పడటం ఖాయం.

ఇక్కడ సినిమాలకే ప్రయారిటీ..

'హాలీవుడ్ చిత్రాల కోసం భారతీయ చిత్ర పరిశ్రమను వదులుకోను. ఈ విషయంలో నేను చాలా స్పష్టతతో ఉన్నాను' అని అంటోంది ఐశ్వర్యరాయ్. మాజీ విశ్వసుందరి ఐశ్వర్య హాలీవుడ్‌లో 'బ్రైడ్ అండ్ ప్రిజుడైస్', 'ప్రొవోక్డ్', 'ది లాస్ట్ లీజియన్' వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇటీవల కాలంలో ఎక్కువగా బాలీవుడ్‌పైనే దృష్టిపెట్టింది. గతంలో మాదిరిగా మళ్ళీ హాలీవుడ్ చిత్రాలు చేస్తారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఐష్ స్పందిస్తూ, 'భారతీయ సినిమాల్లో నటిస్తూ చాలా ఎంజాయ్ చేశాను. మంచి దర్శకులతో కలిసి పనిచేశాను. మన భారతీయ నటుల్లో ప్రియాంక చోప్రా, దీపికా పదుకొనె, ఇర్ఫాన్ ఖాన్ బాలీవుడ్‌తోపాటు హాలీవుడ్‌లోనూ తమ సత్తా నిరూపించుకుంటున్నారు. భాషతో పనిలేకుండా అన్ని సినిమా రంగాల్లో రాణించడం నిజంగా అభినందించాల్సిన విషయం. నేను హాలీవుడ్‌లో నటిస్తున్నప్పుడు సోషల్ మీడియా ప్రభావం చాలా తక్కువగా ఉంది. ఇప్పుడంతా సోషల్ మీడియా ప్రపంచంలా మారిపోయింది. దీంతో భారతీయ నటుల గురించి ఇతర దేశాల వారికీ అవగాహన పెరిగింది. 2015లో 'జజ్బా' చిత్రంతో నా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించా. 'సరబ్‌జిత్', 'యే దిల్ హై ముష్కిల్' చిత్రాల్లో నటించాను. అయినప్పటికీ చాలా మంది ఐశ్వర్య నటించగలదా? లేదా అని చర్చించుకుంటున్నారు. ఐశ్వర్య అంటే కేవలం అందమే కాదు, నటించగలదు కూడా అని నిరూపించుకోవడానికి చాలా కష్టపడ్డాను' అని తెలిపింది.



ఐశ్వర్యరాయ్



మాధురీ దీక్షిత్

స్నేహితుల ప్రేమకథ..



'2 ఫ్రెండ్స్' చిత్రంలో సానియా, సూరజ్

సూరజ్, సానియా జంటగా రవీంద్రతేజ, స్నిగ్ధ, కార్తీక్, సారా, ధన్‌రాజ్ ఇతర ప్రధాన పాత్రధారులుగా జి.ఎల్.బి.శ్రీనివాస్ దర్శకత్వంలో ముళ్ళగూరు లక్ష్మీదేవి సమర్పణలో అనంతలక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై ముళ్ళగూరు అనంతరాముడు, ముళ్ళగూరు రమేష్‌నాయుడు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం '2 ఫ్రెండ్స్' (ట్రూ లవ్). ఈ చిత్రం గురించి దర్శకుడు జి.ఎల్.బి.శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ప్రేమ, స్నేహం నేపథ్యంలో తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇప్పటికే వరంగల్, బెంగుళూరు, అనంతపురంలో మేజర్ షూటింగ్ చేశాం. కర్నాటకలోని మడకశిర లొకేషన్‌లో కీలక సన్నివేశాలను, రెండు పాటలను చిత్రీకరించాం. ఇప్పటికే మూడు షెడ్యూల్స్ చిత్రీకరణ పూర్తయ్యింది. ఈ నెలాఖరు నుంచి జరిగే తదుపరి షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. నిర్మాత మంచి సహకారాన్ని అందిస్తున్నారు. సినిమా చాలా బాగా వస్తుంది' అని అన్నారు. 'మా సంస్థలో ఇది తొలి చిత్రం. యువత నేడు ఎన్నో అద్భుతాలు సృష్టిస్తోంది. కాలేజ్ రోజుల్లోనే యువతకు భవిష్యత్ నిర్దేశకత్వం అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రేమ కంటే స్నేహం గొప్పదనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. కేవలం వినోదమే కాకుండా అంతర్లీనంగా యువతకు సందేశం ఇచ్చే విధంగా సినిమా ఉంటుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: టి.సురేందర్‌రెడ్డి, కథ, మాటలు, సంగీతం: పోలూర్ ఘటికాచలం.

మాఫియా నేపథ్యంలో హైటెక్ కిల్లర్



బల్వాన్, మౌనిక

మాజీ 'మిస్టర్ ఆంధ్ర' బల్వాన్ హీరోగా, మౌనిక హీరోయిన్‌గా వి.వి.వి దర్శకత్వంలో సోహ్రాబ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మజ్ను సోహ్రాబ్ నిర్మిస్తున్న చిత్రం 'హైటెక్ కిల్లర్'. ఈ చిత్రం గురించి నిర్మాత మజ్ను మాట్లాడుతూ, 'మాఫియా గ్యాంగ్ ఏ దేశంలో ఉన్నా దానికి హైదరాబాద్ అడ్డాగా మారింది. దీన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్యాచ్ వర్క్ మినహా టాకీ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మూడు ఫైట్లు, ఆరు పాటలున్నాయి. సంగీత దర్శకుడు ఎస్.కె.మజ్ను స్వరపరిచిన పాటల బాణీలు శ్రోతలను అలరిస్తాయి. డాన్స్ మాస్టర్ బ్రదర్ ఆనంద్ నేతృత్వంలో ఐదు రాత్రుళ్లు తీసిన రెయిన్ సాంగ్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుంది. దసరాకు ఆడియోను, డిసెంబర్‌లో సినిమాను విడుదల చేస్తాం' అని అన్నారు. 'ఇటీవల కాలంలో జరిగిన ఓ యదార్థ సంఘటనలకు కొన్ని కల్పిత పాత్రలను మేళవించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఆబాలగోపాలాన్ని అలరించేలా ఈ చిత్రం ఉంటుంది' అని సహ నిర్మాత ఎం.భాగ్యలక్ష్మి తెలిపారు. సత్యప్రకాష్, చందు, అన్నపూర్ణమ్మ, గౌతమ్‌రాజు, ప్రసన్న కుమార్, పావలా శ్యామల, దిల్ రమేష్, మిమిక్రీ మూర్తి, సంపత్‌రాజ్, శివ సత్యనారాయణ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: యాదగిరి, ఎడిటింగ్, సంగీతం, ఆర్ట్: ఎస్.కె.మజ్ను.

మాధురీ జీవితంపై టెలివిజన్ సిరీస్

'నా జీవితం ఆధారంగా రూపొందించే టెలివిజన్ సిరీస్‌ను ప్రియాంక చోప్రా నిర్మించడం సరైనదే' అని అంటోంది మాధురీ దీక్షిత్. బాలీవుడ్‌లో ఛార్మింగ్, బ్యూటిఫుల్ హీరోయిన్‌గా మాధురీ దీక్షిత్ ఎన్నో విజయవంతమైన కళాఖండాల్లాంటి చిత్రాల్లో నటించి మెప్పించారు. ఆమె సినీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని అమెరికాలో ఓ టెలివిజన్ సిరీస్‌ను రూపొందించేందుకు మాధురీ భర్త శ్రీరామ్ ప్లాన్ చేస్తున్నారు. ఆయన ప్రముఖ రచయిత అనే విషయం అందరికీ విదితమే. ప్రస్తుతం మాధురీపై తెరకెక్కించే సిరీస్ కోసం ఆయన స్క్రిప్ట్ రెడీ చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా మాధురీ దీక్షిత్ మాట్లాడుతూ, 'నాపై అమెరికాలో టెలివిజన్ సిరీస్ తీస్తానని గతేడాది శ్రీరామ్ చెప్పడం నాకు సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. ఇందులో నా సినీ జీవితంతోపాటు ఫ్యామిలీ లైఫ్‌ని కూడా ఆయన చూపించబోతున్నారు. అయితే ఈ సిరీస్‌ను సహనిర్మాతగా ప్రియాంక చోప్రా నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. నాకు తెలిసి దీనికి ప్రియాంక పర్‌ఫెక్ట్ అని భావిస్తున్నా. ఓ నటి జీవిత విశేషాలను తెలియజేసేందుకు మరో నటి తపన పడటం బాలీవుడ్ చరిత్రలో ఇదే ప్రథమం అని అనుకుంటున్నాను' అని తెలిపింది. ప్రియాంక ప్రస్తుతం హాలీవుడ్‌లో 'ఏ కిడ్ లైక్ జేక్', 'ఈజ్‌నాట్ ఇట్ రొమాంటిక్?' చిత్రాల్లో నటిస్తోంది. బాలీవుడ్‌లో సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందనున్న 'గుస్తాకియాన్' చిత్రంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పాటు నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా ప్రియాంక సత్తా చాటే ప్రయత్నం చేస్తోంది.

గు'లాబీ' సేద్యం

- కొండూరి రమేశ్‌బాబు

దేశంలోనే మిర్చి పంటకు అనుకూలమైన గోదావరి లోయపై కన్నేసిన కొందరు గులాబీ నేతలు కార్పొరేట్ సేద్యం ప్రారంభించారు. ఒక ప్రముఖ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని ఏజెంట్ల అవతారం ఎత్తారు. కొందరు పెద్ద రైతులతో అనధికారికి ఒప్పందాలు చేసుకుని వారు పండించే మిర్చిని కొనుగోలు చేసే విధంగా కాంట్రాక్టు వ్యవసాయం చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, పరకాల ప్రాంతాల్లోనూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలంలోనూ పోలవరం ముంపు ప్రాంతంలో ఉన్న కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో దాదాపు ఏడు వేల ఎకరాల్లో కాంట్రాక్టు వ్యవసాయం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఖమ్మం జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్, అదే జిల్లాకు చెందిన ఒక మార్కెట్ కమిటీ చైర్మన్, వాజేడు మండలానికి చెందిన ఒక అధికార పార్టీ నేత, చర్ల మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతతో కలిసి ఈ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. భూమి బదలాయింపు నిషేధిత చట్టం 1/70, షెడ్యూలు ప్రాంతాలకు పంచాయితీ రాజ్ విస్తరణ (పీసా) చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో కాంట్రాక్టు వ్యవసాయం చట్ట విరుద్ధమైనప్పటికీ ఈ చట్టాలను బేఖాతర్ చేస్తూ వారు తమ అక్రమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారు. టీఆర్ఎస్ నేతలు గత సంవత్స రం చేసిన కాంట్రాక్టు సేద్యంలో ఎన్నో అక్రమాలు జరిగినా అధికారులు పట్టించు కోక పోవడంతో ఈ సంవత్సరం కూడా భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారు. కిలో మిర్చి విత్తనాల ధర రూ. 42,000 కాగా రూ. 45,000 నుంచి రూ. 60,000 వరకూ వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ వ్యవసాయం ద్వారా పండించిన పంటకు కంపెనీ గిట్టుబాటు ధర చెల్లించడంతో తాము కూడా వ్యవసాయం చేస్తామని రెండు మండలాలకు చెందిన గిరిజన రైతులు కోరినా వారితో ఒప్పందం చేసుకోవడానికి దళారులు అంగీకిరంచక పోవడంతో వారు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్ళారు.



భారీగా అనధికారిక వసూళ్ళు..

రైతులు పండించే మిర్చిని అధిక ధరలకు కొనడానికి ప్రముఖ కంపెనీ ముందుకు రావడంతో దీనిని ఆసరాగా చేసుకున్న టీఆర్ఎస్ నేతలు కంపెనీ ఏజెంట్లుగా మారారు. కంపెనీ చెల్లించే కమీషన్‌తో పాటూ అనధికారికి వసూళ్ళకు పాల్పడుతున్నారు. ఎకరానికి క్వింటాకు వంద రూపాయల చొప్పున ఎకరానికి మూడు నుంచి నాలుగు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. గత సంవత్సరం పంట అమ్మే సమయంలో అనధికారికి కమీషన్ వసూలు చేసిన దళారులు ఈ సంవత్సరం పంట వేసే ముందే ఇటువంటి వసూళ్ళు ప్రారంభించారు. విత్తనాలు, క్రిమిసంహారక మందులు తాము చెప్పిన వ్యాపారస్తుల వద్దే కొనుగోలు చేయాలని దళారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ఏజెంట్లు, వ్యాపారస్తులు చేతులు కలిపి క్రిమి సంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మిర్చి పంట వేసిన మూడు నెలల తర్వాత లింగాకర్షక బుట్టలు ఇస్తామంటూ ప్రతి ఎకరానికి రూ. 950 వసూలు చేయడం పట్ల కూడా రైతులు అభ్యంతరం చెప్తున్నారు.

గిరిజనుల ఆందోళన...

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో కాకుండా గిరిజనేతరులైన పెద్ద రైతులతో కాంట్రాక్టు వ్యవసాయం చేయించడం చట్ట విరుద్ధమని గిరిజనులు



GOVERNMENT OF TELANGANA
JAYASHANKAR DISTRICT

Rc. No. A/227/2017 Dated 05.08.2017

NOTICE

A Complaint has been received from "Aadhi Vaasi Hakkula Porata Samithi (Thudum Debba)", Jayashankar District, stating that some of the Tribal Farmers having agriculture lands of their own in Wazeed Mandal are being deprived in supply of AVT Brand Chilli Seeds and also as the said farmers are from Scheduled Tribes, all the lands held by them attracts Act 1 of 1970. But some of the settlers who have come from open area are cultivating Chilli in the tribal area and they are azmoishing by depriving the tribal farmers.

It was also represented that they are purchasing AVT Brand Chilli Seed and cultivating in their lands, but as per the AVT Brand company by laws they are supposed to take the Chilli Product after its cultivation, but due to intervention by some of the settled farmers in tribal area, they are given with the facilitative of Bond due to the said they are being inconveninced in sale of the Chilli Product after its cultivation by the tribal farmers in open market.

In this regard in Wazeed Mandal, there are maximum Tribal farmers who are cultivating Chili by sowing AVT Brand Chilli Seed purchased. To safe guard the interest of these Tribal Farmers they may be considered and see that they get all the benefits entitled as per the company norms in execution of bond.

Further it is directed to send your company representative before the undersigned within (7) Days, so as to sort out the grievance represented by the poor tribal farmers of Wazeed Mandal, Jayashankar District, Telangana State.

Sd/-
Joint Collector,
Jayashankar District

//Attested//

District Civil Supply Officer,
Jayashankar District

To
The Managing Director,
AVT Natural Products,
Panampilly Nagar,
Kochi, Kerala 682036.

Copy to "Aadhi Vaasi Hakkula Porata Samithi (Thudum Debba)", Jayashankar District

ఆరోపిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, ములుగు సబ్ కలెక్టర్‌కు, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఏజెంట్లపై ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కాంట్రాక్టు వ్యవసాయంపై జిల్లా జాయింట్ కలెక్టర్ సేద్యం చేయిస్తున్న కంపెనీకి నోటీసు జారీ చేశారు. తమ పార్టీకి చెందిన ఏజెంట్లపై ఎటువంటి చర్యలూ తీసుకోవద్దంటూ అధికార పార్టీకి చెందిన మంత్రి, ఎమ్మెల్సీ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. అధికార పార్టీ ఏజెంట్ల ఆగడాలపై ఆగ్రహించిన గిరిజన రైతులు ఇప్పటికే పలుమార్లు రాస్తారోకో నిర్వహించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వెంకటాపురం మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు.

కరెంట్ కట్... మధ్యాహ్న భోజనం బంద్

- పెద్దపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల పస్తులు
- కలెక్టరేట్ ఎదుట అంటలతో నిరసన

నవతెలంగాణ-పెద్దపల్లి

బకాయిలు చెల్లించలేదని పాఠశాల కనెక్షన్‌ను విద్యుత్ అధికారులు కట్ చేశారు. నీళ్లు లేనిది వంట చేయలేమని నిర్వాహకులు చేతులెత్తేశారు. దీంతో విద్యార్థులు పస్తులున్నారు. ఆకలి మంట తాళలేక విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ఖాళీ అంటలతో నిరసన తెలిపారు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాపురించింది. నిరసన సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ... పట్టణ నడిబొడ్డున ఉన్న పాఠశాలలో ఈ పరిస్థితి ఏర్పడటం శోచనీయమన్నారు. ఘటనకు పూర్తి బాధ్యత వహించి ఎంఈవో, హెచ్‌లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో రూ.2 లక్షల పైచిలుకు విద్యుత్ బకాయిలు ఉన్నాయని, 20 రోజులుగా సమస్య తలెత్తినా అధికారులు స్పందించలేదని తెలిపారు.

ఇరవై రోజులుగా నీటి సరఫరా లేక బయట నుండి తీసుకురాలేక మధ్యాహ్న భోజన కార్మికులు చేతులెత్తేశారని చెప్పారు. స్థానిక ఎంఈవో పర్యవేక్షణా లోపం, ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యం వల్లే సమస్య ఎదురైందని ఆరోపించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్ ప్రభాకర్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన ఆయన విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించడానికి రూ. లక్ష మంజూరు చేసినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సీపెల్లి రవీందర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు బాలసాని లెనిన్ హర్షం వ్యక్తం చేశారు.

పనికి ఒప్పుకోలేదని ముక్కు కోశారు

(మొదటిపేజీ తరువాయి)

అతని కొడుకు నరేంద్రసింగ్‌లు తమ చేనులో పని చేయాలని ఓ దళిత మహిళను ఇటీవల సంప్రదించారు. దీనికి ఆమె ఒప్పుకోలేదు. కాగా.. మంగళవారం తండ్రీకొడుకులిద్దరూ గొడ్డలి తీసుకొని మహిళ ఇంటికి వెళ్లారు. ఆమెను, తన భర్తను కర్రలతో తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా గొడ్డలితో దళితురాలి ముక్కు కోశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న మహిళా కమిషన్ సభ్యులు... జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పాఠశాల విద్యార్థులపై తేనెటీగల దాడి

(మొదటిపేజీ తరువాయి)

తరగతి గదిలోనే ఉంచి కిటికీలు, తలుపులు మూసేశారు. దీంతో దాడి నుంచి మిగతా విద్యార్థులు బయటపడ్డారు. అప్పటికే తేనెటీగలు 17 మంది విద్యార్థులను గాయపరిచాయి. అందులో భూక్యర్ వెంకటసాయి, కొలకాని అక్షితలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వాంతులు చేసుకోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు కిషన్‌రెడ్డి, అశోక్‌లు పిల్లలిద్దరినీ హుటాహుటిన కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

వృద్ధిరేటు ఘనం.. ఉద్యోగాలు శూన్యం?

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక సర్వే తేల్చేసింది. అది మోడీ ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ నేతృత్వంలో నిర్వహించిన సర్వే కావడంతో పాలకపక్షం కూడా ఆ నివేదికను కాదనలేని పరిస్థితి. పెద్దనోట్ల రద్దు తర్వాత, హడావుడిగా తీసుకొచ్చిన జీఎస్టీ వల్లే వృద్ధి రేట్ మందగించేందుకు కారణమవుతోందని ఆర్థికవేత్తలు విశ్లేషించారు. ఇండియా టుడే జాతీయ సర్వేలో ప్రజలు నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలు చెప్పారు. నిత్యావసరాల ధరలు పెరగడంపై 62 శాతంమంది, ఉద్యోగాల కల్పనలో విఫలమైందంటూ 53 శాతంమంది మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సర్వేలో నిరుద్యోగ సమస్యపై 36 శాతంమంది మాత్రమే ప్రభుత్వాన్ని తప్పు పట్టగా, ఇప్పుడది అనూహ్యస్థాయిలో పెరగడం గమనార్హం. ఉద్యోగాల సృష్టి ఏకపక్షంగా జరిగేది కాదని కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ చైర్మెన్ ఆర్‌సి భార్గవ అన్నారు. ఎక్కువ ఉద్యోగాలు వ్యవసాయ రంగంలో సాధ్యం కాదు. సేవలు, పరిశ్రమలు, మైనింగ్‌లో అందుకు అవకాశమున్నదని ఆయన చెప్పారు. ఆశించినంతగా ఈ రంగాల్లో పెరుగుదల లేకపోవడానికి ఇటీవలి కొన్ని పరిణామాలే కారణమని ఆయన అన్నారు. తయారీ రంగం కుంటుపడటాన్ని ఆయన గుర్తు చేశారు. తయారీ రంగం, సేవల రంగం పరస్పర ఆధారితాలని భార్గవ అన్నారు. దానికితోడు అవినీతి, కొత్తగా ప్రవేశపెట్టిన పన్నుల విధానం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన గుర్తు చేశారు. పెద్ద నోట్ల రద్దు అనంతరం మొదటి త్రైమాసికం 2017 జనవరి-ఏప్రిల్‌లో 15 లక్షలమంది ఉద్యోగాలు కోల్పోయారని భారత ఆర్థిక పర్యవేక్షణా కేంద్రం (సీఎంఐఈ) తాజా నివేదిక వెల్లడించింది. ఉద్యోగాల కల్పనలో ముందుండే నిర్మాణ రంగంపై నోట్ల రద్దు ప్రభావం తీవ్రంగా ఉన్నదని, డిమాండ్ బాగా పడిపోయిందని క్రిసిల్ ముఖ్య ఆర్థికవేత్త డికె జోషి అన్నారు. ఆర్‌బీఐ ద్రవ్య విధాన సమీక్షలోనూ తయారీ రంగం మందగించిందనీ, ప్రయివేట్ పెట్టుబడులు తగ్గిపోయాయని..దాంతో,నూతన ఉద్యోగాల కల్పన కుంటుపడిందని విశ్లేషించారు. 2017-18లో ఆశించిన వృద్ధిరేట్(6.75-7.5) అందుకోవడం సాధ్యం కాదని ఆగస్టు 12న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర ఆర్థిక సర్వే కుండబద్దలు కొట్టింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో పారిశ్రామిక రంగం 0.1 శాతంమేర పడిపోయిందని సర్వే నివేదిక తెలిపింది. జులై నెలలో అమలులోకి తెచ్చిన జీఎస్టీ వల్ల తయారీ రంగం 0.4 శాతంమేర క్షీణించినట్టు నివేదిక తెలిపింది. ఈ ఏడాది జులై నెలకు సంబంధించి నిక్కీ ఇండియా ఇటీవల విడుదల చేసిన కొనుగోలుదారు మేనేజర్ల సూచీ 47.9 శాతానికి పడిపోయింది. ఈ సూచీలో 50 శాతంకన్నా తక్కువ నమోదైతే అది క్షీణ దశగా చెబుతారు. 2009 ఫిబ్రవరి నుంచి ఇది రికార్డుస్థాయిలో అతి తక్కువ. జీ-20 దేశాల్లో ఇదే అత్యల్పం. సేవల రంగంలోనూ ఈ ఏడాది జులైలో నాలుగేండ్ల కనిష్టం నమోదైంది. పరపతి వృద్ధి(బ్యాంకుల్లో అప్పులు పుట్టడం) 4-5 శాతానికి పడిపోయింది. గతేడాది ఇది 7-9 శాతంగా ఉన్నది. భారత్‌లో అత్యధిక వృద్ధి రేట్ నమోదైన సంవత్సరాల్లో పరపతి వృద్ధి 15 శాతంగా ఉండేది. పెద్దనోట్ల రద్దుతోపాటు జీఎస్టీని భారత ఆర్థిక వృద్ధిని అనూహ్యంగా దెబ్బతీసిన సంఘటనలుగా ప్రముఖ ఆర్థికవేత్తలంతా ముక్తకంఠంతో విశ్లేషించి చెప్పారు. రక్షణాత్మక ఆర్థిక వ్యవస్థను మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు ప్రమాదంలో పడేశాయని వారు స్పష్టం చేశారు. గత మూడేండ్లలో జీడీపీపరంగా చూస్తే ఒక్క శాతంమేర వృద్ధిరేట్ నష్టపోయి ఉంటామని ఆదిత్యాబిర్లా గ్రూప్ ముఖ్య ఆర్థికవేత్త అజిత్ రనాడే అన్నారు. అయితే, దాదాపు రూ. 150 లక్షల కోట్లమేర ఉండే భారత జీడీపీలో ఒక్క శాతమైనా లక్షా 50 వేల కోట్లు అన్నది మరువరాదు.

ఇటీవలి ప్రపంచ పరిణామాల్లో భాగంగా ఐటీ రంగంలోనూ వేలాదిమంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది. ఎక్కువ వేతనాలతోనైనా స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలంటూ అమెరికా, ఆస్ట్రేలియాలాంటి దేశాల్లో ప్రభుత్వాల నుంచి ఒత్తిడి పెరగడంతో ఐటీ సంస్థల వైఖరిలో మార్పు రావడమే అందుకు కారణం. ఐటీ రంగంలో ప్రస్తుతానికి నిరాశ పరిస్థితే కొనసాగుతోంది.

ప్రపంచ ఆర్థిక వృద్ధి రేట్ మందగమనం పట్టిన సమయంలో 2016-17లో భారత్ 7.1 శాతం వృద్ధి నమోదు చేయడం పట్ల ప్రముఖ సంస్థల నివేదికలు మాత్రం ఆశావాద దృక్పథాన్ని కనపరిచాయి. 2017-18లో భారత్ 7.2 శాతం వృద్ధి రేట్ సాధించనున్నట్టు ఐఎంఎఫ్ అంచనా వేసింది. ద్రవ్యలోటు(ప్రభుత్వ రెవెన్యూ, ఖర్చుల మధ్య వ్యత్యాసం) 2013-14లో 4.5 శాతం కాగా, 2016-17లో 3.5 శాతంగా నమోదైంది. టార్గెట్‌గా నిర్ణయించిన 3.2 శాతానికి ఇది సమీపంలోనే ఉన్నది. వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ) ద్రవ్యోల్బణం కూడా అదుపులోనే ఉన్నది. 4 శాతానికన్నా తక్కువగా ఉండాలన్న ప్రభుత్వ టార్గెట్‌కు దగ్గరగానే ఉన్నది. టోకు ధరల సూచీ మాత్రం ఈ ఏడాది జులైలో 1.88శాతంమేర పెరిగింది. వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) 2012-13లో 190.3 వందల కోట్ల డాలర్లు కాగా, 2015-16లో 118.7 వందల కోట్ల డాలర్లు. 2016-17 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 31.2 వందల కోట్లు కాగా, గతేడాది ఇదే కాలానికి 29.4 వందల కోట్ల డాలర్లు. ఈ విధమైన పాజిటివ్ ట్రెండ్ సహజంగానే స్టాక్ ఎక్ఛేంజ్ సూచీల్లోనూ ఆల్‌టైం రికార్డులకు కారణమైంది. దేశ ఆర్థిక పరిస్థితి విషయంలో ఇన్ని అనుకూలాంశాలు రికార్డుల్లో చూపిస్తున్నా..నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయన్నదే సగటు పౌరుడు అడుగుతున్న ప్రశ్న,,

ప్రభుత్వరంగ నిర్వీర్యం-శ్రామికశక్తి విచ్ఛిన్నం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పాలకవర్గ విధానాలతో ప్రభుత్వరంగం నిర్వీర్యం కావడంతోపాటు శ్రామికశక్తి సైతం విచ్ఛిన్నమయ్యేలా ఉంటున్నాయని సీఐటీయు జాతీయ అధ్యక్షురాలు కె హేమలత అన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, కార్మికుల విభజనను సైతం విభిన్న రూపాల్లో చేపట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విభజన కులం, మతం పేరుతో సైతం చేపట్టేందుకు పాలకవర్గాలు వెనుకడుగు వేయట్లేదని, ఈ పరిణామాలు కార్మిక వర్గానికి అత్యంత ప్రమాదకరమైనవని హెచ్చరించారు. వీటిని శ్రామికవర్గానికి అర్థమయ్యే రీతిలో విశదీకరించి చెప్పాల్సిన బాధ్యత కార్మిక సంఘాలపైనే ఉన్నదని స్పష్టం చేశారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఫీ) 8వ జాతీయ మహాసభలు గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈఫీ జాతీయ అధ్యక్షులు కెఓ హబీబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత అరుణపతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులు అర్పించారు. మహాసభల ప్రారంభకార్యక్రమంలో హేమలత ప్రారంభోపన్యాసం చేశారు. వ్యవసాయానికి, విద్యుత్‌కు అవినాభావ సంబంధం ఉందని, దేశంలో వ్యవసాయ ఉత్పత్తి పెరిగినా, రైతాంగానికి గిట్టుబాటు ధరలు రావట్లేదని చెప్పారు. విద్యుత్‌రంగ కార్మిక, ఉద్యోగ సంఘాలు ప్రజలతో మమేకమై ప్రభుత్వ విధానాల దుష్పరిణామాల్ని వారికి వివరించాల్సిన బాధ్యత ఉన్నదని అన్నారు. ఇటీవలి కాలంలో దేశంలో 17 అఖిల భారత స్థాయి సమ్మెలు జరిగాయని, 'మహాపడావ్' పేరుతో అన్నిరంగాల కార్మికులు లక్షలాదిగా ఢిల్లీకి తరలివచ్చి కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గళమెత్తారని గుర్తుచేశారు. అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనాలు, హక్కులు అనేవి అమల్లో లేవని, ఫలితంగా వారిపై తీవ్రమైన జీవనోపాధి ఆర్థికభారాలు మోపబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో కార్మికోద్యమాలు బలోపేతం కావాలని, ప్రస్తుత మహాసభల్లో ఆ దిశగా భవిష్యత్ కార్యాచరణ ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలోనే వారు కార్మిక హక్కుల హననాన్ని కోరుతున్నారని, దీన్ని సంఘటిత శక్తితో ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

ఏపీఈఎఫ్ చైర్మెన్ శైలేంద్రదూబే మాట్లాడుతూ గడచిన 25 ఏండ్లలో విద్యుత్‌సంస్కరణల పేరుతో అనేక ప్రయోగాలు జరిగాయని, అయితే అవెక్కడా విజయాన్ని సాధించలేదని చెప్పారు. బీహెచ్‌ఈఎల్ వంటి ప్రభుత్వరంగ నవరత్న కంపెనీకి ఆర్డర్లు లేక నిరర్థక ఆస్తుల జాబితా (ఎన్‌పీఏ)లోకి చేరే దుస్థితిని ఈ సంస్కరణలు కల్పించాయని ఉదహరించారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం బీహెచ్‌ఈఎల్‌కు ఆర్డర్లు ఇచ్చి మంచి పనిచేసిందని ప్రశంసించారు. మిగులు విద్యుత్‌ఉందని చెప్తున్న దేశంలో ఇప్పటికీ 30 కోట్ల కుటుంబాలు అంధకారంలోనే ఉండటం విడ్డూరమని అన్నారు. సంస్కరణల ఫలితాలు వారి వరకు ఎందుకు చేరలేకపోయాయని ప్రశ్నించారు. అడ్డగోలుగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ప్రియమిత్రుడైన గౌతమ్ అదాని వంటి పారిశ్రామిక వేత్త ఎదిగింది విద్యుత్‌రంగంలో మనీలాండరింగ్ చేసేనని ఇటీవలి ప్రభుత్వ సంస్థల నివేదికల్లో వెల్లడైన విషయాన్ని ప్రస్తావించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), ఆర్‌ఈసీల ద్వారా ప్రయివేటు వ్యక్తులు, సంస్థలకు పెద్దఎత్తున రుణాలను మంజూరు చేస్తున్నారని, చివరకు ఇవన్నీ ఎన్‌పీఏ (నిరర్థక ఆస్తులు) జాబితాలో చేరి, ప్రజాధనం లూటీ అవుతున్నదని వివరించారు. 2003 సంవత్సరానికి ముందు రాష్ట్రాల్లోని విద్యుత్‌బోర్డులు రూ.25వేల కోట్ల నష్టాల్లో ఉంటే, సంస్కరణలు అమలైన 2003 తర్వాత ఆ నష్టాలు రూ.9 లక్షల కోట్లకు చేరాయని చెప్పారు. పాతపథకాలకు కొత్తపేర్లు పెట్టి ప్రభుత్వాలు ప్రచారం చేసుకుంటున్నాయని తెలిపారు.

మహాసభల ఆహ్వానసంఘం చైర్మెన్ చుక్కా రామయ్య మాట్లాడుతూ విద్యుత్‌తో ప్రజల అనుబంధం విడదీయలేనిదిగా మారిందని, దీన్ని ఆసరా చేసుకొని సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విధానాల రూపకల్పన చేస్తున్నాయని చెప్పారు. ఈ విధానాలు ప్రజలకు మేలు చేసేవిగా ఉండాలే తప్ప, పెట్టుబడిదారులు, ప్రయివేటువ్యక్తులు, సంస్థలకు లబ్ది చేకూర్చేవిగా ఉండరాదని స్పష్టంచేశారు. మహాసభల్లో ఈ తరహా విధానాలపై స్పష్టమైన చర్చ జరగాలని, ప్రజాభాగస్వామ్యంతో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన జరగాలని ఆకాంక్షించారు. విద్యుత్ సంస్కరణల్ని వ్యతిరేకిస్తూ 2వేల సంవత్సరంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఉద్యమం చెలరేగిన అంశాల్ని ఆయన ప్రస్తావించారు. ఆ ఉద్యమ ఫలితమే దాదాపు పదేండ్లు ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణల జోలికి వెళ్లలేదని తెలిపారు.

ఆలిండియా పవర్‌మెన్స్ ఫెడరేషన్ (ఏఐపీఎఫ్) కార్యదర్శి కె సోమశేఖరన్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని, సమాన పనికి సమాన వేతనం వంటి హక్కులు కలగానే మిగిలిపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని విద్యుత్ సంస్థలు, వ్యవస్థలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని, పాలకవర్గాలు గతం నుంచి గుణపాఠాలు నేర్వట్లేదని అన్నారు.

ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ (ఏఐపీఈఎఫ్) ప్రధాన కార్యదర్శి పి రత్నాకరరావు మాట్లాడుతూ విద్యుత్‌రంగంలో ఉత్పత్తి-పంపిణీ వ్యవస్థలు ప్రైవేటురంగంలో పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. ఫ్రాంఛైజ్‌ల విధానం ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో ఫెయిల్ అయ్యిందని, అయినా ప్రభుత్వాలు వీటిని పున్ణస్సమీక్షించే సాహసాన్ని చేయలేకపోతున్నాయన్నారు.

లేబర్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ (ఎల్పీఎఫ్) నాయకులు ఎస్ఆర్ సభాపతి మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న లైన్, వైర్, ఫోర్‌మెన్లుకు ఎలాంటి భద్రతా లేదని, ఏటా వందల సంఖ్యలో అకాల మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణా చర్యల్ని పట్టించుకోని ప్రభుత్వాలు, పరిహారాలు ఇచ్చేసి బాధ్యతల నుంచి తప్పుకోజూస్తున్నాయని విమర్శించారు.

ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఈఈఎఫ్) ప్రధాన కార్యదర్శి మోహన్‌శర్మ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో శ్రమదోపిడీకి గురౌతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని క్రమబద్ధీకరించాలని, ఆ మేరకు ప్రభుత్వాలపై వత్తిడి పెంచేలా ఉద్యమ కార్యాచరణ ఉండాలని అభిలషించారు.

సమావేశంలో సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఎస్ దేవ్‌రాయ్, ఈఫీ ప్రధాన కార్యదర్శి పిఎన్ చౌదరి, సీఐటీయూ కర్ణాటక శాఖ అధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సాయిబాబు, మహాసభల ఆహ్వాన సంఘం సమన్వయకర్త ఆర్ సుధాభాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు (కిరణ్), కోశాధికారి కె ఈశ్వరరావు, మీడియా కన్వీనర్ ఎస్ రమ తదితరులు పాల్గొన్నారు.

మరో 'గో' దాడి

(మొదటిపేజీ తరువాయి)

చుట్టుముట్టిన వారిలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు కూడా ఉండటం గమనార్హం. అనంతరం వారు ఇంట్లోని వారిని కర్రలతో తీవ్రంగా కొట్టారు. షాబుద్దీన్ బుధవారం రాత్రి గోవును చంపాడనీ, మరుసటి రోజు గురువారం ఆ మాంసాన్ని తను, ఇరుగుపొరుగువారు తిన్నారని గోరక్షకులు ఆరోపించారు. చుట్టుపక్కల ఇండ్లలోని వారిని కూడా షాహబుద్దీన్ ఇంట్లోకి ఈడ్చుకొచ్చారు. అందరినీ కలిసి గదిలో బంధించి మరీ కొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా... అల్లరిమూకలు వారిపై రాళ్లు విసిరినట్టు సమాచారం. కాగా, బీఫ్ పుకార్లతో జరుగుతున్న అన్ని దాడి కేసుల్లోలాగే... ఈ కేసులోనూ బాధితులపైనే పోలీసులు కేసు పెట్టడం గమనార్హం. దాడికి పాల్పడిన అల్లరిమూకలపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. దాడిని ఆపేందుకు అక్కడకు చేరుకున్న స్థానిక గ్రామ పెద్ద కుదుష్ కురేషీ, నస్రుద్దీన్ మైన్, ముస్తాఫా మైన్, జహంగీర్ మైన్, అస్లాం అన్సారీ, బాబుల్ మైన్, రిజ్వాన్ మైన్‌లను అరెస్టు చేశారు. వీరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. అల్లరిమూకల దాడిలో గాయపడిన వారు కూడా అరెస్టయిన వారిలో ఉండటం కొసమెరుపు. వీరికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. 'స్థానిక మెజార్టీ కమ్యూనిటీ మతపరమైన మనోభావాలను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీశారన్న అభియోగాలతో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నాం. ఈ విషయంలో దర్యాప్తు నిర్వహిస్తున్నాం' అని చాన్పాటియా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి రాజేష్ ఝూ చెప్పారు. ముస్లింలపై దాడి చేసిన వారి గురించి తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు. బీహార్‌లో నితీశ్ కుమార్ బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత రాష్ట్రంలో జరిగిన రెండో 'బీఫ్' దాడి ఇది. ఈ నెల 3న మాంసం తీసుకెళుతున్న ట్రక్కుపై 'గో రక్షకులు' దాడి చేసి ఆ వాహనంలో ఉన్న ముగ్గురు ముస్లింలను తీవ్రంగా కొట్టిన విషయం తెలిసిందే.

అణచివేతపై బరిసెనెక్కుపెట్టిన ధీశాలి..

సబ్బండ వర్ణాలకు స్ఫూర్తిప్రదాత

- సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సభలో వక్తలు
- రాజ్యాధికారం దిశగా బడుగులు అడుగులేయాలని పిలుపు



మాట్లాడుతున్న ప్రొ. తిరుమలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యాపారానికి, రాజకీయానికి ఉన్న సంబంధాలను నిశితంగా గమనించి.. బడుగుల్లో రాజ్యాధికార కాంక్షను రగిలించిన గొప్ప స్ఫూర్తి ప్రదాత సర్దార్ సర్వాయి పాపన్న అని పలువురు వక్తలు చెప్పారు. నాలుగొందల ఏండ్ల క్రితమే ఆయన ప్రభువులు, సామంతరాజుల దాష్టీకం, అణచివేతపై తన బరిసెనెక్కుపెట్టారని అని తెలిపారు. అణచివేతకు గురవుతున్న బడుగులందర్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి.. అణచివేతకు గురి చేస్తున్న వారిపై తిరగుబాటు బావుటా నెగురవేశారని వివరించారు. ఈ నేపథ్యంలో పాపన్న జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని.. రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల వారందరూ రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి సభను శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. టీ మాస్ ఫోరం రాష్ట్ర నాయకులు ఎమ్‌వీ రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం చైర్మెన్ ప్రొఫెసర్ తిరుమలి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. పాపన్న జీవిత విశేషాలను, ఆయన ధీరోదాత్త చరిత్రను సోదాహరణంగా వివరించారు. నాటి గోల్కొండ రాజ్యంలో అత్యంత ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న వరంగల్ నగరాన్ని హస్తగతం చేసుకోవటం ద్వారా మొత్తం గోల్కొండనే స్వాధీనం చేసుకోవచ్చంటూ పాపన్న భావించారని తెలిపారు. ఈ క్రమంలో వివిధ సందర్భాల్లో యుద్ధ తంత్రాలను, రాజనీతిజ్ఞతను, పరిపాలన దక్షతను ఆయన ఆకళింపు చేసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రజలకు ఏం కావాలి? వారి అవసరాలేంటి? అనే విషయాలపై స్పష్టమైన అవగాహన పెంపొందిం చుకున్నారని వివరించారు. డాక్టర్ కట్టగాని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. మరాఠా సమాజం లో శివాజీకి ఎంతటి ఘన చరిత్ర ఉందో.. తెలం గాణ ప్రాంతంలో పాపన్నకు కూడా అంతటి చరిత్రే ఉందని చెప్పారు. సకల ఉత్పత్తి కులాలు, సబ్బండ వర్ణాలను కలిపి ఆయన తన సైన్యాన్ని రూపొం దించుకున్నాడని తెలిపారు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన పాపన్న.. నేడు మనం చెబుతున్న సామాజిక న్యాయం గురించి ఆనాడే చర్చ లేవదీశారని వివరించారు. సెన్సార్‌బోర్డు సభ్యురాలు రేవతిగౌడ్ మాట్లాడుతూ.. పాపన్న స్ఫూర్తితో బడుగులు ఐక్యం కావాలని కోరారు. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం, అక్షరాస్యత లేని ఆ రోజుల్లోనే అణగారిన వర్గాల వారందరూ ఐక్యమయ్యారని చెప్పారు. ఆనాటి స్ఫూర్తి ఇప్పుడేమ యిందని ప్రశ్నించారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర నాయకులు ఎస్.విన యకుమార్ మాట్లాడుతూ... ఏదైనా ఒక ఉద్యమం జయ ప్రదం కావాలంటే దానికి సైద్ధాం తికతను జోడిం చాల్సిందేనని చెప్పారు. చరిత్రను తిరగేస్తే ఇదే విష యం రూఢీ అవుతున్నదని అన్నా రు. ఈ నేపథ్యం లో సామాజిక తెలంగాణ ఉద్యమా నికి కూడా ఒక ప్రతీక, ఒక చరిత్ర కావాల్సి ఉంద న్నారు. ఈ అంశాలన్నింటినీ కలిపి గ్రంథస్తం చేయా లని మేధావులను కోరారు. అయిలి వెంకన్న, అంబాల నారాయణ, ఎలికట్టె విజయ కుమార్, గుండ్రాతి శారదాగౌడ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, గణేశ్‌నాయక్, టీ మాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ, పైళ్ల ఆశయ్య, రాష్ట్ర నాయకులు ఆర్.శ్రీరాం నాయక్, కిల్లె గోపాల్ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాది జనవరి 19న ప్రకటించిన కనీస వేతనాల్ని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చేం దుకు యాజమాన్యం అంగీకరిస్తూ శుక్రవారంనాడు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు అమలు చేసింది. పెరిగిన వేతనాల్ని జనవరి 19 నుంచే అమల్లోకి తెస్తున్నట్టు కూడా యాజమాన్యం ప్రకటించింది. సింగరేణిలో రాష్ట్రప్రభుత్వ వాటా 51 శాతం, కేంద్రప్రభుత్వ వాటా 49 శాతం ఉన్నం దున...లీగల్ ఒపీనియన్ పేరుతో తాము రాష్ట్ర కార్మిక శాఖ ఆదేశాల్నే అమలు చేస్తామంటూ ఇప్పటి వరకు సింగరేణి యాజమాన్యం మొండికేసింది. దీంతో ఈనెల 14వ తేదీ సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శ్యాంసుందర్ అధ్య క్షతన హైదరాబాద్ శివం రోడ్‌లోని కేంద్ర అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టి ట్యూట్ (ఏటీఐ)లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి అన్ని కార్మిక సంఘాలు హాజరయ్యాయి. అదే సమయంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్మికులు ఆ సమావేశాన్ని ముట్టడించారు. దాదాపు ఏడు గంటల పాటు కార్మికశాఖ, సింగరేణి అధికారుల్ని గదిలో పెట్టి నిర్భంధించారు. పెరిగిన



(ఫైల్)

వేతనాలు చెల్లించేందుకు వారికి ఉన్న అడ్డంకులు ఏంటో స్పష్టం చేయాలని, సింగరేణి యాజమా న్యంపై కార్మిక శాఖ ఎందుకు లీగల్ యాక్షన్ తీసుకోవట్లేదంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. పెరిగిన వేతనాలు తక్షణం అమలు చేస్తున్నట్టు తమకు రాతపూర్వక హామీ ఇస్తే తప్ప అక్కడినుంచి అధికారుల్ని వెళ్లనిచ్చేది లేదని భీష్మించారు. దాదాపు ఏడు గంటల ఉత్కంఠ అనంతరం కేంద్ర కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ శ్యాంసుందర్, కేంద్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్ ఆవుల గోవర్ధన్ ఈనెల 31లోపు కనీస వేతనాలు అమలు చేయిస్తామని, లేకుంటే సింగరేణి యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేస్తామని రాతపూ ర్వకంగా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు సింగరేణి యాజమాన్యం దిగివచ్చి కేంద్ర కార్మిక శాఖ ఆదేశాల్ని అమలు చేస్తామని, పెరిగిన వేతనాల్ని ఇస్తామని, పాతబకాయిలు కూడా చెల్లిస్తామని పేర్కొంటూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఐటీయూ హర్షం

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వేత నాలు చెల్లించేందుకు అంగీకరిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు ఇవ్వడంపై సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) హర్షం వ్యక్తం చేసింది. యాజమాన్య ఉత్తర్వుల ప్రకారం అన్‌స్కిల్డ్ కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు రూ.359, సెమిస్కిల్డ్ కార్మి కులకు రూ.420, స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ. 506, హైలీస్కిల్డ్ కార్మికులకు రూ.593 చొప్పున వేతనాలు చెల్లిస్తారని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బి మధు తెలిపారు. దీని అమలుకు కృషి చేసిన అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణిలో సర్కారు మాట తప్పింది: ఉత్తమ్

సాధారణ ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికుల ఓట్ల కోసం టీఆర్ ఎస్ అనేక హామీలు ఇచ్చిందని వారి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని టీపీసీసీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. సింగరేణి కార్మికులను టీఆర్ఎస్ మోసం చేసిందని రాబోయే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలలో టీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

సెన్సెక్స్ ▼ 271
31,525

నిఫ్టీ ▼ 67
9,837

డాలరుకు రూపాయి విలువ
64.14



బంగారం(10.గ్రా)
రూ. 29,689



వెండి (కేజీ)
రూ. 42,200



కోడిగుడ్లు

హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



ఇన్ఫీలో తారాస్థాయికి ఇంటిపోరు!

- సీఈవో, ఎండీ పదవికి సిక్కా రాజీనామా
- 'పనికిరాడు' అనడంపై విశాల్ సీరియస్
- నిరాధార ఆరోపణలు నొప్పించాయని వివరణ
- వ్యవస్థాపకుడిపై వెల్లువెత్తిన బోర్డు తీవ్ర విమర్శలు
- అంతే ఘాటుగా స్పందించిన నారాయణ మూర్తి

బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌లో ఇంటిపోరు శుక్రవారం తారా స్థాయికి చేరింది. సంస్థకు సీఈవో, ఎండీగా సేవలందిస్తున్న విశాల్ సిక్కా హఠాత్తుగా తన పదవులకు రాజీనామా చేస్తున్నట్టుగా శుక్రవారం ప్రకటించారు. సంస్థలో తనపై నిరాధార ఆరోపణలు అంతకంతకు పెరిగిపోతున్నాయని దీనికి తోడు సంస్థలో పని చేయలేని పరిస్థితులు ఉన్నాయంటూ ఆయన తన పదవికి గుడ్‌బై చెప్పేశారు. సిక్కా ప్రకటన ఒక్కసారిగా దేశీయ కార్పొరేట్ రంగంలో ప్రకంపనలు సృష్టించింది. సిక్కా ప్రకటనలతో అటు స్టాక్ మార్కెట్లు ఒక్క సారిగా నష్టాల్లోకి జారుకున్నాయి. అప్రమత్తమైన యాజమాన్యం సిక్కా స్థానంలో తాత్కాలిక సీఈవో, ఎండీ యు.బి.ప్రవీణ్ రావుకు బాధ్యతలు అప్పగించింది. శనివారం ఇన్ఫోసిస్ బోర్డు సమావేశం జరగడానికి ముందే సిక్కా రాజీనామా చేయడం కార్పొరేట్ రంగంలో పెద్ద చర్చకు దారి తీసింది. త్వరలోనే కొత్త సీఈవోను బోర్డు ఎంపిక చేస్తుందని కంపెనీ పేర్కొంది. సిక్కాను ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించినట్టు అధికారిక ప్రకటనలో పేర్కొంది.


పనికిరాడనే ఆరోపణలపై సీరియస్..

గత కొంతకాలంగా కంపెనీ మేనేజ్‌మెంట్‌పై, సిక్కాపై వ్యవస్థాపకులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే వస్తున్న సంగతి తెలిసిందే. కంపెనీలో కార్పొరేట్ ప్రమాణాలు దెబ్బతింటున్నాయంటూ పలు మార్లు వ్యవస్థాపకులు, బోర్డుకి చురకలు పెట్టారు. అయితే ఇటీవల ఒక ఈ-మెయిల్‌లో మూర్తి సిక్కాను దారుణంగా అనుమానించినట్టుగా తెలుస్తోంది. సిక్కా సీఈవోగా పనికిరారని తనతో కొందరుబోర్డు సభ్యులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. సిక్కా సీఈవో కంటే సీటీవో పదవేకే సరిపోతారని బోర్డులోని పలువురు స్వతంత్ర డైరెక్టర్లు తనతో అన్నట్లు మూర్తి ఆగస్టు 9న ఓ ఈమెయిల్‌లో పేర్కొన్నట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ వార్తలు సిక్కాను తీవ్రంగా కలవర పరిచినట్టుగా తెలుస్తోంది. ఆయన హఠాత్తుగా రాజీనామా చేయడానికి ఇదే కారణం కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే అది తన అభిప్రాయం కాదని స్వతంత్ర డైరెక్టర్ల మాటలనే తాను వెల్లడించినట్టుగా మూర్తి పేర్కొన్నప్పటికీ సిక్కా ఆ మెయిల్‌ను సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. సిక్కా వైదొలగడానికి మూర్తినే కారణమని అటు బోర్డు వర్గాలు, ఇటు కార్పొరేట్ విశ్లేషకులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. సిక్కాతో మూర్తి బ్లూవేల్ గేమ్ ఆడించారని, ఆయన పదవి నుంచి బలవంతంగా తప్పుకునేలా చేశారని, అయితే ఇది తమ సొంత అభిప్రాయం మాత్రమేనని విశ్లేషకులు చెబుతున్నారు. గత అయిదు నెలలో సిక్కా, మూర్తి కలవడం గానీ, చర్చలు జరపడం గానీ జరగలేదు. దీంతో సిక్కాపై మూర్తి వ్యతిరేకత చూపిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

ఆగని రాజీనామాలు..

ఇటీవల కాలంలో ఇన్ఫోసిస్ అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. ముఖ్యంగా సీనియర్ స్థాయిలో ఉన్న ఎగ్జిక్యూటివ్‌లు చాలా మంది కంపెనీ నుంచి వైదొలిగారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ర్యాంక్ ఉన్న 10 మందికి పైగా కీలక ఉద్యోగులు కంపెనీకి రాజీనామా చేశారు. తాజాగా కంపెనీ సీఈవో సిక్కానే వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. గత కొంతకాలంగా అంతర్గత, బాహ్య సవాళ్లతో ఇన్ఫోసిస్ సతమతమవుతోంది. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అనిశ్చితికి తోడు మరోవైపు కంపెనీ కార్పొరేట్ పాలనలో లోపాలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతోంది. గత కొన్ని మాసాలుగా కంపెనీలో పైస్థాయిలో ఉన్న ఉద్యోగులు సంస్థకు రాజీనామా చేస్తూ వస్తున్నారు. ఎడ్జ్ ప్రొడక్ట్స్ గ్లోబల్ హెడ్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అనిర్బన్ దే, ఇన్నోవేషన్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ యూసఫ్ బషీర్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ రితికాసూరి తదితరులు కంపెనీ నుంచి వైదొలిగారు.





పని చేయలేని పరిస్థితులు: సిక్కా

ఈ మధ్య కాలంలో తనపై వ్యక్తిగతంగా నిరాధారమైన ఆరోపణలు, విమర్శలు ఎక్కువ అయ్యాయని, ఇవి తన మనస్సును నొప్పించాయని సిక్కా తన బ్లాగ్‌లో తెలిపారు. ఈ నేపథ్యంలోనే తాను ఇన్ఫోసిస్ బాధ్యతల నుంచి వైదొలిగానని సిక్కా తన బ్లాగులో 'మూవింగ్ ఆన్' పేరుతో స్పష్టం చేశారు. ఈ బ్లాగ్‌లో ఎవరి పేరును ఆయన పేర్కొనలేదు. కానీ నారాయణమూర్తి లాంటి హై ప్రొఫైల్ వ్యవస్థాపకులకు మధ్య తాను నలిగిన తీరును వివరించారు. నిరాధారమైన విషపూరిత వ్యక్తిగత దాడులను నిలువరిస్తూ పనిచేయలేనని పేర్కొన్నారు. గత మూడేండ్లుగా కంపెనీ సాధించిన విజయాల్లో ఉద్యోగులందరి భాగస్వామ్యం ఉందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకూ ఇన్ఫోసిస్ బోర్డు, యాజమాన్యంతో కలిసి పనిచేస్తానని చెప్పారు. నాయకత్వ మార్పిడి జరిగే వరకూ బోర్డులో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ వ్యవహరించేందుకు అంగీకరించినట్టు సిక్కా తెలిపారు. అదే విధంగా భవిష్యత్తులో ముందుకెళ్లేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఎంతో ఆలోచించిన తర్వాత తాను ఈ రాజీనామా చేశానని తెలిపారు. ఎక్కడైతే మర్యాదపూర్వకమైన, నమ్మకమైన వాతావరణం ఉంటుందో అక్కడికి తిరిగి వెళ్తున్నానన్నారు. అక్కడ కొత్త సవాళ్లను స్వీకరిస్తానని కుటుంబంతో సంతోషంగా గడపాలనుకుంటున్నాని తెలిపారు

తగు సమయంలో సమాధానమిస్తాం : మూర్తి



విశాల్ సిక్కా రాజీనామా విషయమై డైరెక్టర్ల బోర్డు వెలువరించిన ప్రకటనపై నారాయణ మూర్తి మండిపడ్డారు. వారు చేసిన నిరాధారణమైన ఆరోపణలపై స్పందిస్తే తన గౌరవానికే తక్కువ చేసుకోవడమేనంటూ ఘాటుగా స్పందించారు. సిక్కా ఆరోపణలు చాలా బాధాకరమన్నారు. తాను డబ్బుల కోసమో.. తన పిల్లలకు హోదా కోసమో తాపత్రయ పడడం లేదని తెలిపారు. ఇలాంటి ఆరోపణలు తనను వేదనకు గురిచేస్తున్నాయని మూర్తి అన్నారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. సరియైన సమయంలో తగిన సమాధానమిస్తానంటూ పేర్కొన్నారు. 2014లో తానే స్వయంగా బోర్డు నుంచి తప్పుకున్నానని, కనీసం నగదు కూడా కోరలేదని గుర్తు చేశారు. తన పిల్లల కోసం ఇన్ఫోసిస్‌లో కనీసం ఎలాంటి అధికారాలను, స్థానాలను అడుగలేదని పేర్కొన్నారు. తన వాదనంతా ఒక్కటే.. కంపెనీ కార్పొరేట్ పాలనలో లోపాలున్నాయి. దాని గురించే నేను తరచూ ప్రస్తావిస్తున్నానని లేఖలో పేర్కొన్నారు.

మంత్రి భార్యతోనే కుంపటి మొదలైందా!




ఇన్ఫోసిస్‌లో ఇంటి పోరు గత కొన్ని నెలలుగా అంతర్గతంగా కొనసాగుతున్నప్పటికీ.. గత ఏడాది కేంద్ర మంత్రి జయంత్ సిన్హా సతీమణి పునితా సిన్హాను బోర్డులోకి తీసుకున్నప్పటి నుంచి తారాస్థాయికి చేరినట్టుగా తెలుస్తోంది. పునితాను బోర్డులోకి తీసుకోవడం నారాయణమూర్తికి నచ్చలేదు. రాజకీయ నాయకుడి భార్యను బోర్డులోకి ఆహ్వానించడం కంపెనీ చరిత్రలో లేదనేది మూర్తి వాదన. దీంతో ఆమె నియామక ఓటింగ్‌కు కూడా ఆయన దూరంగా ఉన్నారు. ఫలితంగా మేనేజ్ మెంట్, వ్యవస్థాపకులకు మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఇక్కడి నుంచే సిక్కాకు ఉద్వాసన పలకాలన్న ఆలోచనా కుంపటి మొదలైనట్లుగా విశ్లేషకులు చెబుతున్నారు.

దాదాపు రూ.30,000 కోట్ల నష్టం!



ఇన్ఫీ చైర్మెన్‌గా వైదొలగాలని విశాల్ సిక్కా తీసుకున్న అనూహ్య నిర్ణయంతో శుక్రవారం ఆ సంస్థ షేర్లు భారీగా కుదేలయ్యాయి. ఉదయం రూ.1021.50 వద్ద ప్రారంభమైన ఈ స్టాక్ సిక్కా నిర్ణయంతో తొలి గడియల్లోనే నష్టాలోకి జారుకోవడం మొదలు పెట్టింది. ఒక దశలో దాదాపు 13 శాతం మేర ఈ స్టాక్ కుంగి రూ.884.40ల కనిష్టాన్ని తాకింది. ఆ తరువాత నెలకొన్న కొన్ని అనుకూల పవనాల నేపథ్యంలో క్రమంగా కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి స్టాక్ 9.60 శాతం నష్టంతో సరిపెట్టుకొని రూ.923.10 వద్ద ముగిసింది. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఇన్ఫీ కౌంటర్లో శుక్రవారం ఒక్కరోజే దాదాపు రూ.30,000 కోట్ల మదుపరుల సంపద తుడిచిపెట్టుకుపోయింది. గురువారం మార్కెట్ ముగింపు నాటికి రూ.2,34,554 కోట్లుగా ఉన్న కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి రూ.2,12,030 కోట్లకు పడిపోయింది. దీనికి తోడు తీవ్ర ఊగిసలాట నేపథ్యంలో ఈ కౌంటర్లో చేతులు కాల్చుకున్న మదుపరుల మొత్తం సంపద విలువ రూ.30,000 కోట్లకు పైమాటేనని మార్కెట్ విశ్లేషకులు గణాంకాలతో సహా వివరిస్తున్నారు.

సిక్కా పనితీరులో మాత్రం పక్కా!



చక్కని పని తీరుతో సిక్కా కంపెనీలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. ఇన్ఫీ పనితీరును మార్చేశారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ లాంటి సాంకేతికను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కంపెనీని 10 బిలియన్ డాలర్ల ఆదాయం స్థాయి నుంచి 2020 నాటికి 20 బిలియన్ డాలర్ల ఆదాయం స్థాయికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 2016-17 వార్షిక నివేదికలో ఈ లక్ష్యాలను చేర్చకపోవడం గమనార్హం. అయితే సిక్కా నేతృత్వంలో సంస్థకు విదేశాల నుంచి వచ్చే డాలర్ రెవెన్యూ పెరిగిందనే చెప్పాలి. టీసీఎస్, విప్రోలతో పోలిస్తే వేగంగా ఇన్ఫీ ఈ విషయంలో వేగంగా పుంజుకుంది. జీతాలతో పాటు కార్పొరేట్ పాలనపైనా మూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదారు నెలల నుంచి బోర్డు పాలనపై మూర్తి విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మూర్తి ఆ మధ్య ఓ లేఖ రాశారు. 'విశాల్ సిక్కాపై నాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. ఆయన పనితీరుపై నేను ఎప్పుడూ వ్యాఖ్యానించలేదు. సంస్థలో పాలనపైనే నా బాధంతా. ప్రస్తుత బోర్డులో లోపాలున్నాయని నేను నమ్ముతున్నాను' మూర్తి లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గత ఐదు నెలలో సిక్కా, మూర్తి కలవడం గానీ.. చర్చలు జరపడం గానీ జరగలేదు. దీంతో సిక్కాపై మూర్తి వ్యతిరేకత చూపిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

బైబ్యాక్ విషయంలో ముందుకే: చైర్మెన్ శేషశాయి




ఇన్ఫోసిస్‌లో శుక్రవారం ఇంటిపోరు ఒక్కసారిగా కీలక మలుపులు తిరిగింది. దీంతో ఆ సంస్థ ప్రతిపాదించిన బైబ్యాక్ ఆఫర్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. దాదాపు రూ.13,000 కోట్ల భారీ బైబ్యాక్ ఆఫర్‌కు సంబంధించిన అంశాన్ని ఇన్ఫీ సంస్థ బోర్డు శనివారం (19న) పరిశీలించి ఒక నిర్ణయం వెలువరించాల్సి ఉంది. అయితే ఇంతలోనే హఠాత్తుగా చోటుచేసుకున్న పరిణామాలతో ఈ ఆఫర్‌పై మార్కెట్ వర్గాల్లో అనుమానాలు నెలకొన్నాయి. దీనిపై సంస్థ బోర్డు చైర్మెన్ రామస్వామి శేషశాయి వివరణనిచ్చారు. సిక్కా రాజీనామాతో సంస్థ ప్రతిపాదించిన బైబ్యాక్ ప్రణాళికలో ఎలాంటి మార్పు ఉండబోదని తేల్చి చెప్పారు. సంస్థలోని విభేదాలకు బైబ్యాక్ సంబంధం లేదని ఆయన అన్నారు. నియంత్రణ సంస్థల నుంచి కూడా తమకు ఎలాంటి సమాచారం అందనందున శనివారం నిర్వహించే బోర్డు సమావేశంలో తాము బైబ్యాక్ విషయమై ముందుకు వెళ్లి నిర్ణయాలు తీసుకోనే వీలుందని తెలిపారు. మరోవైపు సంస్థ సహ చైర్మెన్ రవి వెంకటేషన్ కూడా సిక్కా రాజీనామా విషయమై స్పందించారు. సిక్కా టెక్నాలజీపై అద్భుతమైన పట్టున్న వ్యక్తి అని అన్నారు. సీఈవో పదవికి ఆయన ఎనలేని వన్నె తెచ్చారని కొనియాడారు. అయితే తాను సీఈవో పదవి రేసులో మాత్రం లేనని అన్నారు.

తిరిగి నీలేకని చేతుల్లోకే ఇన్ఫోసిస్!



ఇన్ఫోసిస్‌లో తలెత్తిన అంతర్గత పోరుతో సంస్థ భవిష్యత్తుపై నీలిమేఘాలు కమ్ముకుంటున్నాయి. విభేదాలతో రగిలిపోతున్న బోర్డును, మూర్తి వంటి సీనియర్ వ్యవస్థాపకులను ఒక్క తాటిపైకి తెచ్చి సంస్థను సమర్థవంతంగా తిరిగి పట్టాలెక్కించే వ్యక్తి దిశగా అప్పుడే అన్వేషణలు మొదలయ్యాయి. ఇందుకు సరైన సమర్థుడిగా ఇన్ఫీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరు, మాజీ చైర్మెన్ నందన్ నీలేకని పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సంస్థపై ఆయనకు మంచి పట్టు ఉండడంతో పాటు.. అటు బోర్డు ఆలోచనా తీరు.. ఇటు వ్యవస్థాపకుల ఆకాంక్షలకు తగ్గట్టుగా ఆయన పని చేస్తూ మదుపరుల ప్రయోజనాలనూ ఆయన కాపాడగలరని విశ్లేషకులు చెబుతున్నారు. అటు ఇన్ఫీ డిస్కషన్ బోర్డులోనూ.. సోషల్ మీడియాలోనూ.. దీనికి సంబంధించిన పోస్టులు, విశ్లేషణలు వెలువడుతున్నాయి. మేటి హైప్రొఫైల్‌తో పాటు అత్యాధునిక టెక్నాలజీపై గొప్ప పట్టున్న నీలేకనిని తిరిగి సంస్థ బోర్డులోకి నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా తీసుకు వస్తే సంస్థకు, మదుపరులకు మేలు జరుగుతుందని 'ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ అడ్వైజరీ సర్వీసెస్' (ఐఐఏఎస్) విశ్లేషించింది. ఇప్పుడున్న బోర్డు సంస్థ సీఈవోగా సిక్కాను కాపాడుకోలేకపోయిందని వివరించింది.

స్టాక్ మార్కెట్లకు 'సిక్కా' దెబ్బ



ముంబయి: ఇన్ఫోసిస్‌కు సీఈవోగా విశాల్ సిక్కా రాజీనామా చేయడంతో వారాంతంలో భారత మార్కెట్లు తీవ్ర పతనాన్ని చవి చూశాయి. ఈ కంపెనీ భవిష్యత్తుపై మదుపర్లలో ఆందోళన వ్యక్తం కావడంతో ఆ సూచీ అమ్మకాల ఒత్తిడితో ఏకంగా 10 శాతం మేర క్షీణించింది. ఇది సెన్సెక్స్ 270 పాయింట్లు పడిపోవడానికి కారణమయ్యింది. సిక్కా నిర్ణయంలో ఇన్ఫోసిస్ షేర్ 9.6 శాతం పతనమై రూ.884కు పడిపోయి 52 వారాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. దీంతో ఆ కంపెనీ షేర్లు కొనుగోలు చేసిన మదుపరులు ఇంట్రాడేలో రూ.8,414 కోట్ల మదుపు విలువ కోల్పోయి విలవిలమన్నారు. ఈ పరిణామం మధ్య బీఎస్ఇ సెన్సెక్స్ 270.78 పాయింట్లు లేదా 0.85 శాతం తగ్గి 31,524కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 66.75 పాయింట్లు నష్టపోయి 9,837 వద్ద ముగిసింది. ఇంట్రా ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఏకంగా 446.33 పాయింట్ల మేర కోల్పోవడం విశేషం.

విమానాల రద్దు అవాస్తవం: ఇండిగో



ముంబయి: దేశంలో అతిపెద్ద చౌక ధరల విమాన సంస్థ ఇండిగో శుక్రవారం దాదాపు 84 విమాన సర్వీసులను రద్దు చేసినట్టుగా వార్తలు మీడియాలో చెక్కర్లు కొట్టాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న సంస్థ ఈ వార్తలు పూర్తిగా నిరాధారమైనవని తేల్చి చెప్పింది. సంస్థలోని దాదాపు ఎనిమిది 'ఎ-320 నియో' విమానాల ఇంజిన్లలో తలెత్తుతున్న సమస్యల కారణంగా ఇప్పటికే తాము కొన్ని విమాన సర్వీసుల రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించామని ఇండిగో పేర్కొంది. అయితే శుక్రవారం మాత్రం తాజాగా తాము ఎలాంటి విమాన సర్వీసులను రద్దు చేయలేదని వివరణనిచ్చింది. నిత్యం ఇంజిన్ సమస్యలు వస్తున్న ఎనిమిది విమానాలు జులై నుంచి మొదలుకొని సెప్టెంబరు మాసాంతం వరకు సేవలందించవని తాము ముందుగానే వెల్లడించినట్టుగా తెలిపింది. ఈ విమానాల్లో టికెట్లను బుక్ చేసుకున్న వారికి తాము ఇప్పటికే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఏర్పాట్లు చేసినట్టుగా సంస్థ అధికార ప్రతినిధి వివరించారు. ఈ ఏడాది జూన్ 21 నుంచి జూలై 3 మధ్య కాలంలో ఇండిగో దాదాపు 667 విమానాలను ఇండిగో రద్దు చేసింది. జూన్ 27 ఒక్క రోజే 61 విమానాలను రద్దు చేసిన సంగతి తెలిసిందే.

కాల్ డ్రాప్స్‌పై మరింత కఠినం: ట్రాయ్



న్యూఢిల్లీ: కాల్ డ్రాప్స్ సమస్యకు చెక్ పెట్టే దిశగా టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఈ నిబంధనలను పాటించని టెల్కోలకు దాదాపు రూ.5లక్షలు వరకు జరిమానా విధించనున్నట్టు తెలిపింది. కాగా కాల్ డ్రాప్స్‌ను నియంత్రించడంలో టెలికాం సంస్థలు విఫలమైతే జరిమానా కూడా అదే స్థాయిలో ఉంటుందని వివరించింది. ఇదే క్రమంలో వరుసగా రెండు త్రైమాసికాలకు గానూ ఒకటిన్నర రెట్లకు జరిమానా పెరుగుతుందని, అంతకన్నా ఎక్కువైతే రెండింతల జరిమానా విధించనున్నట్టుగా పేర్కొంది. ఇక అక్టోబర్ 1 నుంచి 'నాణ్యమైన సేవల'కు చెందిన సవరించిన నియంత్రణ అమలులోకి రానుందని వెల్లడించింది. కాల్ డ్రాప్స్ అంచనా, ప్రస్తుతానికి మొత్తం ప్రాంతంలోని సేవల నెట్ వర్క్ సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని జరిమానాలు నిర్దేశిస్తున్నట్టు తెలిపింది. మరోవైపు కొన్ని సందర్భాల్లో టెలికాం సంస్థలు బెంచ్‌మార్క్ స్థాయి కన్నా దిగువకు చేరుతున్నప్పటికీ, సేవల నాణ్యత పడిపోతుందని వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నట్టు ట్రాయ్ పేర్కొంది. ఇప్పటికే టెలికాం రంగంలో పోటీతో కునారిల్లుతున్న టెలికాం సంస్థలకు ట్రాయ్ తాజా నిర్ణయం మరింత భారంగా మారనుంది.

22న అఫెక్స్ ఫ్రొజెన్ ఫుడ్స్ పబ్లిక్ ఇష్యూ



నవతెలంగాణ వాణిజ్య విభాగం: రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లాలో ఏడాదికి 20వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పనున్నామని అఫెక్స్ ఫ్రొజెన్ ఫుడ్స్ వెల్లడించింది. ఇందుకుగాను పబ్లిక్ ఇష్యూకు (ఐపీవో) రానున్నట్టు సంస్థ తెలిపింది. ఐపీవో ద్వారా రూ.152 కోట్ల మేర నిధులు సమీకరించనున్నట్లు పేర్కొంది. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. మూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చౌదరీ కరుటూరి మాట్లాడుతూ ఈ నెల 22న తమ కంపెనీ ఐపీవో ప్రారంభమై 24న ముగియనుందన్నారు. ఇష్యూ ధరల శ్రేణిని రూ.171-175గా నిర్ణయించామన్నారు. రూ.148.77 కోట్ల నుంచి రూ.152.25 కోట్ల నిధులు సమీకరించాలని నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇందుకోసం రూ.10 ముఖ విలువ కలిగిన 87,00,000 ఈక్విటీ షేర్లను ఇష్యూ చేయనున్నామని తెలిపారు. సంస్థ షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనున్నట్టుగా ఆయన తెలిపారు. వచ్చిన నిధులతో కాకినాడకు సమీపంలో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

ఉసురు పోసుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వం

- ఖాళీలపై స్పష్టత లేకుండానే నోటిఫికేషన్లా ?
- భూముల లిటికేషన్లతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు : జయశంకర్ జయంతి ఉత్సవాల్లో కోదండరామ్



నవతెలంగాణ-తాండూరు

టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల ఉసురు పోసుకుంటోందని జేఏసీ చైర్మెన్ కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏయే శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయో స్పష్టత లేకుండా నామమాత్రపు నోటిఫికేషన్లు వేస్తోందని తెలిపారు. నిరుద్యోగులను ఆదుకోనేందుకు ప్రభుత్వం ముందుగా ఉద్యోగుల క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ కేంద్రంలో తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలను అభివృద్ధి చేసేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో సమస్యలను పట్టించుకోకుండా భూముల లిటికేషన్ల చుట్టూ తిరుగుతూ కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఖర్చు చేసేందుకే ఈ దోపిడీ అని విమర్శించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలను, మంత్రులను ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలు మేల్కొని రానున్న రోజుల్లో ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. వికారాబాద్ జిల్లాలో 90 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.


కంది, పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో మెడికల్, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు అన్నివిధాలా అవకాశాలున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని చెప్పారు. వికారాబాద్- తాండూరు- కొడంగల్ రైతులను ఆదుకోనేందుకు పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు అందించాలన్నారు. తాండూరులో ప్రవహిస్తున్న కాగ్నా నదిపై చెరువులు నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు రవీందర్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బస్వరాజ్, జిల్లా అధ్యక్షులు నర్సిములు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల పరిధి మార్పు

టీయూలోకి ఆదిలాబాద్, నిర్మల్

- మంచిర్యాల, కొమురంభీం జిల్లాలు శాతవాహన పరిధిలో
- మారని పీయూ, ఎంజీయూ, ఓయూ సరిహద్దు
- కాకతీయకు మిగిలిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలు





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల పరిధి మారింది. తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం పది జిల్లాలను 31 జిల్లాలకు పెంచింది. జిల్లాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాల పరిధిలో విద్యాశాఖ అధికారులు మార్పు చేశారు. ఈ నిర్ణయంతో గతంలో ఓ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న జిల్లా తాజాగా మరో వర్సిటీ పరిధిలోకి మారింది. పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ), మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ), ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) సరిహద్దులు మారలేదు. పాత పరిధి కొనసాగనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గతంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉండేది. ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీం, నిర్మల్ జిల్లాలుగా విభజించబడింది. దీంతో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ) పరిధిలోకి వెళ్లాయి. మంచిర్యాల, కొమురంభీం జిల్లాలు మాత్రం శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోకి పోయాయి. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇప్పుడు వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలున్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) సరిహద్దు మారలేదు. ఓయూ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, సిద్ధిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలున్నాయి. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాను తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోకి మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే ఆ జిల్లాకు చెందిన మంత్రులు వ్యతిరేకించి ఉస్మానియా పరిధిలోనే కొనసాగేలా చూశారు. ఇప్పుడూ ఉమ్మడి మెదక్ జిల్లా మొత్తం ఉస్మానియా పరిధిలోకే వచ్చింది. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలతో పాత సరిహద్దులతోనే కొనసాగుతున్నది. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలున్నాయి. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కొమురంభీం, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాలున్నాయి. ప్రస్తుతం జిల్లాల విభజన రెవెన్యూ, పోలీసు విభాగాలకే పరిమితమైంది. భవిష్యత్తులో అన్ని శాఖలకూ విస్తరించాలని ప్రభుత్వం సమాలోచన చేస్తున్నది.

వాట్సప్‌లో కలర్‌ఫుల్ టెక్స్ట్!

ప్రపంచవ్యాప్తంగా అందరినీ అలరిస్తున్న వాట్సప్ మరిన్ని హంగులతో అందుబాటులోకి వచ్చింది. ఫేస్‌బుక్ మాదిరిగానే వాట్సప్‌లోనూ కలర్‌ఫుల్ టెక్స్ట్ అప్‌డేట్స్‌ను ఇకపై పోస్ట్ చేయవచ్చు.

ఈ ఫీచర్‌ను త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం వాట్సప్ బేటా వెర్షన్ లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. వాట్సప్ కొత్త వెర్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే న్యూ స్టేటస్ అప్‌డేట్ కనిపిస్తుంది. ఇక్కడ మూడు ఆప్షన్లుంటాయి. ఫాంట్, బ్యాక్‌గ్రౌండ్ కలర్, ఎమోజిల్లో మీకు నచ్చినది ఎంచుకోవచ్చు. బ్యాక్‌గ్రౌండ్ కలర్‌తో స్టేటస్‌ను పోస్ట్ చేయాలనుకునే వారు ముందుగా స్టేటస్ అప్‌డేట్ బాక్స్‌లోకి వెళ్లాలి. దానిపై ట్యాప్ చేస్తే 'వాట్స్ ఆన్ యువర్ మైండ్?'అని మెసేజ్ కనిపిస్తుంది. ఇప్పుడు కలర్ ప్యాలెట్‌లో నుంచి కలర్ బ్యాక్‌గ్రౌండ్‌ను ఎంచుకోవాలి. తరువాత టెక్స్ట్ టైప్ చేసి పోస్ట్ చేయాలి. అంతే !




ఐటీ చెల్లించే ఆప్!

పన్ను చెల్లింపుదారుల కోసం ఆదాయం పన్ను శాఖ సరికొత్త మొబైల్ అప్లికేషన్ 'ఆయకార్ సేతు'ను అందుబాటులోకి తెచ్చింది. 'పన్ను చెల్లింపుదారుల వారధి అన్న అర్థంతో తెచ్చిన ఈ ఆప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 73065 25252 నెంబర్‌కు మిస్డ్ కాల్ చేసి కూడా ఈ ఆప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఫోన్‌నెంబర్ ద్వారా ఆప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని సీబీడీటీ మొదటిసారిగా అందుబాటులోకి తీసుకువచ్చింది. డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత ఈ ఆప్‌ను ఉపయోగిఇంచడం చాలా సులభం. దీని ద్వారా టీడీఎస్ ట్రాకింగ్, పన్ను చెల్లింపులు, పర్మినెంట్ ఖాతా నెంబర్ (పాన్) దరఖాస్తులు చేయడానికి అవకాశం ఉంటుంది. గంటల తరబడి క్యూలో నిలబడే అవసరం లేకుండానే ఈ ఆప్‌తో ఆదాయపన్నుకు సంబంధించిన అన్ని చెల్లింపులు చేయవచ్చు.

ఈ ఆప్‌తో ఆధార్‌తో పాన్‌ను అనుసంధానం చేయవచ్చు. పన్ను చెల్లింపుదారులు ఇకపై ఇంట్లో ఉండే తన పనిని పూర్తి చేయవచ్చు. టాక్స్ రిటర్నులను ఫైల్ చేసే అవకాశాన్ని కూడా వినియోగించుకోవచ్చు.





స్పీడ్ పెంచేలా..!

డిజిటల్ యుగంలో మనం రాకెట్‌స్పీడ్‌లో పయనిస్తున్నాం. కరెంటు బిల్లు కట్టడం నుంచి ఫ్లైట్ టికెట్ బుకింగ్ వరకు అన్నింటికీ కంప్యూటర్ పైనే ఆధారపడుతున్నాం. కంప్యూటర్ కాసేపు మొరాయించినా.. స్లోగా పనిచేసినా.. ఏ పనులు పూర్తికావు. ఆఫీస్ కావచ్చు.. ఇల్లు కావచ్చు.. రైల్వే బుకింగ్ సెంటర్ కావచ్చు.. ఎక్కడైనా కంప్యూటర్ల స్పీడ్ తగ్గితే ఎన్నో పనులు పెండింగ్‌లో పడతాయి. మరి కంప్యూటర్‌ను రాకెట్ స్పీడ్‌తో పనిచేయించాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

అవసరమైనవే..

కొత్తగా కొన్న కంప్యూటర్, పీసీలో ఎన్నో రకాల అప్లికేషన్లు ఉంటాయి. వీటిలో కొన్ని అవసరమున్నవి, మరి కొన్ని అవసరం లేనివి ఉంటాయి. మనకు అవసరం లేని అప్లికేషన్లను సిస్టమ్ నుంచి డిలిట్ చేస్తే కంప్యూటర్ స్పీడ్ పెరుగుతుంది.

- కంప్యూటర్‌లో ఉన్న డ్రైవ్‌లే కాకుండా 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'లను ఉపయోగిస్తే కంప్యూటర్ స్పీడ్ పెరుగుతుంది. ఎక్కువ డేటా సేవ్ చేసేవారు 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'ను ఎంచుకోవాలి. ప్రధా నంగా 'డ్రాప్‌బాక్స్', మైక్రోసాఫ్ట్ వన్‌డ్రైవ్', 'గూగుల్ డ్రైవ్'లాంటివి అందుబాటులో ఉన్నాయి.
- ఎక్కువ డేటా స్టోరేజ్ కోసం క్లౌడ్ స్టోరేజ్ ఆప్షన్‌ను ఉపయోగించు కుంటే మంచిది.
- కంప్యూటర్‌లోని ఇంటర్నల్ డ్రైవ్‌లో గల డాటాను ఎప్పటికప్పుడు 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'లోకి మార్చుకుంటే డిస్క్‌లోని స్పేస్ ఫ్రీ అవడంతో కంప్యూటర్ వేగం పెరుగుతుంది.

ఒకే ఫైల్ చాలా చోట్ల..

కావల్సిన సమాచారంతో పాటు అందుబాటులో ఉన్న వివరాలన్నీ కంప్యూటర్‌లో సేవ్ చేస్తుంటారు. దీనితో జంక్‌ఫైల్స్ పెరిగిపోయి టెంపరరీ డేటా రోజురోజుకూ పెరిగిపోతుంది. దీనితో కంప్యూటర్ వేగం తగ్గుతుంది. ఇంటర్నెట్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సాఫ్ట్‌వేర్, టెంపరరీ డేటా తో కూడా కంప్యూటర్ మొరాయిస్తుంది. ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసే సమయంలో ఒకేఫైల్ చాలా చోట్ల సేవ్ అవుతుంది. ఈ కారణాలతో కంప్యూటర్ పనితీరు మంద కొడిగా సాగుతుంది. ఇలాంటి సందర్భాలలో కంప్యూటర్ వేగం పెరగాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- పర్సనల్ కంప్యూటర్‌లో ఒకే ఫైల్ ఒకటి కంటే ఎక్కువ చోట్ల సేవ్ అయిందేమో చెక్ చేయాలి. ఫొటోలు, వీడియోలతో పాటు ఇతర ఫైళ్లు కూడా ఎక్కువ చోట్ల సేవ్ కాకుండా జాగ్రత్తలు పాటించాలి.
- డౌన్‌లోడ్ చేసుకున్న ఫైల్స్ ఎక్కడ సేవ్ అవుతున్నాయో గమనించాలి. రిపీట్‌గా ఉంటేవాటిని డిలీట్ చేస్తే హార్డ్‌డిస్క్ స్పేస్ పెరుగుతుంది.
- ఆప్స్, ఇతర సాఫ్ట్‌వేర్ కారణంగా ఉండే జంక్‌ఫైల్స్‌లో 'టెంప రరీ' డాటాను చెక్ చేయాలి. వీటిని ఎప్పటి కప్పుడు తొలగించుకుంటే పీసీ వేగం ఆటోమెటిక్‌గా పెరుగుతుంది.
- సిస్టమ్‌లోని 'డిస్క్ క్లీనప్' ఆప్షన్ ను ఎంచుకోవాలి. 'మై కంప్యూటర్'లోని డిస్క్‌లలో ఏదైనా ఒక డిస్క్‌పై మౌస్ ఉంచి రైట్ క్లిక్ చేస్తే 'డిస్క్ క్లీనప్' ఆప్షన్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేస్తే జంక్‌ఫైల్స్ డిలీట్ అవుతాయి.

క్లీన్ మై పీసీ..

ఇంటర్నెట్‌లో లభించే 'క్లీన్ మై పీసీ' అను అప్లికేషన్ ద్వారా పీసీ వేగాన్ని కొంతమేర పెంచు కోవచ్చు. ఈ అప్లికేషన్‌లో అందుబాటులో ఉన్న రకరకాల 'సిస్టమ్ క్లీనింగ్ టూల్స్‌తో కంప్యూటర్ వేగం పెంచుకోవచ్చు.

ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే మీరు రోజూ ఉపయోగించే కంప్యూటర్ మరింత స్పీడ్‌గా పనిచేసేలా చేయవచ్చు.

నయామాల్

ఇకపై చేతికి



స్మార్ట్‌ఫోన్ చేతిలో పట్టుకోవాలి. పొరపాటున కింద పడితే అంతే! అలా కాకుండా చేతికి రిస్ట్‌వాచ్‌లా ధరిస్తే .. బాగుంటుంది కదూ! మరి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల కోసం

ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ ఆపిల్ నుంచి త్వరలో స్మార్ట్‌వాచ్‌లు రానున్నాయి. ఎల్‌టీఈ చిప్స్‌తో ఈ వాచ్‌లు అందుబాటులోకి రానున్నట్టు సమాచారం. ఫోన్‌తో పనిలేకుండానే ఈ వాచ్ ద్వారా చాలా పనులు చక్కబెట్టుకునే వెసులుబాటు లభిస్తుందని వినియోగదారులు ఆశిస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న ఆపిల్ స్మార్ట్‌వాచ్‌ల ద్వారా టెక్ట్స్ మెసేజ్‌లు పంపించాలన్నా, ఇతర పనులు చేసుకోవాలన్నా ఐఫోన్‌తో అనుసంధానం కావాల్సి ఉంటుంది. అయితే తాజాగా తీసుకురానున్న వాచ్‌లతో ఇతర ఫోన్లకు అనుసంధానం కావాల్సిన అవసరం ఉండదు. ఈ స్మార్ట్‌వాచ్‌లను వచ్చే ఏడాది మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నది సమాచారం. ఈ స్మార్ట్‌వాచ్ అందుబాటులోకి వస్తే ఇకపై చేతిలో కాకుండా చేతికి ధరించి స్మార్ట్‌గా పనిచేసుకోవచ్చు.. బాగుంది కదూ..! మరి ఈ స్మార్ట్‌వాచ్‌ను ధరించాలంటే మాత్రం కొన్ని రోజులు ఆగాల్సిందే..! వెయిట్ అండ్ సీ..!

స్మార్ట్ చేసే స్టిక్

టెక్నాలజీ రోజురోజుకూ మారిపోతుంది. పెద్ద టీవీ స్థానంలో ఎల్‌ఇడీలు వచ్చాయి. గోడపై క్యాలెండర్ మాదిరిగా టీవీని అమర్చుకునేలా మారిపోయాయి. మరి టీవీని మరింత స్మార్ట్‌గా మార్చుకునే వీలు కల్పిస్తున్నది నేటి ఆధునిక టెక్నాలజీ. అందుకు అనుగుణంగా వివిధ యాక్సెసరీలు అందుబాటులోకి వస్తున్నాయి.



టీవీని పీసీగా మార్చుకోవాలంటే హెచ్‌డిఎమ్‌ఐ పోర్టు ఉన్న టీవీ ఉంటే చాలు, టీవీ స్టిక్‌తో స్మార్ట్‌టీవీగా కన్వర్ట్ చేసుకోవచ్చు. అలాగే కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న గూగుల్ క్రోమ్‌కాస్ట్ స్టిక్ కూడా ఇలాంటిదే. ఇటీవలే అవసరమైన ఫీచర్లను జోడించి 'ఫైర్ స్టిక్' పేరుతో కొత్త టీవీస్టిక్ మార్కెట్‌లోకి వచ్చింది.

ఈ టీవీ స్టిక్‌ను ఉపయోగించాలంటే కనీసం 40-50 ఎంబిపిఎస్ స్పీడ్ ఉన్న వైఫై నెట్‌వర్క్ ఉండాలి. హెచ్‌డిఎమ్‌ఐ పోర్టు ఉన్న టీవీకి స్టిక్‌ను కనెక్ట్ చేయాలి. తరువాత టీవీ ఇన్‌పుట్ సోర్స్‌గా హెచ్‌డిఎమ్‌ఐని సెలక్ట్ చేసుకోవాలి. ఇప్పుడు రిమోట్ సహాయంతో లాంగ్వేజ్ ఎంచుకుని, వైఫై నెట్‌వర్క్‌ని సెలక్ట్ చేసుకోవాలి. రిమోట్‌లో ఉన్న వాయిస్ బటన్‌ను ప్రెస్ చేసి సినిమా పేరు చెప్పితే చాలు. టీవీ తెరపై ఆ సినిమా ప్రత్యక్షమవుతుంది. యూట్యూబ్ ఒక్కటే కాదు, ఇంటర్నెట్‌లో బోలెడు టీవీ కంటెంట్ అందుబాటులో ఉంటోంది. అందుకే టీవీ స్టిక్ తప్పనిసరి యాక్సెసరీగా మారింది.

మరణం లేని జీవి వుందా?

నమ్మకాలు నిజాలు

ప్రశ్న : విశ్వంలో అనేక జీవులు ఉన్నాయి. వాటిలో మరణంలేని జీవి ఉందా? ఉంటే అది చిరంజీవిగా ఉండడానికి కారణమేమిటి?


- వి.లావణ్య, సెయింట్‌యాన్స్ కళాశాల, గుంటూరు

జవాబు : విశ్వంలో చాలా చోట్ల జీవులుండటానికి ఆస్కారం ఉన్నా, సైద్ధాంతిక అవకాశం వున్నా మనకు లభించిన వైజ్ఞానిక ఆధారాల ప్రకారం భూమి మీద తప్ప మరెక్కడా జీవం ఉన్న ఆనవాళ్లు కనిపించడంలేదు. అంగారక గ్రహం (మన సౌర మండలంలోనే మన పొరుగున ఉన్న గ్రహమే) మీద గతంలో ఎపుడో జీవం వున్నట్లు అరకొర ఆధా రాలు అగుపించినా అవి బలమైన ఆధారాలు కావు.

జీవి అంటే కొన్ని లక్షణాలున్నాయి. మన భూమ్మీదే వృక్ష జాతులు, జంతుజాతులు అటుయిటూ గాని జాతులు లక్షలాదిగా వున్నా జీవులన్నింటికీ సార్వత్రికంగా (Universal or Common) కొన్ని లక్షణాలున్నాయి. రాయిని చూపి పుస్తకమని అనలేం. ఇటుకను చూపి మొబైల్ ఫోన్ అనం. నదిని చూపి పర్వతం అనం. అలాగే వేటిని జీవులు అనకూడదో, వేటిని జీవులు అనాలో నిర్ద్వంద్వంగా చెప్పగలం. మిల్లీమీటరులో సుమారు వెయ్యోవంతు ఉన్న తిత్తిలాంటి కోశంలో DNA లేదా RNA అనే పొడవాటి బృహదణు (macro molecular) సముదాయం వుండడం జీవికి వున్న ప్రాథమిక లక్షణం. దీనికి ఏ జీవీ (చెట్టూ చేమా, చీమా దోమా, పురుగుపుట్రా, కప్పలు పాములూ, ఆవూ పందీ, తులసీ తుమ్మా, ఉమ్మెత్త ఉలవ, నత్త నల్లి, అమీబా అనకొండ, తేయాకు తిమింగలం, నువ్వు నేను) ఉపేక్షణీయం (exception) కాదు. ఇలాంటి తిత్తినే కణం (cell) లేదా జీవకణం (biological cell) అంటాము. తిత్తిలో RNA మాత్రమే వున్న అత్యంత ప్రాథమిక కణం వైరస్. ఇవి జీవికి, నిర్జీవికీ మధ్యస్తంగా వుంటాయి. కానీ నిజమైన జీవకణంలో ప్రవేశించాక వీటికి జీవ లక్షణాలు అబ్బుతాయి. అది వేరే విషయం.

జీవికి ఉన్న మరో లక్షణం ప్రత్యుత్పత్తి (reproduction). ఒక రాయి తన చుట్టూ తనలో ఎలాంటి రసాయనాలున్నాయో అలాంటి రసాయనాల్ని ఎన్నిరోజులు ఉంచినా ఆ రాయి తనలాంటి రాయిని తయారు చేసుకోలేదు. పదార్థాలు, రాయి విడివిడిగా స్వతంత్రంగా అరకొర మార్పులతో ఉంటాయి తప్ప మరో రాయి ఏర్పడదు. కానీ జీవకణం అలాకాదు. తనలో వున్న అంతర్భాగాలలోని లక్షణాలున్న రసాయనిక భౌతిక పరిస్థితుల్ని ఒనగూర్చితే తన లాంటి (Xerox కాపీ లాగా) మరో కణాన్ని నిర్మించు కొంటుంది. ఏకకణ జీవి (monocellular organism) మరో ఏకకణ జీవిని, కుక్కలాంటి బహుకణ జీవి (multicellular organism) కుక్కలాగే వున్న మరో బహుకణ జీవిని నిర్మించుకొంటుంది. వరి మొక్క మరో వరిమొక్కను, తులసి చెట్టు మరో తులసి చెట్టును నిర్మించుకొంటుంది. అంతేగాని ఇటుక మరో ఇటుకను, మొబైల్ ఫోన్ మరో మొబైల్ ఫోన్‌ను, ఒక గడియారం మరో గడియారాన్ని నిర్మించుకోలేవు.

జీవికున్న మరో లక్షణం పరిణామం (evolution). ఏ జీవి అనంతకాలం పాటు తనలాంటి జాతి జీవినే నిర్మించుకోదు. తక్కువ కాల వ్యవధిలో (అంటే సెకన్లు గంటలు కాదు సుమా, కొన్ని వేల లేదా లక్షల సంవత్సరాలు) పెద్దగా తేడాలు కనిపించని పునరుత్పాదక సంతానం వచ్చినట్టున్నా లక్షలాది సంవత్సరాల పర్యంతంలో మొదటి జీవి లక్షణాలకు, తదుపరి జీవి లక్షణాలకు ఎంతోకొంత తేడా వుంటుంది. తద్వారానే ఈ భూమ్మీద వివిధ వృక్ష, జంతు జాతులు రూపొందాయి. దీనినే మహనీయుడు చార్లెస్ డార్విన్ తన 'ప్రకృతివరణం ద్వారా జాతుల ఆవిర్భావం (Origin of Species by Natural Selection), గ్రంథంలో సోదాహరణంగా విపులీకరించాడు.



ఇక నాల్గవ లక్షణం: జీవులు ప్రకృతితో ఘర్షించు కొంటాయి. ఆ ఘర్షణలో రక్షణను, అపాయాన్ని రెంటినీ ఎదుర్కొంటాయి. దీనినే గతితార్కిక భౌతికవాదం (Dialectical Materialism) అనే సర్వ వైజ్ఞానిక సమాకలిత తత్వశాస్త్ర (Integrated Scientific Philosophy) పరిభాషలో సంఘర్షణ (contradiction) అంటాము. ఉదాహరణకు భూమి ఆకర్షణకు విరుద్ధంగా పైకి చెట్టు ఎదగడం ప్రకృ తికి విరుద్ధం. కానీ అదే భూమి ఆకర్షణ వల్లే చెట్టు నేలలో కుదురుగా నిలబడింది. ఉష్ణోగత పెరిగితే జీవకణం చనిపోతుంది. కానీ ఉష్ణోగ్రతే లేకుంటే కూడా జీవకణం చనిపోతుంది. గాలి లేకుండా బతకలేము. కానీ మరీ ఎక్కువయితే కొట్టుకుపోయి తునాతునకలవుతాము. ఇంకా ఇలాంటివే ఎన్నో లక్షణాలు జీవులకు వున్నాయి.

ఇక జీవులకున్న అత్యంత ముఖ్యమైన లక్షణం శక్తిని పొందే విధానం. దాదాపు 99.99 శాతం వరకు జీవులన్నీ ప్రకృతి అవరోధాన్ని ఎదుర్కొని ఎదుగుతాయి. ఇలా అవరోధాన్ని ఎదుర్కొని పదార్థాన్ని స్థానభ్రంశం (positional displacement) చేయించడాన్నే పని (work) అంటాము. పని చేయడానికి శక్తి (energy) అవసరమనేది ప్రకృతి నియమం (natural law). ఎదగడం, కదలడం, పారిపోవడం, తలపడడం, మాటువేయడం, కాటు వేయడం, కనడం, కూడడం, నవ్వడం, కవ్వడం, ఏడ్వడం, ఏర్పడడం వంటివన్నీ పనులే. జీవి మొత్తంగా కదిలినా, భాగాలు భాగాలుగా కదిలినా పని జరిగినట్టే. ఇన్ని విధాల పనులు చేయాలంటే శక్తి అవసరం. అదీ యిదీ అని తేడాలేకుండా పైన చెప్పినట్టు 99.9999 శాతం జీవులన్నీ రసాయనిక శక్తి ఆధారంగానే జీవాన్ని ఈడేరిస్తున్నాయి. ఆ రసాయనిక యింధనం గ్లూకోజు. గ్లూకోజులో వున్న రసాయనిక శక్తి దానిని ఆక్సిజన్‌తో కలిపితే వచ్చే కార్బన్ డైయాక్సైడ్, నీటి అణువుల శక్తి కన్నా ఎక్కువ. కాబట్టి గ్లూకోజును కార్బన్‌డయాక్సైడ్, నీటి అణువులుగా మార్చగా దొరికే అదనపు శక్తిని వాడుకోవడం వల్లే దాదాపు అన్ని జీవులు జీవించగలుగుతున్నాయి. బాబాలు, ఆస్తికులు, నాస్తికులు, అమెరికన్లు, అల్బేలియన్లు, అన్ని జంతువులు, అన్ని వ క్షాలు, అన్ని మొక్కలు, అన్ని జీవులు ఈ గ్లూకోజులోని శక్తితో తప్ప మరేదో దివ్య శక్తితోనో, అభూత శక్తితోనో, వారికే ప్రత్యేకమైన (reserve) శక్తితోనో జీవించడంలేదు. జీవకణం (లేదా జీవి) బయట గ్లూకోజును కార్బన్‌డయాక్సైడ్, నీటి అణువులుగా మార్చడం ద్వారా శక్తిని రాబట్టుకోవాలంటే గ్లూకోజును మండించాలి లేదా దహనం (combustion) చేయాలి. అందుకోసం గ్లూకోలను ఆక్సిజన్ వున్న గాలి సమక్షంలో సుమారు 300 సెంటిగ్రేడు ఉష్ణోగతకు వేడి యాలి. కానీ ఏ జీవిలోను ఇంత ఉష్ణోగత ఉండదు. అంతటి వేడితో ఏ జీవకణమూ బతకదు. మరి జీవకణములకు గ్లూకోజు నుంచి శక్తి ఎలా లభ్యమవుతుంది? అందుకోసం దశలు ఉన్నాయి. అంచెలంచెల ఆ దశల్ని కూడగట్టి క్రెబ్స్ వలయం లేదా సిట్రికామ్ల వలయం (Citric Acid Cycle-CAC) లేదా త్రయ కార్బాక్సిలిక్ ఆమ్ల వలయం (Tricarboxylic Acid Cycle- TAC) అంటాము. తమాషా ఏమిటంటే ఈ క్రెబ్స్ వలయం దాదాపు పైన పేర్కొన్నట్టుగా గ్లూకోజుల నుంచి శక్తిని దండుకొని బతికే 99.99 శాతపు జీవులన్నింటికీ సార్వత్రికం.

ఇలా ఎన్నో సాధారణ జీవ లక్షణాల ఆధారంగానే నేడు ఆధునిక జీవశాస్త్రం డార్విన్ పరిణామవాద సిద్ధాంతానికి తిరుగులేని సాక్ష్యాధారాల్ని ఇస్తోంది. అయినా అమెరికా లాంటి అభివృద్ధి(?) చెందిన దేశాలలో పాఠశాల విద్యలో పరిణామ సిద్ధాంతాన్ని తీసివేశారు. తమ మత గ్రంథాల ఉవాచలకు పరిణామ వాదం గొడ్డలి పెట్టుగా వుండడం వల్ల మతతత్వ రాజకీయాలు, ఆర్థిక వ్యవహారాల బలంతో నడిచే పాలకవర్గాలు పరిణామ వాదానికీ, శాస్త్రీయ దృక్పధానికి తరతరాలుగా అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ 'సత్యమేవ జయతే (సత్యమే జయిస్తుంది) అన్న నానుడిలాగే నిజాలు బయటపడుతూనే వున్నాయి. అది వేరే విషయం.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక

ఇక మీరన్న ప్రశ్నకు సమాధానం పైన పేర్కొన్న వివరణ ద్వారా లభిస్తుంది. జీవికున్న ప్రతి కార్యకలాపంలోను పని యిమిడి వుంది. ప్రతి పనిలోనూ శక్తి మార్పిడి వుంది. జీవి చేసే చాలా పనుల్లో తన ప్రమేయం లేని విధంగా సహజత్వం వుంది. ఉదాహరణకు నాకు యిష్టం వున్నా లేకపోయినా నా గుండె కొట్టుకుంటుంది. బాబాలు లేదా దైవాంశ సంభూతులు అనుకొనేవారు అలా నమ్మబలికే వారు కూడా తమ గుండెల్ని "ఆగిపో హృదయమా, నా స్వంత హృదయమా, ఓ నిముషమే సుమా నీ కదెంత సమయమా", అని నాజూగ్గా అడిగినా గుండె ఆగదు. ఆగితే యిక మరణించడం ఆగదు. ఇలాంటి ప్రకృతి సిద్ధ సహజ కార్యకలాపాల్ని వైజ్ఞానిక శాస్త్ర పరిభాషలో ఇర్రివెర్సిబుల్ చర్యలు (Irreversible Processes) అంటారు. ఇలాంటి చర్యల్లో సహజంగానే ఎంట్రోపీ (Entropy) పెరుగుతుంది. ఇది కూడా ఓ సార్వత్రిక ప్రకృతి నియమం. ఎంట్రోపీ అంటే పదార్థాల్లో క్రమ రాహిత్యాని (disorder) కి, చంచలిత (randomness) కు, చలనాల (motions) కు కొలమానం. జీవుల్లో జీవిత పర్యంతం జరిగే సహజ ఇర్రివెర్సిబుల్ చర్యలే జీవిలో క్రమరాహిత్యాన్ని పెంచుతాయి. ఓవైపు సహజ చర్యల ద్వారా తన జీవకణంలో వున్న క్రమానుగత చర్యల సమాకలనం ద్వారా జీవిస్తూనే అవే సహజ చర్యల ద్వారా ఉత్పన్నమయ్యే ఎంట్రోపీ ద్వారా కణాలకి క్రమరాహిత్యాన్ని పెంచుకొంటుంది. ఇది కూడా గతితార్కిక భౌతికవాదపు మొదటి నియమ మయిన contradiction of the opposites కి బలాన్ని చేకూర్చు తుంది. ప్రతి జీవి ఈ భౌతిక ప్రపంచంలో అంతర్భాగమే కానీ, ప్రకృతికి ఆవల ఏమీ లేదు. అందుకే జీవిలో వున్న క్రమత్వపు రక్షణ, అక్రమత్వపు ఆపదలలో ఆపదపాలే కాలక్రమేణా ఎక్కువవుతుంది. గతితార్కిక భౌతికవాదంలో కూడా ఘర్షణ చెందే రెండు పరస్పర విరుద్ధ అంశాలలో ఒకదానిది పైచేయి అయ్యే సందర్భం వస్తుంటుంది.

ఇలా జీవానికే ప్రతినిధి అయిన జీవకణంలో ఎంట్రోపీ స్థాయి పెరిగేకొద్దీ జీవకణపు హంగులు, ఆర్భాటాలు, చలాయింపులూ, గెలుపులూ మందగిస్తాయి. ఈ విశాల విశ్వంలో కాలక్రమేనా ఎంట్రోపీ పెరుగుతోందన్న సార్వత్రిక నియమానికి జీవకణం దాసోహమంటుంది. అందుకే కొంతకాలమయ్యేక జీవకణపు చర్యలు కాలక్రమేనా క్రమరాహిత్యానికి లోనవుతాయి. అపుడు ఆ కణం చనిపోయింది అంటాం. అందుకే ప్రాణం పోయాక కూడా పదార్థం అలాగే వుంటుంది. బహుకణ జీవులయిన మనము ఇతర వృక్షజంతు జాతులు కొన్ని కణాల్ని పునరుత్పత్తి చేసుకోగలవు. కానీ అన్నింటినీ కాదు. ఇక జీవి నిర్మాణాన్ని బట్టి, జీవి జాతిని బట్టి ఎప్పుడోకప్పుడు జీవి మొత్తంలో జీవలక్షణాలు సన్నగిల్లుతాయి. ఇదే సహజ మరణం. దీనికి ఏ జీవీ ఉపేక్షణీయం కాదు. ఆయా జీవుల ఆంతరింగిక నిర్మాణం, జీవన కార్యకలాపాల ఆధారంగా ఆయా జీవులకు ఆయుర్దాయం వుంటుంది. ఏదీ, ఎవరు చిరంజీవి కాదు కాబట్టి ప్రశ్నలో రెండవ భాగానికి అర్థమే లేదు. ఎక్కువకాలం ఆరోగ్యంగా బతకడమెలా అన్నదే మిగిలిన తంతు. అది వేరే సమాధానం.



టాప్ వన్‌లోనే విరాట్...

ఐసీసీ తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ కెప్టెన్ విరాట్ కోహ్లీ యథాతథంగానే కొనసాగుతున్నాడు. 873 పాయింట్లను సాధించిన కోహ్లీ, రెండో ర్యాంకర్ ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కంటే 12 పాయింట్ల పైనే ఉండటం విశేషం. టాప్-20లో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ (12), శిఖర్ ధావన్ (13), వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ(14) ర్యాంకుల్లో కొనసాగుతున్నాడు. బౌలింగ్‌లో టాప్ టెన్‌లో భారత్ బౌలర్లు ఎవరు లేరు. భువీ (13) టాప్-20లో ఉన్నాడు.

ఫిఫా చరిత్రలో తొలిసారిగా మహిళా రిఫరీలు

అండర్-17 ప్రపంచకప్‌కు ఏడుగురు



న్యూఢిల్లీ: భారత్‌లో అక్టోబర్ ఆరు నుంచి ప్రారంభం అయ్యే ఫిఫా-17 పురుషుల ప్రపంచకప్ టోర్నీకి ఏడుగురు మహిళా రిఫరీలను ఎంపిక చేశారు. ఫిఫా చరిత్రలో మ్యాచ్‌ల పర్యవేక్షణకు మహిళలను నియమించడం ఇదే ప్రథమం.భారత్‌లోని గోవా, గౌహతి, కోచి, కోల్‌కతా,నేవి ముంబయి,న్యూఢిల్లీ నగరాల్లో అక్టోబర్ నుంచి 28వ తేదీ వరకు ప్రపంచకప్ జరగనున్నది. ఆరు ఫుట్‌బాల్ సమాఖ్యల నుంచి 21 మంది రిఫరీలను నియమించగా, ఇందులో ఏడుగురు మహిళలకు చోటు కల్పించారు. రియా యాంగ్ (కొరియా), గ్లాడ్స్ లెంగ్వే(జాంబియా), కారోల్ అనే చెనార్డ్(కెనడా), క్లాడియా అంపైరేజ్ (ఉరుగ్వే), అన్నా మారియా ఈగ్లీ (న్యూజిలాండ్), కాథరీనా మాంజోల్ (ఉక్రెయిన్), ఈస్తర్ స్టాబ్లీ(స్విట్జర్లాండ్) ఉన్నారు. గతంలో వారంతా మ్యాచ్ అఫీషియల్స్ కలిసి పనిచేసిన అనుభవం ఉందని, వార్ని ఫిఫా కప్‌లో పోటీల్లో వినియోగించి పనితీరు చూస్తామని ఫిఫా రిఫరీల హెడ్ మసీమో బుస్కా తెలిపారు.

యు ముంబ అనూహ్య గెలుపు

లక్నో: ప్రొ కబడ్డీలో భాగంగా శుక్రవారం జరిగిన ఇంటర్ జోన్ మ్యాచ్‌లో యు ముంబా విజయం సాధించింది. యూపీ యోధాను వారి సొంత వేదికలోనే ఓడించింది. హొరాహోరీగా జరిగిన పోటీలో 37-34తో మట్టికరిపించింది. తొలుత యూపీ ఆధిక్యంలో ఉన్నది. ఈ పోరులో ముంబా అనూహ్యంగా యూపీని వెనక్కి నెట్టింది. తలో పాయింటు సాధించటంతో ఆట రక్తికట్టించింది. దీంతో ఆఖర్లో మ్యాచ్ మరింత ఉత్కంఠకు దారితీసింది. యూపీలో రిషాంక్ దేవడిగా 14 సార్లు కూతకు వెళ్లి 14 పాయింట్లు తీసుకొచ్చి రికార్డు సృష్టించాడు. ముంబాలో షబ్బీర్ బప్పు 12 రైడ్ పాయింట్లు సాధించాడు.





నెం:1 కొనసాగింపే విరాట్ లక్ష్యం

ప్రపంచకప్‌కు అర్హతే లక్ష్యంగా శ్రీలంక

- రేపే భారత్- శ్రీలంక తొలి వన్డే

దంబుల్లా: ఇంటా, బయటా మూడు ఫార్మాట్లలోను భారత్‌ను విజయాల బాట పట్టిస్తున్న విరాట్ నెంబర్ వన్ స్థానం పదిల పర్చుకునే లక్ష్యంగానే లంకేయులతో వన్డే సిరీస్‌కు సన్నద్ధం అవుతున్నాడు. . శ్రీలంకపై టెస్ట్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా అదే జోష్‌తో వన్డే సిరీస్‌లోను జైత్రయాత్ర కొనసాగించేందుకు వ్యూహాలకు పదును పెట్టింది. ఇరుజట్ల మధ్య ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే ఆదివారం దంబుల్లా వేదికగా జరగనుంది. ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానంలో భారత్ కొనసాగాలంటే సిరీస్‌ను 4-1తో సాధించి తీరాల్సి ఉంది. 114 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న విరాట్ సేన 3-2తో సిరీస్‌ను లంకపై సాధిస్తే 113 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న ఇంగ్లాండ్ డెసిమల్ పాయింట్ ఉన్నతంగా నిలిచి నెం:1ను సాధించే వీలుంది. మరోవైపు వన్డే ర్యాంకింగ్స్‌లో నెం:1గా ఉన్న కోహ్లీ బ్యాట్‌తో సత్తా చాటకపోతే అతని ర్యాంకు చేజారనుంది. దీంతో జట్టు విజయమే లక్ష్యంగా దంబుల్లాలో అసలైన పోరాటంను క్రికెట్ అభిమానులు తిలకించే అవకాశం ఉంది.టెస్ట్‌ల్లో లంకను వైట్‌వాష్‌కు గురి చేసి సరికొత్త చరిత్రను తిరగరాసిన విరాట్ కోహ్లీ ఈ సిరీస్‌లో దూకుడు పెంచడంపైనే దృష్టి సారించనున్నాడు. టెస్ట్ సిరీస్‌లో అత్యధికంగా 358 పరుగులతో సత్తా చాటిన శిఖర్ ధావన్, వైస్ కెప్టెన్‌గా ఎంపికైన స్టార్ బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మలు ఓపెనింగ్ జోడిగా భారీ స్కోర్లు సాధించడంపైనే గురి పెట్టారు. వీరిద్దరు ఐసిసి ఛాంపియన్‌షిప్‌లోను పరుగుల వరద పారించారు. వన్డే ఫార్మాట్‌లో భారత్‌కు ఎదురులేకుండా ముందుకు సాగుతోంది. ఐసిసి ఛాంప్ తర్వాత వెస్టిండీస్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను 3-1తో భారత్ కైవసం చేసుకుంది. ఐసిసి ఛాంపియన్‌షిప్ లీగ్ దశలో శ్రీలంక చేతిలో భారత్ ఓటమి చెందింది. దీనికి తొలి వన్డేలోనే విరాట్ ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉంది. 2008లో వన్డేల్లో శ్రీలంకలోనే ఆగస్టు 18న వన్డేల్లో ఓపెనర్‌గా అడుగుపెట్టిన కోహ్లీ మళ్లీ ఏ విధంగా దంచేస్తాడో అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

తరంగా.. టీమిండియాను ఎదురీదేనా?

స్వదేశంలో టీమిండియా చేతిలో టెస్ట్ సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రీలంక వన్డే సిరీస్‌లో కనీసం రెండు మ్యాచ్‌లు గెలిస్తే నేరుగా 2019 ప్రపంచకప్‌కు అర్హత సాధించడానికి మార్గం సుగమం అవుతుంది. సెప్టెంబర్ 30తో ఐసిసి ర్యాంకుల్లో టాప్-8లో నిలిచిన దేశాలు ప్రపంచ కప్‌కు నేరుగా అర్హత సాధించనున్నాయి. దీంతో శ్రీలంకకు వన్డే సిరీస్ అత్యంత కీలకం. టెస్ట్ సిరీస్ ఓటమితో అభిమానులు, మాజీ క్రికెటర్ల విమర్శలతో శ్రీలంక ఒత్తిడిలో ఉంది. ఉప్పుల్ తరంగ్ సారథ్యంలోనే జట్టుపైనే ఇప్పుడన్నీ ఆశలను టీమ్ మేనేజ్‌మెంట్, శ్రీ లంక బోర్డు పెట్టుకున్నాయి. 88 పాయింట్లతో లంకేయులు ఎనిమిదో స్థానంలో ఉన్నారు. వెస్టిండీస్ కంటే 10 పాయింట్ల పైనే ఉన్నారు. దీంతో కనీసం రెండు మ్యాచ్‌లను గెలిస్తే లంక జట్టు 90 పాయింట్లతో ప్రపంచ కప్ ఆశలు పదిలంగా ఉంటాయి. సెప్టెంబర్ 13న ఐర్లాండ్‌తో జరిగే ఏకైక వన్డేలో వెస్టిండీస్ గెలిస్తే 88 పాయింట్లకు చేరుకుంటుంది.ఆ తర్వాత సెప్టెంబర్ 19 నుంచి 29 వరకు ఇంగ్లాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లోను విండీస్ తలపడనుంది.



తెగని ఉమ్మడి ఫీజుల గొడవ

రూ.2,450 కోట్లకు రూ.1500 కోట్లు విడుదల

ఖజానాలోనే రూ.600 కోట్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఫీజుల గొడవ తెగడం లేదు. 2013-14, 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.2450 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 2015లో టీఆర్ఎస్ సర్కార్ రెండేండ్ల ఫీజులకు సంబంధించి దశల వారీగా రూ.1500 కోట్లు విడుదల చేసింది. విడుదల చేసిన మొత్తంలో రూ.900 కోట్లు కాస్త రాజకీయ పలుకుబడి గల కళాశాలల ఖాతాలో జమ అయ్యాయి. మిగిలిన రూ.600 కోట్లు విడుదల చేయకుండా ఖజానాలోనే ఉంచింది. దీంతో విద్యార్థుల చదువులు పూర్తయినా ఫీజు బకాయిలు ఉండటం వల్ల ఆయా కళాశాలల యాజమాన్యాలు వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజు బకాయిలను చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ కళాశాలల యాజమాన్యాలు తమను మానసిక వేదనకు గురి చేస్తున్నారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులు సంక్షేమ శాఖ అధికారులను కోరితే.. అప్పటి ఫీజుల గురించి తమకు తెలియదంటూ దాటవేస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత కళాశాలల యాజమాన్యాలు ఫీజుల విషయంపై ఆరా తీయగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ఆర్థిక శాఖ నుంచి ఇంకా నిధులు విడుదల కాలేదని సంక్షేమ శాఖ అధికారులు అంటున్నారు. కళాశాల యజమానులు విద్యార్థులను వేధింపులకు గురి చేయకుండా ఉండేందుకే ఫీజు విడుదల ప్రకటన చేస్తున్నదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. 2013-14 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను విడుదల చేయలేకపోతున్నట్టు సమాచారం.

విద్యార్థులపై కళాశాలల ఒత్తిడి

కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోవాలని సర్టిఫికెట్లు ఇవ్వాలని విద్యార్థులు కోరినా యాజమాన్యాలు కనికరించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్టిఫికెట్లు కావాలంటే మీ సొంత డబ్బులు చెల్లించండి.. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులను వదులుకోలేమని కళాశాలల యాజమాన్యాలు అంటున్నాయి. ఇప్పటికిప్పుడు ఫీజులు ఎలా చెల్లించాలో తెలియక పేద విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.



కూలికి వెళ్తున్నాం

హైదరాబాద్‌లోని ప్రయివేటు కళాశాలలో ఎంటెక్ పూర్తి చేసి ఆరు నెలలవుతున్నది. 2013-14 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరానికి సంబంధించిన రూ.57 వేల ఫీజు విడుదల కాకకపోవడం వల్ల కళాశాల యాజమన్యాలు మాత్రం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. అంత డబ్బు లేకపోవడం వల్ల రోజు వారి కూలి పని చేస్తున్నాను.

- (షేక్ షబ్బీర్ ఎంటెక్)



ఎంటెక్ చదివి ..

ఎంటెక్ చదివి ప్రస్తుతం ఒక చిన్న కార్యాలయంలో రోజు వారి వేతనంతో పని చేస్తున్నాను. సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఏ కంపెనీలు కూడా ఉద్యోగాలు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు ఇవ్వమని కళాశాల యాజమాన్యాన్ని వేడుకున్నా కనికరించడం లేదు. ఫీజు కట్టే స్థోమత లేకపోవడం చదివిన చదువు వృథా అవుతుంది.

-(కున్‌సోతు అరుణ్‌కుమార్)



ఉద్యోగంపై ఆశలు వదులుకున్న

తన తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఇంజనీరింగ్ వరకు చదివించారు. ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందన్న ఉద్దేశంతో ఎంటెక్ లో చేరాను. మొదటి సంవత్సరం ఫీజును ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో చదువు పూర్తయినా కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించలేదన్న కారణంతో సర్టిఫికెట్టు ఇవ్వడం లేదు. ఇక ఉద్యోగంపై ఆశలు వదులుకున్నాను.

(అసు ప్రసాద్)

టీఎస్‌పీఎస్సీ నామమాత్రమే..!

ఉద్యోగాల భర్తీలో సర్కారు కీలకపాత్ర

సీఎస్, జీఏడీ, న్యాయ, ఆర్థిక శాఖల సమన్వయంతో ముందుకు

- పర్యవేక్షణ బాధ్యత ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి
- న్యాయపరమైన చిక్కుల్లేకుండా నోటిఫికేషన్లు రూపకల్పన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇకనుంచి జరగబోయే ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం కీలకపాత్ర పోషించనుంది. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పాత్ర కీలకంగా ఉంటుందని గతంలో చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు దాని పాత్ర నామమాత్రం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన పలు పోస్టుల భర్తీ విషయంలో టీఎస్‌పీఎస్సీ సీరియస్‌గా వ్యవహరించడం లేదన్నది ఆరోపణగా ఉంది. దీంతో నియామకాల ప్రక్రియలో ప్రభుత్వమే కీలకంగా ఉండాలని భావిస్తున్నట్టు తెలిసింది. 2019లో జరిగే సాధారణ ఎన్నికలే లక్ష్యంగా యువతకు దగ్గరయ్యేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తున్నది. అందులో భాగంగానే రాబోయే కాలంలో 84,876 ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని కేసీఆర్ ప్రకటించడం గమనార్హం. కొన్ని నోటిఫికేషన్ల ప్రక్రియలోనే కోర్టు తప్పుపట్టడం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. అందుకే ముందస్తు జాగ్రత్తల కోసం ఉద్యోగ నియామకాల పర్యవేక్షణ బాధ్యత ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి అప్పగించారని సమాచారం. సీఎస్, జీఏడీ, ఆర్థిక, న్యాయ శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించి రాబోయే నోటిఫికేషన్లను రూపకల్పన చేసే విధంగా కడియం శ్రీహరి ఇప్పటికే కార్యాచరణ మొదలుపెట్టారు. సీఎస్, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, జీఏడీ, ఆర్థిక, న్యాయ శాఖ ఉన్నతాధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యత కడియం శ్రీహరికి అప్పగించడంతో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పాత్ర నామమాత్రమే అని తెలుస్తున్నది. రాతపరీక్షలు సక్రమంగా నిర్వహించి, ప్రశ్నాపత్రంలో తప్పుల్లేకుండా, మూల్యాంకనంలో ఇబ్బందులు రాకుండా నియామకాల ప్రక్రియను పూర్తి చేసే బాధ్యత టీఎస్‌పీఎస్సీపై ఉందని ప్రభుత్వంలో కొందరు అభిప్రాయపడుతున్నారు.

రాజ్యాంగబద్ధ సంస్థ పాత్ర తగ్గించడం సబబేనా...

టీఎస్‌పీఎస్సీ పనితీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం అనుమతి ఇస్తున్నా, న్యాయవివాదాలు తలెత్తకుండా నోటిఫికేషన్లు ఇవ్వడంలో టీఎస్‌పీఎస్సీ తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు తెలిసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ. స్వయంప్రతిపత్తి కలిగి ఉంటుంది. కానీ ప్రతి అవసరానికీ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)పై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్దేశించిన పోస్టులను, ఇచ్చిన అర్హతలు, సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించి నియామకాలు పూర్తి చేయాల్సిన బాధ్యత టీఎస్‌పీఎస్సీపై ఉంది. జీఏడీ వ్యవహారాలు చూసేది ముఖ్యమంత్రి. కానీ ప్రభుత్వ నిర్ణయాలు అమలు, జవాబుదారీతనం మంత్రివర్గం మొత్తానికి సమిష్టి బాధ్యత ఉంటుంది. సీఎం ఇతర పనుల్లో ఉండడం వల్ల జీఏడీని సమన్వయం చేసుకొని పర్యవేక్షించే బాధ్యతను ఉప ముఖ్యమంత్రికి ఇవ్వడంలో తప్పులేదని నిపుణులు అంటున్నారు. సీఎం విచక్షణాధికారంతో ఈ నిర్ణయం తీసుకోవచ్చని చెప్తున్నారు. ఉద్యోగ నియామకాల పర్యవేక్షణ బాధ్యత కడియం శ్రీహరికి అప్పగించడంతో రాజ్యాంగబద్ధ సంస్థ పాత్రను తగ్గించారన్న ఆరోపణలు వస్తున్నాయి. టీఎస్‌పీఎస్సీ పనితీరులో జోక్యం చేసుకోకుండా, కేవలం నియామకాల ప్రక్రియకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికే కడియం శ్రీహరి పరిమితమవుతారని మరికొందరు అంటున్నారు. సీఎస్, జీఏడీ, ఆర్థిక, న్యాయ శాఖలను సమన్వయం చేసుకొని నోటిఫికేషన్లను సమర్థంగా ఎలా ఇవ్వాలన్న అంశానికే ప్రాధాన్యత ఇస్తారని చెప్తున్నారు. కడియం శ్రీహరికే ఈ బాధ్యతలు ముఖ్యమంత్రి అప్పగించడానికి ఉమ్మడి ఏపీలో విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ బాధ్యతలు చూడ్డం, సీనియర్ మంత్రిగా ఉండడం, అనుభవం ఇలా ఎన్నో అంశాలు దోహదపడ్డాయి. ఇంకోవైపు ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసే డీఎస్సీ విద్యాశాఖకు సంబంధించిందే. స్థానిక, స్థానికేతర వివాదాలున్నాయి. పాత పది జిల్లాల ప్రకారమా? లేక 31 జిల్లాల ప్రకారం నోటిఫికేషన్లు జారీ చేయాలా? అన్నదానిపైనా మీమాంస నెలకొంది. ఈ సమస్యలన్నింటినీ అన్ని శాఖలనూ సమన్వయం చేసుకొని ముందుకెళ్లాల్సి ఉంటుంది. అందుకే ఉద్యోగ నియామకాల ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతను కడియం శ్రీహరికి అప్పగించినట్టు తెలిసింది.

ఫ్రీజర్‌లో నటి..



ఫైల్

లండన్: ఉగ్రదాడి నుంచి తప్పించుకుని ప్రాణాలు కాపాడుకునేందుకు భారత సంతతికి చెందిన బ్రిటన్ బుల్లితెర నటి అనేక ఇబ్బందులు పడింది. ఏకంగా రెస్టారెంట్‌లో ఉన్న ఫ్రీజర్‌లో తలదాచుకుని ఉగ్రదాడుల నుంచి తప్పించుకుంది. ఫ్రీజర్‌లో ఉండగానే 'ప్రతీ ఒక్కరూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను' అని ట్వీట్ చేసింది. ఉగ్రవాదులను పోలీసులు మట్టుబెట్టిన సమాచారం తెలుసుకున్న అనంతరం బయటకు వచ్చింది. ' బార్సిలోనా ప్రజలందరికీ జీవితాంతం రుణపడి ఉంటాను' అని మరోసారి ట్వీట్ చేసింది. కాగా, 17న స్పెయిన్‌లో ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. పాదచారులు నడిచే రోడ్డుపైకి ఉగ్రవాదులు వ్యాన్‌ను అతివేగంగా దూసుకెళ్లారు. ఈ ఘటనలో 14 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 100 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రదాడి జరిగిన సమయంలో భారత సంతతికి చెందిన బ్రిటన్ బుల్లితెర నటి లైలా రౌస్ (46) బార్సిలోనాలోని ఓ రెస్టారెంట్‌లో తన కుమార్తె ఇనెజ్‌ఖాన్‌తో ఉన్నారు. ఆ సమయంలో రెస్టారెంట్ బయట ఉగ్రదాడి జరిగినట్టు తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీయడం గమనించారు. ఆమె తన ప్రాణాలను కాపాడుకునేందుకు ఫ్రిజర్‌లో తలదాచుకున్నారు. రౌస్ బ్రిటిష్ టెలివిజన్‌లో పాపులర్ స్టార్‌గా రాణిస్తున్నారు. ఫుట్ బాలర్స్, వైవ్స్, హోల్బీసిటీ వంటి టీవీ కార్యక్రమాల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. బ్రిటిష్ స్నూకర్ ఆటగాడు రోనీని వివాహం చేసుకున్నారు. ఆమె తండ్రి మొరాకో జాతీయుడు కాగా, తల్లి భారత దేశం నుంచి బ్రిటన్‌కు వెళ్లి స్థిరపడింది. రౌస్ 1990లో ఛానెల్ వీ లో పనిచేశారు.

ఫిన్‌లాండ్‌లో ఉన్మాది వీరంగం

హెల్సింకీ : ఫిన్‌లాండ్‌లో ఓ ఉన్మాది కత్తితో వీరంగం సృష్టించాడు. అతని దాడిలో ఇద్దరు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. తుర్క్ పోలీస్ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం...ఫిన్‌లాండ్ పశ్చిమ భాగంలోని తుర్క్ ప్రాంతంలో ఓ వ్యక్తి కత్తితో సంచరించాడు. అతనికి ఎదురుగా వచ్చిన వ్యక్తులపై దాడికి పాల్పడ్డాడు. నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.